

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం : fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,

7-10-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 248 పేజీలు: 16 వెల: 6.50




## శ్రీవారి హుండీ ఆదాయం అదుర్స్

రికార్డు స్థాయిలో కానుకలు

9 నెలల్లో రూ.1,129 కోట్లు

2లో



# ఢిల్లీలో ఇం'ఢీ'

# రాహుల్,ప్రియాంక అరెస్టు

## 'సర్' ఆందోళనల్లో ఇండియా కూటమి ఎంపీలను పెద్ద సంఖ్యలో అదుపులోకి తీసుకొన్న పోలీసులు

ఆకాశవాణి భవన్‌వద్ద హోరెత్తిన నిరసనలు

బారికేడ్లు ఎక్కి జెండా ఎత్తిన రాహుల్

సిఇసిని కలిసేదాకా కదిలేదిలేదన్న విపక్ష ఎంపీలు

జ్ఞానేశ్ రాజీనామా చేయాలని డిమాండ్

తొమ్మిదిగంటలుపైగా కొనసాగిన ఆందోళన

ఎక్కడికక్కడ నేతలను అడ్డుకొన్న పోలీసులు



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా నిరసనకు దిగారు. ఆకాశవాణి భవన్ వద్ద వారు చేపట్టిన ధర్నా సందర్భంగా ఢిల్లీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో, ముఖ్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు ఈ మార్చ్‌ను చేపట్టాయి. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు సాగిన ప్రతిపక్షాల మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా తదితరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల సంఘం కార్యాలయం వైపు మార్చ్‌ను అడ్డుకోవడంతో పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్ వద్దే నిరసన కొనసాగించారు. దాదాపు ఎనిమిది గంటల తర్వాత వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ గాంధీని ఢిల్లీ పోలీసులు లాక్కుని వెళుతూ అదుపులోకి తీసుకుంటున్న వీడియో >>2

## నిబంధనలకు విరుద్ధంగా అడిగారు.. అయినా వినతిపత్రం తీసుకొంటామని చెప్పాం: ఇసి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ఎన్నికల సంఘం కార్యాలయం వద్దకు వచ్చిన రాజకీయ పార్టీలు మంగళవారం సాయంత్రం నాలుగు గంటలవరకూ కూడా ఏ ఒక్కరూ తమ ప్రతినిధులతో ఎన్నికల సంఘం సమావేశంకోసం అపాయింట్‌మెంట్ కోరలేదని భారత ఎన్నికల సంఘం స్పష్టంచేసింది. సిఇసి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్న విపక్ష ఎంపిల నిరసన నేపథ్యంలో ఎన్నికల సంఘం డిప్యూటి డైరెక్టర్ పవన్ పేరిట ప్రకటన >>2

## మోడీ,అమిత్‌షా, మోహన్‌భగవత్ తప్పించుకోలేరు: రాహుల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని మంగళవారం కాంగ్రెస్, ప్రతిపక్ష నేతలు ఎన్నికల ప్రధాన కార్యాయాన్ని ముట్టడించే ప్రయత్నం చేశాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులకు, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలకు మధ్య తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ఈ నిరసనల్లో పాల్గొన్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసీని విమర్శిస్తూ >>2



# ఐటిఎల్‌ఎ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఓకే

## ఎంఎస్‌ఎంఇలకు భారీ ప్రోత్సాహం..

రూ.10వేల కోట్లతో వృద్ధి నిధి

ప్రధాని మోడీ పాలనా రజతోత్సవాన్ని ప్రశంసిస్తూ 'స్టాండింగ్ ఒవేషన్'తో తీర్మానం

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశంలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎస్‌ఎంఎస్‌ఇలకు) వృద్ధి ఆధారిత మూలధనాన్ని అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసేందుకు, రూ.10వేల కోట్లతో ఎస్‌ఎంఇ వృద్ధి నిధికి కేంద్రం కేటాయింపులకు ఆమోదం తెలిపింది. తయారీ, సేవలు, టెక్నాలజీ, ఆవిష్కరణల ఆధారిత రంగాలు, వ్యూహాత్మక విలువ గొలుసుల వంటి వివిధ రంగాలలో అగ్రగామి భారతీయ సంస్థలు ఆవిర్భవించేలా చేయడమే ఈ నిధి లక్ష్యం. మొత్తం ఎంఎస్‌ఎంఇ వ్యవస్థకు ఈక్విటీ, ద్రవ్య లభ్యత, వృత్తిపరమైన మద్దతు అందించడంపై దృష్టి సారిస్తూ, కేంద్ర బడ్జెట్ 2026-27లో చేసిన సమగ్ర ప్రకటనలలో ఇది కూడా ఒక భాగమని కేబినెట్ భేటీ అనంతరం మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈక్విటీ మద్దతును అందించే నిధులు ఇప్పటికే ఉన్నప్పటికీ, వాటిలో అధికశాతం ప్రారంభ దశలోని సంస్థలపై దృష్టి సారిస్తాయి. ప్రధానంగా సూక్ష్మ పరిశ్రమలకే పరిమితమవుతాయి. దీనివల్ల చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఈక్విటీ వృద్ధి మూలధనం విషయంలో ఒక నిర్మాణాత్మక అంతరం ఏర్పడు తుంది. దేశంలో రవాణా, లాజిస్టిక్ రంగాల సమగ్ర అభివృద్ధి, పరిశోధన అలాగే వివిధ రవాణా మార్గాల అనుసంధానానికి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు కేంద్రం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ (ఐటిఎల్‌ఎ) ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ అథారిటీ ద్వారా రైల్వేలు, రోడ్లు, పోర్టులు, విమానయాన రంగాలు మరింత మెరుగైన పద్ధతిలో అనుసంధానం కానున్నాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రణాళిక, వాటి >>2

# సమన్వయంతో ముందుకు..



మంగళవారం సిఎం చంద్రబాబు,డి.సిఎం పవన్ భేటీ దృశ్యం

స్థానిక ఎన్నికలపై చంద్రబాబు, పవన్ నిర్ణయం

సిఎం నివాసంలో మూడుగంటలు సుదీర్ఘ భేటీ

సీట్ల సర్దుబాటు, ఏయే స్థానాల్లో పోటీపైనే చర్చ

విశాఖలో రక్షణ మంత్రి పర్యటనతో మాధవ్ గైర్హాజరు

బిజెపి చీఫ్‌కు సమావేశం వివరాలు చేరవేత

**అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు, డి.సిఎం పవన్ కల్యాణ్‌లు మంగళవారం ఉదయం భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి నేతలు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఇరువురు సిఎం చంద్రబాబు నివాస గృహ ప్రాంగణంలోని మజిలీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. కూటమి సమన్వయానికి మరింత పదును పెడుతూ స్థానిక ఎన్నికల కసరత్తును ముందుకు తీసుకెళ్లే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల మధ్య కీలక భేటీ జరిగింది. దాదాపు రెండు గంటల పాటు సాగిన సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి వ్యూహం, స్థానాల సర్దుబాటు, ఏ స్థానాల్లో ఎవరు పోటీ చేయాలన్న అంశాలపై ఇద్దరు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బిసి రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో జరుగుతున్న పరిణామాలతో పాటు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సమన్వయ కమిటీల ఏర్పాటు, మూడు పార్టీల మధ్య సమన్వయంపై సమాలోచనలు జరిగినట్లు సమాచారం. ఇప్పటికే ఆరేడు దఫాలు మూడు పార్టీల నేతలు సమావేశమై కూటమి సమన్వయంపై చర్చించగా క్షేత్రస్థాయిలోనూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ వన్ టు వన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. చంద్రబాబుతో కలిసి పవన్ కల్యాణ్ అల్పాహార >>2

## నేడు హస్తినకు చంద్రబాబు

కేబినెట్ భేటీ అనంతరం ఢిల్లీకి ముఖ్యమంత్రి పయనం

ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో భేటీ అయ్యే అవకాశం

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి దేశ రాజధాని ఢిల్లీ బాటకు సిద్ధమయ్యారు. బుధవారం ఉదయం రాష్ట్ర సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరగనుంది. కేబినెట్ >>2

## బిసి రిజర్వేషన్లపై న్యాయ పోరాటం

ఢిల్లీలో న్యాయ నిపుణులతో రాష్ట్ర మంత్రుల సమావేశం

34శాతం దక్కేలా కూటమి ప్రభుత్వం రాజీలేని పోరాటం

మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, పార్థసారథి, సత్యప్రసాద్ వెల్లడి

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్ల వ్యవహారంపై తీవ్ర ఆలోచన చేస్తోంది. ఈ వ్యవహారం ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీకి చేరుకుంది. స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఢిల్లీలో న్యాయనిపుణుల >>2



## ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు ఫిజిక్స్ నోబెల్

ఖగోళ న్యూట్రినోలపై విశేష పరిశోధన

ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ ఏర్పాటుకు కృషి

**స్టాక్‌హోమ్, అక్టోబరు 6:** భౌతిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ బహుమతిని ఈ ఏడాది అమెరికాలోని విస్కాన్సిన్ మాడిసన్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్ గెలుచుకున్నారు. దక్షిణ ధ్రువంలో ఐస్క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటుకు ఆయన చేసిన విశేష కృషి, అత్యంత శక్తిమంతమైన ఖగోళ న్యూట్రినోలను కనుగొన్నందుకు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మంగళవారం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. న్యూట్రినోలు అనేవి విశ్వమంతా వ్యాపించి ఉండే అతి సూక్ష్మమైన కణాలు. ఇవి మనల్ని, మన భూమిని కూడా దాటుకొని నిరంతరం ప్రయాణిస్తూనే ఉంటాయి. కానీ, వీటిని గుర్తించడం చాలా కష్టం. ఎందుకంటే ఇవి దేనితోనూ సులభంగా చర్య జరపవు. అరుదుగా ఏదైనా అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు >>2

# అమరావతికి మరో రూ.1,200 కోట్లు

నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఆదేశం

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గతంలో ఐదేళ్ల పాటు ఆగిపోయిన పనుల్ని శరవేగంగా పూర్తి చేసేందుకు వరుసగా ప్రణాళికలు సిద్ధం చేసి, వాటిని అమల్లో పెడుతున్న ప్రభుత్వం అందుకు తగిన నిధుల్ని కూడా భారీగా కేటాయిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం మరో రూ. 1200 కోట్ల విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ జిఒ ఇచ్చింది. ఈ రూ.1200 కోట్ల నిధు లను అమరావతి క్యాపిటల్ సిటీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద ప్రధాన పనుల అమలుకు >>2

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు పట్టాలెక్కించండి!

కేంద్రంతో సమన్వయం చేసుకుని సత్వరమే పూర్తి చేయాలి

రాజధానిలో నెలకు రూ.2 వేల కోట్ల పనులు చేయాలి

నిర్మాణ సంస్థలతో సిఎం సమీక్ష, అధికారులకు ఆదేశాలు

**అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో నెలకు రూ.2 వేల కోట్ల విలువైన పనులు జరిగేలా ప్రణాళికతో పనిచేయాలని సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాజధాని అమరావతి పనులపై క్యాంపు కార్యాలయంలో మంగళవారం అధికారులు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నెల వారీ సమీక్ష నిర్వహించారు. రాజధాని పరిధిలో చేపట్టిన 152 ప్రాజెక్టుల్లో 41 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని మంత్రి >>2

# పాక్ స్పై నెట్‌వర్క్

ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర కలకలం, నావికా దళం, రక్షణ సంస్థలపైనే గురి

'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026'తో కౌంటర్ ఇంటెలిజెన్స్

18 మంది అనుమానితులు గుర్తింపు

10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సోదాలు

ఇద్దరు అరెస్టు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాధీనం

విశాఖలో సివిలియన్ కాంట్రాక్ట్ డ్రైవర్ అరెస్ట్‌తో గుట్టురట్టు

**అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో కౌంటర్ ఇంటెలిజెన్స్ చేపట్టిన 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' సంచలనాకి దారి తీసింది. అనుహ్యంగా నేవీకి చెందిన వారితో సహా మొత్తం 18 మందిని అనుమానితులుగా 'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' గుర్తించింది. వీరిలో 13 మంది నేవీ సిబ్బంది ఉన్నట్లు పేర్కొన్నారు. పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో నేరుగా సంబంధాలు కొనసాగించినట్లు అనుమానిస్తున్న నేపథ్యంలో కీలక దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఎపి, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు మొత్తం 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. 12 కౌంటర్ ఇంటెలిజెన్స్ బృందాలు ఈతనిఖీల్లో పాల్గొన్నాయి. అనుమానితుల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకుని, వాటిలోని సమాచారాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విశాఖపట్నంలోని నేవీ,రక్షణ సంస్థలకు సంబంధించిన సున్నితమైన, రహస్య సమాచారాన్ని లక్ష్యంగా చేసుకుని గూఢచర్యం జరిగిందా?అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ ఛానళ్ల ద్వారా కీలక సమాచారాన్ని పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌కు చేరవేశారా అనే అంశాన్ని కౌంటర్ ఇంటెలిజెన్స్ పరిశీలిస్తోంది. అనుమానితుల్లో ఇద్దరి పాత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించినట్లు అధికారులు చెబుతున్నారు.

**విశాఖలో సివిలియన్ కాంట్రాక్ట్ డ్రైవర్ అరెస్ట్‌తో గుట్టురట్టు:** ఈ కేసులో విశాఖకు చెందిన సివిలియన్ >>2

ఎకో టూరిజం ప్రాజెక్టులతో

## కొత్త అనుభూతి

అన్ని ప్రాంతాలను కలిపేలా పర్యాటక అభివృద్ధి

6 నగరవనాలను వర్చువల్‌గా ప్రారంభించిన డి.సిఎం పవన్

**అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలను ప్రకృతిలో మమేకం చేసి, వారికి మరిచిపోని మధురానుభూతులను ఇవ్వడంతోపాటు, గిరిజనులకు ఎకో టూరిజం జీవనోపాధులు మెరుగుపర్చడం ప్రభుత్వం ముందున్న లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. నల్లమల నుంచి మారేడుమిల్లి వరకు, బాపట్ల తీర ప్రాంత అందాల నుంచి కోటప్పకొండ ఆధ్యాత్మిక ప్రయాణం వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పర్యాటక కళను తీసుకొచ్చేలా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో నూతనంగా నిర్మితమైన 6 నగరవనాలను ఉప ముఖ్యమంత్రి మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "నగర వన యోజన కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్రంలో 19 నగర వనాలుంటే, ఇప్పుడు ప్రారంభించిన ఆరు >>2





మంగళవారం విశాఖలో జరిగిన సభలో మాట్లాడుతున్న కేంద్రరక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

హెచ్‌ఎస్‌ఎల్ కొత్త చరిత్ర

# ఫ్లీట్ సపోర్ట్ షిప్ 'సూర్య' జల ప్రవేశం

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చేతుల మీదుగా ప్రారంభం

45వేల డిడబ్ల్యుటి వరకు నౌకల నిర్మాణానికి స్లిప్‌వే-4 అభివృద్ధి

విశాఖను మెరైన్ ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దాలని పిలుపు

**విశాఖపట్నం, అక్టోబరు 6, ప్రభాతవార్త:** విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్)లో స్వదేశీ నౌకా నిర్మాణ సామర్థ్యానికి మరింత ఊతమిచ్చే కీలక కార్యక్రమాలు మంగళవారం జరిగాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్-1)ను ప్రారంభించడంతో పాటు ఐదో ఫ్లీట్ సపోర్ట్ షిప్ (ఎఫ్‌ఎస్‌ఎస్-5)కు కీల్ వేశారు. అలాగే అభివృద్ధి చేసిన స్లిప్‌వే-4, 300 టన్నుల గోలియత్ క్రేన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ "ఎఫ్‌ఎస్‌ఎస్-1 ప్రారంభం సాధనకు ప్రతీక.. ఎఫ్‌ఎస్‌ఎస్-5కు కీల్ వేయడం సంకల్పానికి ప్రతీక.. కొత్త స్లిప్‌వే పెరుగుతున్న సామర్థ్యానికి ప్రతీక" అని పేర్కొన్నారు. హెచ్‌ఎస్‌ఎల్ నౌకా నిర్మాణ సామర్థ్యాన్ని పెంచుకోవడంతో పాటు దేశ సముద్ర శక్తికి పునాదులను మరింత బలోపేతం చేస్తోందన్నారు.

**'సూర్య'తో నౌకాదళానికి మరింత సామర్థ్యం:** >>2

7-10pg2exHMNWJQE.qxd:7-10pg2exHMNWJQE.qxd 1/1/02 6:29 AM Page 1





మంగళవారం న్యూఢిల్లీలో ఏపీలో స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లపై న్యాయనిపుణులతో చర్చిస్తున్న కేంద్ర,రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు

# సమన్వయంతో ముందుకు..

>>విందులో పాల్గొన్నారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్‌కు ముందే కూటమి బలాబలాలు, స్థానాల పంపకం, సమన్వయ యంత్రాంగాన్ని ఖరారు చేసే దిశగా ఈ భేటీ కీలక అడుగని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తమ నివాసానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ఎదురెళ్లి స్వాగతం పలికారు. సమావేశం అనంతరం సిఎం చంద్రబాబు పవన్ వాహనం వరకూ వెళ్లి వీడ్కోలు పలికారు. విశాఖలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉండటంతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ సమావేశానికి హాజరు కాలేదు. మాధవ్‌కు సిఎం, డి.సిఎంల నడుమ జరిగిన చర్చాంశాలను వివరించినట్లు సమాచారం.

# బిసి రిజర్వేషన్లపై న్యాయ పోరాటం

>>తో రాష్ట్ర మంత్రులు కీలక మంతనాలు జరిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొల్లు పార్థసారథి న్యాయ నిపుణులతో సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిపై హైకోర్టు ఇచ్చిన తీర్పు తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంలో అనుసరించాల్సిన వ్యూహం, కోర్టులో బలమైన వాదనలు వినిపించేందుకు అవసరమైన న్యాయపరమైన అంశాలపై చర్చలు జరిగినట్లు సమాచారం. బిసి రిజర్వేషన్ల అంశాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో సుప్రీంకోర్టులో తమ వాదనలను సమర్థవంతంగా వినిపించేందుకు అవసరమైన అన్ని అంశాలను సిద్ధం చేసుకోవాలని మం త్రులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. న్యాయ నిపుణులతో జరిగిన ఈ సమావేశం తదుపరి న్యాయపరమైన కార్యాచరణకు కీలకంగా మారే అవకాశం ఉంది.

**రాజీలేని పోరాటం:** స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని స్పష్టం చేస్తూ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు రాష్ట్ర మంత్రులు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ న్యూఢిల్లీలోని ఎపి భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్‌లో సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వ హించారు. బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా వారు ఉద్ఘాటించారు. సుప్రీంకోర్టు ద్వారా న్యాయం సాధించేందుకు ప్రభుత్వం పోరాటం చేస్తోందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని అధిగమించేందుకు తగిన ఎంపైరికల్ డేటాతో సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పులను పూర్తిగా అధ్యయనం చేసి, వాటి ఆధారంగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బిసిల మీద కొందరికి ఉన్న రాజకీయ, వ్యక్తిగత కక్ష కారణంగానే వారికి దక్కాల్సిన అవకాశాలను అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. బిసిలకు తగిన ప్రాధాన్యం కల్పించడం, వారికి రాజకీయంగా, సామాజికంగా ఎప్పుడూ అన్యాయం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రధాన సిద్ధాంతమని ఆయన స్పష్టం చేశారు. బిసి రిజర్వేషన్లు సక్రమంగా అమలులోకి వస్తే సుమారు 16,800 పోస్టులు బిసిలకు దక్కుతాయని ఆయన తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌ల నుంచి మొదలుకుని ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు, మేయర్‌లుగా ఎదిగి, భవిష్యత్తులో చట్టసభలకు, అసెంబ్లీలు, పార్లమెంట్‌కు వెళ్లే గొప్ప అవకాశాలు వీరికి లభిస్తాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. న్యాయ పోరాట వ్యూహాలపై చర్చించేందుకు ముగ్గురు మంత్రుల బృందం ఢిల్లీకి రావడం జరిగిందని అచ్చెన్నాయుడు.

తెలిపారు. ప్రముఖ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, దేవదత్ కామత్ చర్చించినట్లు ఆయన వెల్లడించారు.గత ప్రభుత్వం ఎలాంటి చట్ట సవరణ చేయకుండా, కనీసం సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా బలహీన వర్గాల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని మంత్రి తీవ్రంగా విమర్శించారు.

**బిసిల అభ్యున్నతి, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం:** రాష్ట్రంలో బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించడంతో పాటు, వారికి రాజకీయ, ప్రజాస్వామ్య సాధికారత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ రాష్ట్రం బాగుండాలని కోరుకుంటారని అన్నారు. ప్రపంచం మెచ్చిన నాయకుడైన ఆయన ఎన్నో రాజకీయ ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షి స్తారన్నారు. అందుకే ఇప్పటివరకు పలు మార్లు ఢిల్లీకి ఆయన వచ్చారని, సిఎం ఢిల్లీ పర్యటన నేపథ్యంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులుగా ఆయన సమాధానం ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఐటిఎల్ఎ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఓకే

>> అమలును పర్యవేక్షి ంచడంలో ఈ అథారిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది. రవాణా ప్రణాళిక కోసం ఒక ఏకీకృత చట్రాన్ని సృష్టించే లక్ష్యంతో, దీర్ఘకాలిక రవాణా ప్రణాళికలను రూపొందించడానికి, ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అంచనా వేయడానికి, అలాగే రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానయానం, జలమార్గాలు, పట్టణ రవాణా రంగాల నుండి డేటాను ఏకీకృతం చేయడానికి సమీకృత రవాణా, లాజిస్టిక్స్ అథారిటీ (ఐటిఎల్ఏ) దోహదపడనుంది. “లాజిస్టిక్స్ అవ సరం పెరుగుతోంది. వాస్తవానికి, జిడిపి 7శాతం పెరిగితే, లాజిస్టిక్స్ అవసరం 10శాతం పెరుగు తుంది” అని మంగళవారం కేబినెట్ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల ప్రణాళిక ఉండేలా చూసేందుకు ఈ అథారిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వైష్ణవ్ తెలిపారు.

**“స్టాండింగ్ ఒవేషన్”తో తీర్మానం:** ప్రభుత్వ అధినేతగా ఒక కార్యనిర్వాహక పదవిలో 25యేళ్ల పాటు నిరంతర నాయకత్వంలో మైలురాయిని చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అభినందనలు తెలుపుతూ ఆయన విశిష్ట నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఒక తీర్మానాన్ని ఆమోదించి, నిలబడి చప్పట్లు కొట్టింది. గుజరాత్‌లో మూడుసార్లు అఖండ మెజారిటీతో, వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో లభించిన మద్దతుతో ఇది సాధ్యమైందని, ఇది ప్రధాని మోడీపై ప్రజలు ఉంచిన అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాతో అన్నారు. “ప్రపంచంలోని అతి కొద్ది దేశాల్లో మాత్రమే ప్రజలు ఒక నాయకుడికి నిరంతరం మద్దతు ఇస్తారు” అని ప్రధాని మోడీ సాధించిన ఘనతను విశిష్టమైనదిగా అభివర్ణిస్తూ వైష్ణవ్ అన్నారు. “ఆ విశ్వాసం ఆయన పనితీరు, సరైన విధానాలు, స్వచ్ఛమైన ఉద్దేశాల నుండి వచ్చింది” అని పేర్కొన్నారు.

# అమరావతికి మరో రూ.1,200 కోట్లు

>>వినియోగించనున్నారు. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు రుణాలతో చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించిన ఖర్చుల కోసం ఎపి సిఆర్‌డిఏ ఖాతాలో ఈ నిధులను జమ చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రాజెక్టుల అమలుకు అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులు సిద్ధం చేసి, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్‌కు సమర్పించాలని ప్రభుత్వం సూచించింది.దీంతో త్వరలోనే సిఆర్‌డిఏ ఖాతాలో ఈ నిధులు జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు అమరావతిలో ప్రధానమైన పనుల్నీ వచ్చే యేడాది చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. ఆ మేరకు క్షేత్రస్థాయిలో అధికారుల్ని పరుగులు తీయిస్తోంది. అందుకు తగినట్లుగానే అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకుంటున్న రుణాలు కూడా సకాలంలో అందుతుండటంతో ఈ మేరకు ప్రభుత్వం కూడా నిధుల్ని ఎప్పటికప్పుడు విడుదల చేస్తోంది.

# పాక్ స్పై నెట్‌వర్క్

>>కాంట్రాక్ట్ డ్రైవర్ అన్నం సాయి వరప్రసాద్‌ను ఎపి కౌంటర్ ఇంటెలిజెన్స్ అరెస్ట్ చేసింది. దాంతో గుట్టు రట్టయింది. నేవీ, రక్షణ సంస్థలకు సంబంధించిన రహస్య సమాచారాన్ని పాక్ ఆపరేటివ్‌కు చేరవేసినట్లు అన్నం సాయిపై ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు ప్రతిఫలంగా డబ్బులు తీసుకున్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోంది. ఆయనను కోర్టులో హాజరుపరచగా అక్టోబరు 14 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో విశాఖ జిల్లా జైలుకు తరలించారు.

**కోయంబత్తూరులో మరో నేవీ ఉద్యోగి అరెస్ట్:** ఇదే కేసులో కోయంబత్తూరులో మరో నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీని కూడా కౌంటర్ ఇంటెలిజెన్స్ అదుపులోకి తీసుకుంది. పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌కు చెందిన వాట్సాప్ యాక్టివేషన్ కోసం ఓటిపి షేర్ చేసినట్లు ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. అలాగే పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో కమ్యూనికేషన్, కీలక సమాచారాన్ని చేరవేసిన అంశాలపై అధికారులు విచారణ చేస్తున్నారు. ప్రదీప్ ముఖర్జీని ట్రాన్సిట్ వారెంట్‌పై కోయంబత్తూరు నుంచి విజయవాడకు తరలించారు. అనంతరం కోర్టు అక్టోబరు 14 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో ఉన్నట్లు సమాచారం. మిగిలిన అనుమానితులపై దర్యాప్తు

మొత్తం 18 మంది అనుమానితుల్లో మిగిలిన 16 మందికి సంబంధించిన పాత్రపై కౌంటర్ ఇంటెలిజెన్స్ దర్యాప్తు కొనసాగుతోంది. పాక్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో వారి సంబంధాలు, సమాచార మార్పిడి, ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం, ఆర్థిక లావాదేవీలు వంటి అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జాతీయ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశం కావడంతో దర్యాప్తు పురోగతిపై పూర్తి వివరాలను అధికారులు వెల్లడించడం లేదు.

అయితే, విశాఖలోని నేవీ, రక్షణ సంస్థలకు సంబంధించిన కీలక సమాచారం బయటకు వెళ్లిందా? ఈ నెట్‌వర్క్ వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో ‘ఆపరేషన్ ఫైర్‌వాల్-2026’ దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.

# రాహుల్, ప్రియాంక అరెస్టు

>>ను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ వీడియోకు ప్రతి గుర్తుండిపోతుంది అనే వ్యాఖ్యను జత చేసింది. ఇదిలా ఉంటే నిర్వాచనసదన్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో రాహుల్‌ప్రియాంక వేణుగోపాల్ తదితరులు బారికేడ్లపైనే నిలిచి నిరసన తెలిపారు.ఎన్నికల కమిషన్ విపక్షాలకు భయపడుతోందని, ఎన్డీయేతర పోలీసులు మద్దతుతో సర్వప్రక్రియపై నిరసనను అడ్డుకుంటున్నదంటూ ఆరోపించారు. బారికేడ్లు ఎక్కి మరీ రాహుల్ తన నిరసన తెలిపారు. ఎన్నికల సంఘ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న ఆకాశవాణి వద్ద కాంగ్రెస్ శ్రేణులు గుమికూడి భైఠాయింపునిరసన తెలిపారు. ఇండియా కూటమి ఎంపీలు అత్యధికసంఖ్యలో ఈనిరసనలో పాల్గొన్నారు. ఒకదశలో అదుపులోకి తీసుకున్న తర్వాత రాహుల్ గాంధీ బస్సునుంచి బయటకు దిగేందుకు కూడా విఫల యత్నంచేసారు. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. వీరంతా కలిసి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓట్ల చోరీ ద్వారా మోడీ, అమిత్ షా, మోహన్ భగవత్ దేశాన్ని హైజాక్ చేశారని ఆరోపించారు. ఈ ప్రక్రియకు జ్ఞానేష్ కుమార్ సహకరించారని విమర్శించారు. బీజేపీని ఎదుర్కోవడమే తమ లక్ష్యం కాదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడు తున్నామని అన్నారు. వారిని ఓడిస్తామంటూ బీజేపీకి వార్నింగ్ ఇచ్చారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈసీ కార్యాలయానికి కాంగ్రెస్ , ఇతర ప్రతిపక్షాలు ర్యాలీగా వెళ్లి ముట్టడించే ప్రయత్నం చేశాయి. ఆకాశవాణి భవన్ సమీపంలో రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వీరిద్దరూ రోడ్డుపైనే కూర్చుని నిరసన తెలిపారు. ప్రతిపక్ష ఎంపీలు సీఈసీని కలవాలని అనుకుంటున్నారని, కానీ పోలీసులు ఇక్కడే నిలిపేశారని, కానీ జ్ఞానేష్ కుమార్ భయపడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, టీఎంసీ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ సహా పలువురు ప్రతిపక్ష నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా అడిగారు..

>>విడుదలయింది. చేపట్టిన మార్చ్ నేపథ్య మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఏ రాజకీయ పార్టీ కూడా తమ ప్రతినిధుల ద్వారా ఎన్నికల సంఘంతో సమావేశం కోసం అపాయింట్‌మెంట్ కోరలేదని ఈసీఐ స్పష్టం చేసింది. అనంతరం సుమారు 4 గంటల సమయంలో, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఎంపీల ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలిసి వినతిపత్రం సమర్పించాలనుకుంటున్నట్లు ఢిల్లీ పోలీసుల ద్వారా సమాచారం అందిందని తెలిపింది. అయితే, 4 గంటల తర్వాత ఎంపీలతో సమావేశంపై ఎన్నికల సంఘం పరిశీలన జరుపుతున్న సమయంలో, సుమారు 240 మంది ఎంపీలతో కూడిన బృందం సమావేశం కావాలని కోరుకుంటున్నట్లు, అలాగే సమావేశం పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో నిర్వహించాలని ప్రతిపాదించినట్లు ఢిల్లీ పోలీసుల డీసీపీ ద్వారా సమాచారం అందిందని ఈసీఐ తెలిపింది. ఈ అభ్యర్థన తమ సాధారణ విధానానికి భిన్నంగా ఉన్నందున అంగీకరించలేకపోయామని ఎన్నికల సంఘం పేర్కొంది. ఏ రాజకీయ పార్టీ అయినా ఎప్పుడైనా ఎన్నికల సంఘంతో సమావేశం కోసం అభ్యర్థించవచ్చని, సమయం, షెడ్యూల్‌ను పరిగణనలోకి తీసుకుని కమిషన్ సమావేశానికి తేదీ, సమయాన్ని నిర్ణయిస్తుందని ఎన్నికలసంఘం డిప్యూటి డైరెక్టర్ పవన్‌పేరిట ప్రకటన విడుదలచేసింది.

## మోడీ,అమిత్‌షా, మోహన్‌భగవత్ తప్పించుకోలేరు: రాహుల్

>> కేంద్రాన్ని టార్గెట్ చేశారు. ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. వీరంతా కలిసి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మన దేశానికి జరిగింది దేశద్రోహం. ఎవరూ తప్పించుకోలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. బీజేపీని ఎదుర్కోవడమే తమ లక్ష్యం కాదని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్నామని అన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని, స్పెషల్‌ఇంటెన్సివ్ రివిజన్ ద్వారా ఓటర్లను తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈసీ కార్యాలయానికి కాంగ్రెస్,ఇతర ప్రతిపక్షాలు ర్యాలీగావెళ్లి ముట్టడించే ప్రయత్నం చేశాయి.

# ఎకో టూరిజం ప్రాజెక్టులతో కొత్త అనుభూతి

>>నగరవనాలతో కలిపి 25 నగరవనాలు రాష్ట్రంలో ఏర్పడతాయి. 305 హెక్టార్లలో, రూ.13 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ నగరవనాలు కేవలం మొక్కలు నాటే ప్రాంతాలుగా కాకుండా, ప్రజలను ప్రకృతి ఒడిలోకి తీసుకెళ్లే మార్గంగా ఉంటాయి. నగరవనాల్లో సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లలు ఆడుకునే ప్రాంతాలు, జిమ్ పరికరాలు వంటివి అందుబాటులో ఉంటాయి. వినుకొండ, దేవరంపాడు, మాచర్లలో ఏర్పాటు చేసే నగరవనాలు ఆకర్షణీయంగా ఉంటాయి. వెలిగోడు జంగిల్ సఫారీతో సరికొత్త అనుభూతులు లభిస్తాయి. మారేడుమిల్లి ట్రెక్కింగ్, ఆరోమా కనోపీ వాక్ ద్వారా తూర్పు కనుమల అటవీ అందాలను, ప్రకృతి పరిమళాలను ప్రజలకు చేరువ చేస్తాం. అనంతరం ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ రూపొందించిన వైల్డ్ ఆర్నమెంటల్ ప్లాంట్స్ ఆఫ్ ద నల్లమల ఫారెస్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ట్రీ టాన్స్ లోకేషన్ మాన్యువల్ పుస్తకాలను ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ దేశంతోనే మొదటిసారి ‘ఈకోలిప్టస్ పల్ప్ ఉడ్ ప్లాంటేషన్స్’ విభాగంలో అనుసరిస్తున్న సుస్థిర నిర్వహణ పద్ధతులకు గుర్తింపుగా సాధించిన ప్రమాణ్ సర్టిఫికేట్‌ను డిప్యూటీ సిఎం చేతుల మీదుగా అటవీశాఖ అధికారులు అందుకున్నారు. పట్టణాలకు పచ్చని ఊపిరి నగరవనాలు బాపట్ల, చీరాల, కోటప్పకొండ, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్లలో మొత్తం 304.60 హెక్టార్ల విస్తీర్ణంలో నగరవనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

# నేడు హస్తినకు చంద్రబాబు

>>భేటీ అనంతరం, మధ్యాహ్నం ముఖ్య మంత్రి చంద్రబాబు హస్తినకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీతో చంద్రబాబు భేటీ అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధానితో చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

అదేవిధంగా గురు వారం కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌తో కూడా చంద్రబాబు సమావేశం కానున్నట్లు సమాచారం. ఈ భేటీలో ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రాజెక్టు భూసే కరణ, పునరావాస ప్యాకేజీ కోసం కేంద్రం నుంచి రూ.33 వేల కోట్లు మంజూరు చేయాలని సిఎం కోరనున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేను జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ నిర్మాణానికి అవసరమైన రూ.2,300 కోట్ల నిధులను కేంద్రం నుంచి కేటాయించాలని కూడా చంద్రబాబు కోరనున్నట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు పనులు, భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం, అనుసంధాన మౌలిక వసతులకు సంబంధించిన నిధులపై కేంద్రంతో సిఎం చంద్రబాబు చర్చించనున్నారు. దీంతో చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ ఇంకా విడుదల కావాల్సి వుంది.

# ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు ఫిజిక్స్ నోబెల్

>> మాత్రమే వీటి ఉనికిని పసిగట్టడం సాధ్యమవుతుంది. విశ్వంలో జరిగే అతి శక్తిమంతమైన ప్రక్రియల నుంచి ఈ న్యూట్రినోలు పుడతాయి. ఇతర కణాల్లా కాకుండా, న్యూట్రినోలు తమ దిశను మార్చుకోకుండా, శక్తిని కోల్పోకుండా నేరుగా మనల్ని చేరతాయి. అందువల్ల, విశ్వంలోని రహస్యాలను ఛేదించడానికి ఇవి కీలక సమాచారాన్ని అందిస్తాయి. దక్షిణ ధ్రువంలోని స్వచ్ఛమైన మంచును ఉపయోగించి న్యూట్రినోలను పట్టుకోవచ్చనే అద్భుతమైన ఆలోచనను ఫ్రాన్సిస్ హాల్జెన్ తొలిసారిగా 1988లో ప్రతిపాదించారు. మంచులో న్యూట్రినో అణు కేంద్రకంతో ఢీకొన్నప్పుడు ఒక కాంతి వెలువడుతుందని, ఆ కాంతిని సెన్సార్ల ద్వారా గుర్తించవచ్చని ఆయన భావించారు. భూకంపాలు లేని స్థిరమైన భౌగోళిక ప్రాంతం కావడం, ఇతర జోక్యాలు తక్కువగా ఉండటంతో దక్షిణ ధ్రువం ఈ ప్రయోగానికి అత్యంత అనువైనదిగా నిరూపితమైంది. కొద్దికాలంలోనే ఆయన ఆలోచనకు ఇతర శాస్త్రవేత్తల మద్దతు లభించింది. అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోలు చాలా అరుదుగా కనిపిస్తాయి కాబట్టి, వాటిని గుర్తించడానికి భారీ పరిమాణంలో మంచు అవసరం. ఈ క్రమంలోనే ఒక క్యూబిక్ కిలోమీటరు విస్తీర్ణంలో సెన్సార్లతో కూడిన ఐస్‌క్యూబ్ అబ్జర్వేటరీ’ని 2011లో పూర్తి చేశారు. కొద్ది కాలంలోనే పరిశోధకులు తొలిసారిగా అధిక శక్తి కలిగిన న్యూట్రినోలను గుర్తించారు. సౌర వ్యవస్థకు ఆవల నుంచి వస్తున్న న్యూట్రినోల ఆవిష్కరణను ప్రకటించి, విశ్వంలోని న్యూట్రినో మూలాలను వెతికే అన్వేషణకు మార్గం సుగమం చేశారు. ఫ్రాన్సిస్ హాల్జెన్ ఒక అంతర్జాతీయ బృందానికి నాయ కత్వం వహించి మనకు ఒక అద్భుతమైన పరికరాన్ని అందించారు. ఆయన పట్టుదల, శాస్త్రీయ దార్శనికత ఖగోళ శాస్త్రంలో ఒక కొత్త శకానికి దారితీశాయని నోబెల్ కమిటీ ఫర్ ఫిజిక్స్ ఛైర్మన్ మార్క్ పియర్స్ ప్రశంసించారు. ఐస్‌క్యూబ్ ద్వారా లభించే సమాచారం విశ్వంలోని భయం కరమైన ప్రక్రియల గురించి కొత్త విషయాలను వెల్లడించడమే కాకుండా, మునుపెన్నడూ తెలియని ఖగోళ రహస్యాలను కూడా బహిర్గతం చేయగలదని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు.

# శ్రీవారి హుండీ ఆదాయం అదుర్స్

## రికార్డు స్థాయిలో కానుకలు, 9 నెలల్లో రూ.1,129 కోట్లు

**తిరుమల, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేం కటేశ్వరస్వామి ఖజానా గలగలమోగుతోంది. ప్రతి నెలా వడ్డీకాసుల వేంకన్నకు భక్తులు ముడుపులుగా చెల్లించుకుంటున్న హుండీ కానుకలు రూ.120-140కోట్ల మధ్య ఆదాయం చేకూరుతోంది. ఈ యేడాది తొమ్మిదినెలల్లోనే శ్రీవారి హుండీ ఆదాయం గణనీయంగా రికార్డుస్థాయిలో నమోదవడం విశేషం. రూ.1,129 కోట్ల వరకు టిటిడికి ఆదాయం చేకూరింది. ఈ యేడాది 2026 జనవరి నెల నుండి వరుసగా ప్రతినెలా రూ.వంద కోట్లు పైగానే ఆదాయం చేకూరడం విశేషం. గడచిన సెప్టెంబరు నెలలో రూ.126.41 కోట్లు, ఆగస్టులో రూ.137.44 కోట్లు, జులైలో రూ.140.25 కోట్లు, జూన్‌లో రూ.124.49 కోట్లు, మే లో రూ.113.53 కోట్లు, ఏప్రిల్‌లో రూ.115.97 కోట్లు హుండీ కానుకల ఆదాయం చేకూరింది. ఇక వడ్డీకాసుల వెంకన్నకు వరుసగా ఈ యేడాది మార్చి నెలలో స్వామివారికి రూ.125.76 కోట్లు, ఫిబ్రవరిలో 28రోజులకుగాను రూ.107.36కోట్లు, 2026 జనవరిలో రూ.124.55 కోట్లు భక్తుల కానుకల రూపంలో చేకూరింది. ఈ యేడాది మార్చిలో టిటిడి వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సమయంలో రూ.5,456 కోట్లతో పద్దును ఆమోదించారు. ఇందులో హుండీ కానుకల ద్వారానే రూ.1,880 కోట్లు ఆదాయం గడించవచ్చని అంచనా వేశారు. 2026-27 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన తరువాత మార్చి నుండి సెప్టెంబరు వరకు ఏడునెలల హుండీ ఆదాయం గమనిస్తే వెయ్యికోట్లు రూపాయలు పైగానే చేకూరడం రికార్డులను అధిగమించింది. మరో వారంరోజుల్లో మొదలుకానున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలోనూ హుండీ ఆదాయం మరింత రెట్టింపయ్యే సూచనలు కనిపిస్తున్నట్లు టిటిడి వర్గాలు భావిస్తున్నాయి. బడ్జెట్ అంచనాలకు తగ్గట్లు భక్తుల కానుకల ద్వారా హుండీ ఆదాయం కూడా రికార్డుస్థాయిలోనే లభిస్తోంది. దేశవిదేశాల్లో ఉన్న కోట్లాది మంది హిందూ భక్తులు నమ్మి కొలిచే ఏడుకొండల వేంకటేశ్వరునికి ముడుపుకట్టి సమర్పించుకునే హుండీ కానుకల ద్వారానే వడ్డీకాసులవాని ఆదాయం గణనీయంగా రెట్టింపవుతుంది. టిటిడి ఉద్యోగుల వేతనాలు, భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించడం, ఇతరత్రా అభివృద్ధిపనులు వంటివి చేపట్టడం హుండీ ఆదాయం ద్వారానే. అలాంటిది గత మూడేళ్ళ నుండి భక్తులు మొక్కుబడుల రూపంలో హుండీకి సమర్పించే కానుకలు భారీగా చేకూరుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత సంపన్నవంతమైన దేవుడుగా ఖ్యాతిచెందాడు.




మంగళవారం విశాఖలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జ్ఞాపికను అందిస్తున్న అధికారులు

# ఫ్లీట్ సపోర్ట్ షిప్ ‘సూర్య’ జల ప్రవేశం

>>హెచ్ఎస్ఎల్ స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మిస్తున్న తొలి ఫ్లీట్ సపోర్ట్ షిప్‌కు ‘సూర్య’ అని నామకరణం చేశారు. నేవీ వైవ్స్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు లైలా స్వామినాథన్ సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం నౌక బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఫ్లీట్ సపోర్ట్ షిప్‌లు సముద్రంలో సుదీర్ఘకాలం కార్యకలాపాలు నిర్వహించే నౌకాదళానికి అవసరమైన ఇంధనం, సరఫరాలు, నిర్వహణ సహకారాన్ని అందించనున్నాయి. అధునాతన సరకు, ద్రవ పదార్థాల నిల్వ సామర్థ్యంతో పాటు నౌకలోనే ప్రాథమిక నిర్వహణ వర్క్‌షాపులు, బహుళ ప్రయోజన హెలికాప్టర్ల నిర్వహణకు అనువైన డెక్, స్వీయ రక్షణ వ్యవస్థలు ఉంటాయని రక్షణ శాఖ తెలిపింది.

**45 వేల డిడబ్ల్యుటి నౌకల నిర్మాణానికి సిద్ధం:** హెచ్ఎస్ఎల్‌లోని స్లిప్‌వే-4ను విస్తరించి, బలోపేతం చేశారు. దీంతో 45 వేల డిడబ్ల్యుటి వరకు భారీ నౌకలను నిర్మించి, నీటిలోకి దించే సామర్థ్యం హెచ్ఎస్ఎల్‌కు లభించింది. స్లిప్‌వే-3, 4లపై ఏర్పాటు చేసిన 300 టన్నుల గోలియత్ క్రేన్ భారీ నౌకా భాగాలను వేగంగా, కచ్చితంగా తరలించేందుకు ఉపయోగపడనుంది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎల్అండ్‌టి జియోస్ట్రక్చర్, కోనెక్రేన్స్ ఆధ్వర్యంలో ఈ క్రేన్‌ను రూపొందించారు. ఆధునిక నియంత్రణ వ్యవస్థలు, రిమోట్ డయాగ్నస్టిక్స్, కండిషన్ మానిటరింగ్ వంటి సదుపాయాలు ఇందులో ఉన్నాయి.

**విశాఖను మెరైన్ ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దాలి:** విశాఖపట్నంను ప్రధాన సముద్ర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తూర్పు నౌకాదళం, నేవల్ డాక్‌యార్డ్, హెచ్ఎస్ఎల్, విశాఖపట్నం పోర్టు వంటి సంస్థలు నగరానికి బలమైన సముద్ర పారిశ్రామిక పర్యావరణవ్యవస్థను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. హెచ్ఎస్ఎల్‌తో ఆంధ్రప్రదేశ్‌లోని సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలను అనుసంధానించాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు పరిశోధన, నైపుణ్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సాంకేతిక సంస్థలు డిజిటల్ నౌకా నిర్మాణంలో సహకరించాలని, స్టార్టప్‌లు సముద్ర సాంకేతికతలను అభివృద్ధి చేయాలని అన్నారు.

**నాణ్యత.. ఉత్పాదకత.. సకాలంలో డెలివరీ:** హెచ్ఎస్ఎల్‌ను నాణ్యత, ఉత్పాదకత, సకాలంలో నౌకల అప్పగింతకు ప్రమాణంగా తీర్చిదిద్దాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. స్వయం సమృద్ధి సాధించడం ఒక దశ మాత్రమేనని, ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని సాధించడమే తదుపరి లక్ష్యమన్నారు. “మెరుగ్గా రూపకల్పన చేయాలి.. వేగంగా నిర్మించాలి.. సకాలంలో అందించాలి.. సమర్థంగా నిర్వహించాలి” అన్నది లక్ష్యంగా ఉండాలని సూచించారు. దేశీయ నౌకా నిర్మాణ సంస్థలు నాణ్యత, వ్యయం, సాంకేతికత, డెలివరీ, విశ్వసనీయతలో ప్రపంచంలోని ప్రముఖ నౌకా నిర్మాణ సంస్థలతో పోటీపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. 1948లో స్వతంత్ర భారతదేశంలో నిర్మించిన తొలి నౌక ‘జల ఉష’ను విశాఖలో ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేసిన రక్షణ మంత్రి, ఎనిమిది దశాబ్దాలుగా దేశ రక్షణ, సముద్ర అవసరాలకు హెచ్ఎస్ఎల్ అందిస్తున్న సేవలను కొనియాడారు. 2025లో హెచ్ఎస్ఎల్‌కు మినీరత్న కేటగిరీ-1హోదా లభించడం సంస్థ పరివర్తనలో కీలక ఘట్టమన్నారు. ఈ కార్యక్రమంలో నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి జనార్దన్ రెడ్డి, విశాఖ ఎంపి శ్రీభరత్ మాథుకుమిల్లి, రక్షణ ఉత్పత్తుల శాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్, తూర్పు నౌకాదళం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, హెచ్ఎస్ఎల్ సిఎండి రియర్ అడ్మిరల్ సి.రఘురామ్ పాల్గొన్నారు.

# అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు పట్టాలెక్కించండి!

>>నారాయణ తెలిపారు. పనుల పరోగతిని, ఆయా ప్రాజెక్టుల స్థితిగతులను అధికారులు వివరించారు. గడిచిన నెలలో రాజధానిలో రూ.1,345 కోట్ల విలువైన పనులు చేసినట్టు చెప్పారు. వీటిని రూ.2 వేల కోట్లకు తీసుకువెళ్లాలని సిఎం చంద్రబాబు అన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును పట్టాలెక్కించాలన్నారు. దీని కోసం కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. రాజధాని పనుల్లో ఎక్కడా అశ్రద్ధ, నిర్లక్ష్యం లేకుండా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని చెప్పారు. ఐకానిక్ భవనాల నిర్మాణాల విషయంలో ఎక్కడా పనులు ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సచివాలయ టవర్లు, అసెంబ్లీ భవనం ఐకానిక్‌గా ఉండాలన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ తరహాలోనే నిర్మాణ రంగంలోని వారికి ఆధునిక నైపుణ్యాలు అందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధుల హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

07-10-2026, బుధవారం,
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, కృష్ణపక్షం, హస్తకార్తె,
తి.ద్వాదశి రా.11.18,
న. మఖ రా.9.42,
వ.ఉ.10.00- ఉ.11.34,2)తె.5.35 -ఉ.7.10.
దు.ఉ.11.31 - మ.12.19,
రాహు. మ.12.00- మ.1.30,
శుభ. స. లేదు.

## వార్తాఫలం

**మేషం :** చిన్నచిన్న అవసరాలకు గాను అధికంగా శ్రమించవలసి రావడం వలన వత్తిడి అధికంగా ఉంటుంది.

**వృషభం :** మీ పరపతిని ఉపయోగించి అతిముఖ్యమైన వ్యవహారాలను సానుకూల పరచుకోగలుగుతారు.

**మిథునం :** రచనా వ్యాసంగాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. హోదాలను పెంచే ఒకానొక సంస్థలో సభ్యత్వాన్ని పొందుతారు.

**కర్కాటకం :** మొహమాటాలకు పోయి కొన్ని కార్యక్రమాలను నిర్వహించవలసి వస్తుంది. చేబదుళ్ళను అధికంగా చేస్తారు.

**సింహం :** ఉన్నతాధికారులకు బహుమతులను అందించడానికి గాను చిన్నపాటి కొనుగోళ్ళను సాగిస్తారు.

**కన్య :** చెవి, ముక్కుగొంతు సంబంధిత ఇబ్బందులను ఎదుర్కొన వలసి వస్తుంది. ఉన్నతాధికారుల మెప్పును సాధిస్తారు.

**తుల :** ఉత్తర ప్రత్యుత్తరాల వలన శుభవార్తలను అందుకోగలుగుతారు. స్వల్పమైన అభివృద్ధిని సాధించగలుగుతారు.

**వృశ్చికం :** అవసరాలను పరిగణలోనికి తీసుకుని ఇష్టం లేకపోయినా కొన్ని కార్యక్రమాలను చేపడతారు.

**ధనుస్సు :** కాంట్రాక్టుదారులకు శ్రమ మీద ఫలితాలుసానుకూల పడతాయి. స్పెక్ క్యూలేషన్లు దూరంగా ఉంటారు.

**మకరం :** యదార్థవాది లోక విరోధి అన్న నానుడి మీ అనుభవం లోనికి వస్తుంది. సామాజిక సేవలో పాల్గొంటారు .

**కుంభం :** అదృష్టానికి దగ్గరగా రోజులు నడుస్తున్నట్లు భావిస్తారు. ఆలోచనలు ప్రణాళికలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి.

**మీనం :** ప్రజా సంబంధాలు పెంచుకొనడానికి గాను చేసే ప్రయత్నాలు సూత్రప్రాయంగా ఉంటాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## అమీన్ పీర్ ఉర్సు ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం

**విజయవాడ,అక్టోబరు 4,ప్రభాతవార్తప్రతినిధి:** కడప అమీన్ పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు ముఖ్యమంత్రి చంద్రబాబును దర్గా పెద్దలు ఆహ్వానించారు. అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి కేఎస్ఎస్ అరీఫుల్లా హుస్సేనీ సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఆహ్వానపత్రిక అందించారు. ఈనెల 24 నుంచి 29 వరకూ జరిగే ఈ ఉత్సవాలకు హాజరవ్వాలని కోరారు. ఉర్సు ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను గురించి సీఎం ఆరా తీశారు. సీఎంను కలిసిన వారిలో దర్గా మేనేజర్ ఎమ్‌డీ అలీఖాన్, సయ్యద్ గౌస్, అమీర్ బాషా, తదితరులు ఉన్నారు.

## విజయవాడ జిజిహెచ్ వద్ద ఒప్పంద వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల ఆందోళన

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ జీజీహెచ్ వద్ద ఒప్పంద వైద్యారోగ్య శాఖ ఉద్యోగుల ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా చేపట్టారు. 100 శాతం గ్రాస్ వేతనం పునరుద్ధరించాలని, పారా మెడికల్ పోస్టులను రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన భర్తీచేసేలా నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సుదీర్ఘం కాలం నుంచి తమ సమస్యలు పరిష్కరిస్తామంటునే ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేసారు.,తమకు చెల్లిస్తున్న వేతనం విషయంలోను అన్యాయం జరుగుతుందని తెలిపారు.

## మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో సిట్ కస్టడీలో కారుమూరి విచారణ

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును సిట్ అధికారులు తమ కస్టడీకి తీసుకున్న నేపథ్యంలో మంగళవారం ఆయనను విచారించారు.మద్యం రవాణా వ్యవహారంలో ఈడీ నమోదు చేసిన కేసులో అరెస్టై హైదరాబాద్ చంచలగూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనను సిట్ అధికారులు నిన్న విజయవాడకు తీసుకొచ్చారు. అయితే నిన్న సమయం మించిపోవడంతో ముందుగా ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. నేడు అక్కడి నుంచి అధికారికంగా కస్టడీకి తీసుకున్నారు. ఈనెల 9వ తేదీ వరకు విజయవాడ సిట్ కార్యాలయంలో కారుమూరిని అధికారులు విచారిస్తారు.సిట్ విచారణలో కారుమూరి సిట్‌కు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని.తనను అన్యాయంగా కక్షసాధింపు చర్యల్లో భాగంగా కేసులో విచారించారని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం.నేటి విచారణ అనంతరం కారుమూరిని తిరిగి విజయవాడ జైలుకు తరలించారు.

# సముద్ర శక్తిగా భారత్ ఎదుగుతోంది

**నౌకాదళం సామర్థ్యాలకు ప్రపంచ గుర్తింపు..**
**స్వదేశీ సాంకేతికతతో మరింత బలోపేతం**
**విశాఖలో బరాఖానాలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**(విశాఖపట్నం-ప్రభాతవార్త) :**భారత నౌకాదళం శక్తిమంతమైన సముద్ర బలగంగా ఎదుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడంలో నౌకాదళం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. మారుతున్న భద్రతా పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, స్వదేశీ సామర్థ్యాలను పెంచుకుంటూ భారత నౌకాదళం ముందుకు సాగుతోందన్నారు.విశాఖపట్నంలో తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బరాఖానా కార్యక్రమానికి రక్షణ మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా నౌకాదళ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో ఆయన మమేకమయ్యారు. దేశ సముద్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అంకితభావాన్ని ప్రశంసించారు. సిబ్బంది సముద్రంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూ వారికి అందిస్తున్న సహకారం, ధైర్యం, మద్దతు ఎంతో విలువైనవని పేర్కొన్నారు.

**ఇండో-పసిఫిక్‌లో కీలక శక్తిగా నౌకాదళం..**

భారత నౌకాదళ సామర్థ్యాలకు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో గుర్తింపు లభిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా, క్లిష్టమైన కార్యాచరణ పరిస్థితుల్లోనూ నౌకాదళ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ దేశ సముద్ర సరిహద్దులకు రక్షణ కల్పిస్తున్నారని కొనియాడారు. దేశ జెండా ఎల్లప్పుడూ గర్వంగా ఎగురవేసేలా నౌకాదళం తన బాధ్యతలను నిర్వర్తిస్తోందన్నారు.1971 యుద్ధ సమయంలో భారత నౌకాదళం నిర్వహించిన ఆపరేషన్ ట్రైడెంట్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. కరాచీ నౌకాశ్రయంపై నిర్వహించిన ఆపరేషన్ ద్వారా భారత నౌకాదళం తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిందన్నారు. సముద్ర సరిహద్దులను కాపాడటంతో పాటు అవసరమైనప్పుడు ప్రత్యర్థిపై వ్యూహాత్మక దాడులు నిర్వహించే సామర్థ్యం నౌకాదళానికి ఉందని ఆపరేషన్ ట్రైడెంట్ నిరూపించిందన్నారు. దేశ రక్షణ కోసం ధైర్య సాహసాలు ప్రదర్శించిన నౌకాదళ సిబ్బందికి నివాళులర్పించారు.

**స్వదేశీ నౌకలతో పెరుగుతున్న సామర్థ్యం..**

21వ శతాబ్దంలో మారుతున్న భద్రతా సవాళ్లకు అనుగుణంగా భారత నౌకాదళం తనను తాను ఆధునికీకరించుకుంటోందని రక్షణ మంత్రి తెలిపారు. దేశీయంగా అభివృద్ధి చేసిన విమాన వాహక నౌకలు, అణు జలాంతర్గాములు, స్టెల్త్ యుద్ధనౌకలు, స్కార్పీన్ తరగతి జలాంతర్గాములు వంటి అధునాతన వేదికలను నౌకాదళంలోకి ప్రవేశపెడుతున్నామని చెప్పారు.నౌకాదళ బలం కేవలం యుద్ధనౌకలు, జలాంతర్గాములు, ఆయుధ వ్యవస్థలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మాత్రమే ఏర్పడదని.. సిబ్బంది వృత్తి నైపుణ్యం, దేశభక్తి, ధైర్యం, అంకితభావమే దాని అసలైన బలమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

**సముద్రాల నుంచి సుసంపన్నత వైపు..**

భారత్ తన సముద్ర సామర్థ్యాలను కేవలం దేశ సముద్ర సరిహద్దుల రక్షణకు మాత్రమే పరిమితం చేయకుండా విస్తృతంగా వినియోగించుకోవాలని రక్షణ మంత్రి పిలుపునిచ్చారు. సముద్రాలను ఆర్థిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రభావం, జాతీయ సుసంపన్నతకు ప్రధాన వనరుగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సముద్ర రంగంలో దేశానికి ఉన్న అపారమైన సామర్థ్యాలను వినియోగించుకుని



జాతీయ ఆర్థిక ప్రగతికి మరింత ఊతమివ్వాలని సూచించారు.నౌకాదళ సిబ్బంది దేశానికి హీరోలని, యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. వారి నిరంతర సేవలు భారత భవిష్యత్తు, దేశ బలం, జాతీయ గౌరవానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సముద్రంలో నెలల తరబడి విధులు నిర్వహించే నౌకాదళ సిబ్బందికి వారి కుటుంబాలు అందించే మద్దతు ఎంతో కీలకమన్నారు.సిబ్బంది దేశ సేవలో నిమగ్నమై ఉన్న సమయంలో కుటుంబాలు ఇంటి బాధ్యతలను నిర్వహిస్తూ వారికి అండగా నిలుస్తున్నాయని తెలిపారు. సిబ్బంది సేవలు, వారి కుటుంబాల త్యాగాలు కలిపి దేశానికి విలువైన జాతీయ ఆస్తిగా మారుతున్నాయని పేర్కొన్నారు.బరాఖానా వంటి కార్యక్రమాలు రక్షణ దళాల్లో సోదరభావం, సహచర్యం, పరస్పర అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. కలిసి భోజనం చేయడం అనేది కేవలం ఆకలి తీర్చుకోవడం మాత్రమే కాకుండా ఆత్మీయత, అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్న ఆయన.. రక్షణ దళాలు, కుటుంబాలు, నాయకత్వం ఒకే పెద్ద కుటుంబంగా కలిసే సందర్భమే బరాఖానా అని వివరించారు.



## వైఎస్ జగన్‌కు స్థితప్రజ్ఞుడు పుస్తకాన్ని బహుకరించిన డాక్టర్ కొత్తపల్లి

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌కు, సీనియర్ జర్నలిస్ట్, టెక్నోక్రాట్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ తాను రచించినస్థితప్రజ్ఞుడు పుస్తకాన్ని బహుకరించారు.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ రాజకీయ జీవనయానం, ఆయన రాజకీయ ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, నాయకత్వ లక్షణాలను సమగ్రంగా సంకలనం చేస్తూ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రచించారు. వైయస్ జగన్‌ను కలిసిన వారిలో రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మతో పాటు ఆయన సతీమణి లక్ష్మీ రాధ, ఎంవీఎస్ నాగిరెడ్డి, రమేష్, కొవ్వూరి త్రినాథరెడ్డి, సుబ్బారావు తదితరులు ఉన్నారు

## జనసేన కేంద్ర కార్యాలయం వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**అమరావతి,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన కేంద్ర కార్యాలయం వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశారు. కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వలేదని విజయ్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య యత్నం చేశారు. విజయ్‌కుమార్‌రెడ్డి తండ్రి చంద్ర శేఖర్‌రెడ్డి టీచర్‌గా పనిచేస్తూ 2021లో మరణించాడు. తండ్రి మరణించడంతో కారుణ్య నియామకంలో ఉద్యోగం ఇవ్వాలని విజయ్ డిమాండ్ చేస్తున్నాడు. ఈ క్రమంలో జనవాణి కార్యక్రమం వద్ద విజయ్ ఒంటిపై పెట్రోల్ పోసుకోగా, పోలీసులు అడ్డుకుని నీళ్లు పోశారు. అతనికి ఎటు వంటి గాయాలు కాలేదు,కారుణ్య నియామకాల విషయంలో డీసీఎం చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటున్నారని,అటువంటి సందర్భంలో ఇలా ఆత్మహత్యాయత్నం వంటి ఘటనలను చోటు చేసుకోవడం దురదృష్టకరమని జెఎస్పీ కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి

## కనకదుర్గమ్మ సన్నిధికి ప్రముఖులకు ఆహ్వానం..

**విజయవాడ ఉత్సవ్‌కు జాతీయ వైభవం తమిళనాడు సిఎం సి. జోసెఫ్ విజయ్, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలకు ఆహ్వానం**

**విజయవాడ, అక్టోబరు 6 (ప్రభాతవార్త):** విజయవాడలో ఘనంగా నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు జాతీయ స్థాయి ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఇందులో భాగంగా తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్‌ను విజయవాడ ఉత్సవ్ ప్రతినిధి బృందం కలిసి ఉత్సవాలకు ప్రత్యేకంగా ఆహ్వానించింది.ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జీఎం హరీష్ బాలయోగితో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తమిళనాడు సీఎం సి. జోసెఫ్ విజయ్‌ను కలిశారు. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని శ్రీ కనకదుర్గమ్మవారి ఆశీస్సులు పొందడంతో పాటు, విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, వారసత్వ వైభవాన్ని ఆస్వాదించాలని సీఎం విజయ్‌ను ఆహ్వానించారు. అలాగే విజయవాడ ఉత్సవ్ 2.0లో పాల్గొనాలని కోరారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషీలకు కూడా విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0కు ఆహ్వాన పత్రికలను అందజేశారు. రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎంపీ జీఎం హరీష్ బాలయోగి, విజయవాడ ఉత్సవ్ కమిటీ ప్రతినిధి నరసింహారావు కేంద్ర మంత్రులను కలిసి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.విజయవాడ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 ద్వారా నగరంలోని ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా, చారిత్రక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. శ్రీ కనకదుర్గమ్మవారి ఆశీస్సులు పొందేందుకు, విజయవాడ సాంస్కృతిక వైభవాన్ని ఆస్వాదించేందుకు తమిళనాడు సీఎం సి. జోసెఫ్ విజయ్‌తో పాటు కేంద్ర మంత్రులు విజయవాడకు విచ్చేసి ఉత్సవాల్లో పాల్గొంటారని ఆశిస్తున్నామని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు.

## నల్లమల్లలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆర్టీసీ బస్సు-బొలెరో పికప్ ఢీ..**

**ఇద్దరు మృతిమరో వ్యక్తికి తీవ్ర గాయాలు**

**ఆత్మకూరు అక్టోబర్ 6 ప్రభాతవార్త :**నల్లమల్ల అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆత్మకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైర్లూటి చెంచు గూడానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఆర్టీసీ బస్సు బొలెరో పికప్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో బొలెరోలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కాకినాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి ఆత్మకూరు మీదుగా కాకినాడకు వెళ్తుండగా గుంటూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో పికప్ వాహనం (టీఎస్ 02 యూడీ 1153) నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఎదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో బొలెరోలో ప్రయాణిస్తున్న నితిన్ (గద్వాల జిల్లా తెలంగాణ) ఈడిగ దేవేంద్రగౌడ్ (22) అక్కడికక్కడే మృతి చెందారు. దేవేంద్రగౌడ్ కర్నూలు జిల్లా ఆంకే దుద్యాల గ్రామానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని 108 వాహనం ద్వారా ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు..ప్రమాద సమాచారం అందుకున్న ఆత్మకూరు అర్బన్ సీఐ ఓ. మహేశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు.



## రూ.27 కోట్లతో 135 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

**కలెక్టర్ వెట్రిసెల్వి**

**ఉంగుటూరు, అక్టోబరు06, (ప్రభాతవార్త):** ఏలూరు జిల్లాలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం కింద రూ.27.00 కోట్లతో 135 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. వీటిలో 10 క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఉంగుటూరు మండలం చేబ్రోలులో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. చేబ్రోలు గ్రామాన్ని అభివృద్ధిలో మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. మాతా, శిశు మరణాల నివారణకు మాతృ కార్యక్రమం ద్వారా హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గానికి 76 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయని, 45 పూర్తయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో రహదారులు, తాగునీరు, జలధార పనులు పెద్దఎత్తున చేపట్టామన్నారు. నిడమర్రులో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువ

**● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**గుడివాడ(విజయవాడ),అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** గామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మోలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కృష్ణా జిల్లా గుడివాడ డివిజన్‌లోని జనార్దనపురంలో నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మంత్రి, మంగళవారం ప్రారంభించా రు. ఈ సందర్భంగానే రాష్ట్రంలోని 24 జిల్లాల్లో మరో 266 భవనాలను వర్చువల్‌గా ఏకకాలంలో ప్రారంభించారు. వీటి నిర్మాణానికి సుమారు రూ.105 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపా రు. 24 జిల్లాల్లోని 87 నియోజకవర్గాల పరిధిలో ఈ భవనాలు అందుబాటులోకి వచ్చాయని మం త్రి చెప్పారు.రాబోయే 6 నెలల్లో మిగిలిన 4,4 00 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలి పారు. ఇందులో ఈ ఏడాది చివరి నాటికి 2,700 కేంద్రాల నూతన భవనాలను సిద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. తదుపరి ప్రారంభ కార్యక్రమం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులు పంచాయతీరాజ్ శాఖ ద్వారా కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామం నుంచి పట్టణానికి వెళ్లి వైద్యం పొందాల్సిన అవసరం లేకుండా వైద్య సేవలనే గ్రామానికి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ లో ఒకేసారి 267 నూతన ఆరోగ్య భవనాలను ప్రారంభించడం అరుదైన ఘట్టంగా నిలిచింది.గత ప్రభుత్వ నిర్వాకంతో అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలతోపాటు కొత్తగా చేపట్టిన నిర్మాణాలు కలిపి మొత్తం 4,400కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం వివిధ పథకాల కింద రూ.1,128.02 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

కడప జిల్లాలో జమ్మలమడుగు డివిజన్‌లోని దేవగుడి2, బొమ్మేపల్లి, పెద్ద దండ్లూరు, దొరసానిపల్లి, కడప డివిజన్‌లోని చీమలపెంట విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారం భించారు.ఈ సందర్భంగా కడప జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సభా భవనం నుంచి అధికారులు, వైద్య సిబ్బంది వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ప్రతి గ్రామీణ కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆరోగ్య మోలిక వసతులను బలోపేతం చేస్తున్నామని మంత్రి వర్చువల్ ద్వారా తెలుపుతూ.. హెల్త్ క్లినిక్ ల ప్రారంభోత్సవం చేసుకున్న జిల్లాలు, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి ఆకాంక్షించారు.వర్చువల్ కార్యక్రమ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. యుగంధర్ మాట్లాడుతూ... ప్రతి 2,500 మంది జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా 104 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు, 71



రకాల వైద్య పరికరాలతో ప్రజలకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఎం.ఎల్.హెచ్.పి., ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల ద్వారా మాతా శిశు ఆరోగ్య సేవలు, టీకాలు, సంక్రమణ, అసంక్రమిత వ్యాధుల నివారణతో పాటు మొత్తం 12 రకాల ఆరోగ్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను సద్వినియోగం చేసుకోవాలని, వీటి ద్వారా ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు.పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ మద్దయ్య మాట్లాడుతూ...విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటులో వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ మహమ్మద్ తాహా, డాక్టర్ గీత, డాక్టర్ మల్లేష్, డాక్టర్ ఖాజామొహిద్దీన్, డాక్టర్ చెన్నారెడ్డి, డెమో భారతి, జిల్లా గణాంక అధికారి రమేష్ రెడ్డి, వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొగల్తూరులో హత్య కేసు ఛేదింపు

**● నలుగురు నిందితులు అరెస్ట్**

**నరసాపురం, అక్టోబరు06 (ప్రభాతవార్త):** పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరులో నెలల క్రితం చోటు చేసుకున్న వృద్ధుడి హత్య కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. పేరుపాలెం బీచ్‌లో నిందితుల మధ్య జరిగిన రగడ ఈ కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారడంతో హత్య వెనుక ఉన్న అసలు నిజం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం కోర్టుకు రిమాండ్‌కు తరలించారు. మొగల్తూరు గ్రామానికి చెందిన గ్రంధి బాబి (76) ఎల్ఐసీ ఏజెంట్‌గా, వడ్డీ వ్యాపారిగా కొనసాగుతున్నారు. బంగారం, వెండి వస్తువులను తాకట్టు పెట్టుకుని నగదు ఇచ్చేవారు. కుమారుడు పవన్‌కుమార్ హైదరాబాద్‌లో నివసిస్తుండటంతో బాబి ఒంటరిగా ఉంటున్నారు. ఇదే విషయాన్ని గమనించిన నిందితులు పథకం ప్రకారం బాబిని హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం బాబి వద్ద ఉన్న సుమారు 400 గ్రాముల బంగారం, 8 కిలోల వెండి వస్తువులతో పాటు పలు రికార్డులను నిందితులు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. తొలుత బాబి మృతిని సహజ మరణంగా భావించడంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే అనంతరం అనుమానాలు, పలు రూమర్లు రావడంతో కుమారుడు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం గాలిస్తున్న సమయంలో ఇటీవల పేరుపాలెం బీచ్‌లో కొంతమంది వ్యక్తుల మధ్య జరిగిన గొడవ పోలీసులకు కీలక క్లూగా మారింది. అక్కడ జరిగిన రగడకు సంబంధించిన వివరాలను సేకరించిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఒక్కో ఆధారాన్ని సేకరిస్తూ తీగ లాగడంతో చివరకు హత్య కేసు ముడి వీడింది. డీఎస్పీ సుధాకర్‌రావు ఆదేశాలతో పోలీసులు దర్యాప్తు కొనసాగించి లక్ష్మీ వరప్రసాద్, సతీష్, కళ్యాణ్, గణేష్ అనే నలుగురిని నిందితులుగా గుర్తించారు. తగిన ఆధారాలు సేకరించిన అనంతరం వారిని అరెస్ట్ చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపా రు.కేసు వివరాలను డీఎస్పీ సుధాకర్‌రావు మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దురాశకు పూనుకుని వృద్ధుడిని హత్య చేసి, నేరాన్ని కప్పిపుచ్చామని భావించిన నిందితులు చివరకు తమలో తామే రచ్చ చేసుకోవడంతో పోలీసులకు చిక్కడం గమనార్హం.



## తిరుపతిలో 75 అడుగుల మోడీ కటౌట్

**● వేద పండితుల ఆశీర్వచనాలతో 75 గంటల మోడీ జాతర ప్రారంభం**

**తిరుపతి,అక్టోబర్ 6ప్రభాత వార్తప్రతినిధి:** తిరుపతి వేదికగా భారత ప్రధాని నరేంద్ర మోడీ 75 అడు గుల భారీ కటౌట్‌ను ఆవిష్కరిం చారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లక్ష్యంగా 75 గంటల బాటు నిరంతరాయంగా సాగే వినూత్న మోడీ జాతర (డప్పు మోత) కార్యక్రమాన్ని ప్రారంభిం చారు.ఈ మహోత్సవంలో మాతంగి పీఠాధిపతి మాతంగినందగిరి స్వామి దివ్య అనుగ్రహ ఆశీస్సులు అందించగా, వెయ్యి మంది వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాని మోడీ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో దేశాన్ని నడిపించాలని వేద ఆశీర్వచనం అందజేశారు.తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం నేడు ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన అగ్రదేశాల సరసన సగర్వంగా నిలిచిందంటూ, అభివృద్ధి ఫలాలు సమాజంలోని చిట్టచివరి నిరు పేద పౌరుడికి కూడా చేరాలనే సంకల్పంతో మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని, రాజకీయాలు, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి భారతీయుడిని తన కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ప్రధాని చేపడుతున్న ప్రతి పథకం వెనుక దేశ సమగ్ర ప్రయోజనం దాగి ఉందని కొనియాడారు. దళిత సోదరుల గుండె చప్పుడు అయిన డప్పు మోతతో 75 గంటల పాటు సాగే ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డుగా నిలవనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హర్ష, ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## వీర జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

**● అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

**చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలంలోని టి.కుమ్మరపల్లికి చెందిన ఆర్మీ జవాన్ రెడ్డి బాషా (34) అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. 12 ఏళ్లుగా ఆర్మీలో సేవలందిస్తున్న ఆయన ఢిల్లీలోని ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆర్మీ అధికారులు సోమవారం రాత్రి పార్థివదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం ఉదయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని టి.కుమ్మరపల్లికి చేరుకుని జవాన్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జవాన్ మృతివార్త తెలుసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం 12 ఏళ్లపాటు సేవలందించిన జవాన్ మృతితో గ్రామం విషాదంలో మునిగిపోయింది. అనంతరం ఆర్మీ సైనికుల ఆధ్వర్యంలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సైనిక లాంఛనాలతో జరిగిన అంతిమ వీడ్కోలు కార్యక్రమం పలువురిని కంటతడి పెట్టించింది.





## ఐఎన్ఎస్ డేగా వద్ద తుపాకీ మిస్‌ఫైర్

**ఎఆర్ కానిస్టేబుల్‌కు గాయం**

**విశాఖ క్రైమ్, అక్టోబర్ 6 ప్రభాతవార్త :** ఐఎన్ఎస్ డేగా వద్ద కేంద్ర మంత్రి విమాన భద్రతా విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్‌కు తుపాకీ మిస్‌ఫైర్ కావడంతో గాయపడ్డారు. ఏఆర్ కానిస్టేబుల్ 768 కొండ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సెంట్రీ డ్యూటీలో ఉన్నారు. విధుల్లో ఉండగా ఆయన వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ తుపాకీ అనుకోకుండా మిస్‌ఫైర్ అయింది. ఈ ఘటనలో ఎడమవైపు ఛాతి కింది భాగంలో గాయమైంది. తుపాకీ పేలిన పెద్ద శబ్దం వినిపించడంతో సమీపంలోని భద్రతా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. అప్పటికే కానిస్టేబుల్ అపస్మారక స్థితిలో ఉండటంతో అంబులెన్స్‌లో కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు, భద్రతా అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# విబిజిరామ్‌జీలో 375 పనులకు కేంద్రం ఓకే!

## ఉపాధి కల్పనతోపాటు శాశ్వత మౌలిక వసతుల నిర్మాణానికి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 6:** గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనతో పాటు శాశ్వత మౌలిక వసతుల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మరింత ప్రాధాన్యతనిస్తోంది. వికాసిత్ భారత్-గారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) చట్టం-2025 కింద చేపట్టగల పనుల జాబితాను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. కొత్త విధానంలో మొత్తం 375 రకాల పనులకు అనుమతి ఇచ్చింది. గత విధానంలో 266 రకాల పనులు ఉండగా, తాజా షెడ్యూల్లో వాటి సంఖ్య 41 శాతం పెరిగింది. కొత్తగా అనుమతించిన పనులను నాలుగు ప్రధాన విభాగాలుగా విభజించారు. అవి నీటి భద్రత, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధికి సంబంధించిన మౌలిక వసతులు, విపత్తుల సన్నద్ధత-తీవ్ర వాతావరణ పరిస్థితుల నిర్వహణ. అత్యధికంగా 128 పనులు నీటి భద్రతకు కేటాయించారు. చెక్డ్యామ్లు, గల్లీ ప్లగుల్లు, భూగర్భ డ్రైనేజిలు, రీచార్జ్ షాఫ్టు, ఇంజెక్షన్ బావులు, నదులు, వాగులు, నాలాల పునరుద్ధరణ, నీటిముంపునకు గురైన భూముల పునరుద్ధరణ, పొలాలకు నీటి పంపిణీ కాలువల మరమ్మతులు వంటి పనులు ఇందులో ఉన్నాయి. డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వ్యవస్థలు, పైకప్పు వర్షపు నీటి సేకరణ, టంకాలు వంటి వాటితో పాటు నీటి సంరక్షణ కోసం ఐస్ స్థూపాలు, కృత్రిమ హిమానీనదాలు వంటి కొత్త తరహా పనులను కూడా చేర్చారు. కోర్ రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో 111 పనులకు అనుమతి ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన పౌర, సామాజిక మౌలిక వసతులను బలోపేతం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. సౌర వీధి దీపాలు, వ్యర్థాలను సంపదగా మార్చే రీసైక్లింగ్ ప్లాంట్లు, గ్రేవాటర్ శుద్ధి కేంద్రాలు, వ్యర్థాల వేర్పాటు షెడ్లు, గ్రామీణ గ్రంథాలయాలు, పశువైద్య కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు, బహుళ ప్రయోజన యువజన కేంద్రాలు, కమ్యూనిటీ సదుపాయాలు ఇందులో ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణం, జల్ జీవన్ మిషన్ నీటి సరఫరామౌలిక వసతుల మరమ్మతులు, గ్రామీణ పార్కులు, నడక మార్గాలు తదితర పనులకు కూడా అవకాశం కల్పించారు. కొత్త విధానంలో లైవ్లీహుడ్ సంబంధిత మౌలిక వసతులకు 98 పనులు కేటాయించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, శుభ్రపరిచే-గ్రేడింగ్-ప్యాకేజింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజ్లు, చిన్న పిండి మిల్లులు, మార్కెట్ యార్డులు, డెయిరీ మౌలిక వసతులు, పుట్టగొడుగుల సాగు షెడ్లు, సెరికల్చర్ షెడ్లు, పాలీహౌస్లు, ఆక్వాకల్చర్ నిర్మాణాలు ఇందులో ఉన్నాయి. స్వయం సహాయక సంఘాలు, వాటి సమాఖ్యలకు వర్క్షెడ్లు, ఫెడరేషన్ భవనాలు, శిక్షణ-నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కూడా అనుమతి ఇచ్చారు. జీవనోపాధి సంబంధిత పనుల వాటా మొత్తం అనుమతించదగిన పనుల్లో 26 శాతానికి పెరిగింది. గత విధానంలో ఇది కేవలం 1.1 శాతం మాత్రమే. గ్రామీణ పనుల చట్టంలో తొలిసారిగా విపత్తుల సన్నద్ధత, తీవ్ర వాతావరణ పరిస్థితుల కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 38 పనులు ఉన్నాయి. వరద సహాయక శిబిరాలు, రిటైనింగ్ వాల్స్, కరకట్టల బలోపేతం, వరద రక్షణ పనులు, విపత్తుల అనంతరం గ్రామీణ రహదారులు, సామాజిక ఆస్తుల పునరుద్ధరణ, అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ లైన్లు, ఫ్యూయల్ బఫర్ జోన్ల ఏర్పాటు వంటి పనులు ఇందులో ఉన్నాయి. వరదలు, తుపాన్లు, భారీ వర్షాలు, కరువు, కొండచరియలు విరిగిపడటం, అడవుల్లో అగ్నిప్రమాదాలు వంటి విపరీత వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా గ్రామీణ ప్రాంతాలను, ఆస్తులను బలోపేతం చేయడం ఈ విభాగం లక్ష్యం. మొత్తం 181 పనులు వ్యవసాయం, అనుబంధ రంగాలవే ఉన్నాయి. ఇందులో 52 పనులు వ్యక్తిగత లబ్ధిదారులకు సంబంధించినవి. నీటి వనరులు, భూమి అభివృద్ధి, మొక్కల పెంపకం, పశుసంపద తదితర ఉత్పాదక ఆస్తుల ద్వారా రైతులకు నేరుగా ప్రయోజనం కలిగేలా వీటిని రూపొందించారు. అంత్యోదయ, బలహీన వర్గాల కుటుంబాల కోసం 107 పనులు కేటాయించారు. ఇందులో 68 వ్యక్తిగత లబ్ధిదారు పనులు ఉన్నాయి. గృహాలు,

పారిశుధ్యం, ఇంధనం, సాగునీరు, మొక్కల పెంపకం, పశువుల షెడ్లు, ఇతర కుటుంబ స్థాయి ఆస్తులు ఇందులో ఉన్నాయి. నారీ శక్తికి సంబంధించిన 36 పనులు, యువ శక్తికి సంబంధించిన 36 పనులు ఉన్నాయి. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఈ చట్టం దోహదపడుతుందని కేంద్రం ప్రకటించింది.



# ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేందుకు సిద్ధమైన ఇజ్రాయెల్

## ఫైటర్ జెట్స్‌ను సిద్ధం చేసిన వైనం

## పలు సంచలన విషయాలు వెలుగులోకి

**టెల్అవీవ్, అక్టోబరు 6:** ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫ్లైదుబాయ్ విమాన ఘటనలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జరిగిన సమయంలో ఇజ్రాయెల్ అప్రమత్తమైందని తెలుస్తోంది. విమానం టెల్ అవీవ్‌వైపు ప్రయాణాన్ని కొనసాగించి ఉంటే దాన్ని కూల్చివేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైనట్లు సమాచారం. అందుకోసం యుద్ధ విమానాలను సిద్ధం చేసినట్లు సిబిఎస్ న్యూస్ కథనాన్ని ప్రచురించింది. సెప్టెంబరు 30న ఫ్లైదుబాయ్‌కు చెందిన ఫ్లైట్ 1073 దుబాయ్ నుంచి టెల్అవీవ్‌కు బయలుదేరింది. ప్రయాణ సమయంలో కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ అనూహ్యంగా కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై దాడికి పాల్పడ్డారు. గొడ్డలితో కెప్టెన్‌ను గాయపరిచి విమానంపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నించాడు. ఈ పరిణామంతో విమానం కొద్దిసేపటికే భారీగా కిందకు దిగింది. కేవలం 30 సెకన్లకుపైగా వ్యవధిలో విమానం దాదాపు 16 వేల అడుగుల ఎత్తును కోల్పోయింది. దీంతో విమానం హైజాక్‌కు గురైందా? లేక మరేదైనా ప్రమాదం జరిగిందా? అనే అనుమానాలు ఇజ్రాయెల్ అధికారుల్లో మొదలయ్యాయి.

**ఇజ్రాయెల్ హైఅలర్ట్:** విమానం టెల్అవీవ్ వైపు వస్తుండటంతో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ అప్రమత్తమైంది. విమానంలోని కాక్‌పిట్‌తో రేడియో ద్వారా సంబంధాలు ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయెల్ వైమానిక దళ సిబ్బంది ప్రయత్నించారు. అయితే అక్కడి నుంచి ఎలాంటి స్పందన రాలేదని సిబిఎస్ తెలిపింది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే ముందస్తు వ్యవస్థను యాక్టివేట్ చేశారు. ప్రత్యేక కమాండన సెంటర్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. అదే సమయంలో ఇజ్రాయెల్ గగనతలాన్ని మూసివేసి ఫైటర్ జెట్లను రంగంలోకి దించారు. విమానం టెల్అవీవ్ వైపు తన ప్రయాణాన్ని కొనసాగిస్తే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని అధికారులు భావించినట్లు సిబిఎస్ పేర్కొంది.

**కూల్చివేతకు సిద్ధమైన ఫైటర్ జెట్లు:** విమానం టెల్అవీవ్ దిశగా కొనసాగి ఉంటే, ఇజ్రాయెల్ ఫైటర్ పైలట్లు దాని వద్దకు చేరుకుని కాక్‌పిట్‌లో అసలు ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పింది. విమానం హైజాక్‌కు గురైందని నిర్ధారణ అయి ఉంటే, ఆ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని, రక్షణ మంత్రి దృష్టికి తీసుకెళ్లే వారని పేర్కొంది. విమానాన్ని కూల్చివేయాలా? వద్దా? అనే తుది అధికారం ఇజ్రాయెల్ ప్రధానమంత్రికే ఉండేదని తెలిపింది.

# మళ్లీ విమానం నడపాలనేదే నా కోరిక

## చికిత్సలో ఉన్న కెప్టెన్ స్మిత్ మచ్చర్

**అబుదాబి, అక్టోబరు 6:** నేను మళ్లీ విమానం నడపాలి ఇదే తన కుటుంబ సభ్యులతో కెప్టెన్ స్మిత్ మచ్చర్ పదేపదే చెబుతున్నట్లు కుటుంబానికి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఫ్లై దుబాయ్ ప్రయాణికుల విమానంలో జరిగిన భయానక కాక్‌పిట్ దాడి నుంచి కోలుకుంటున్న ఆయన ప్రస్తుతం అబుదాబిలో చికిత్స పొందుతున్నారు. ఫ్లై దుబాయ్‌కు చెందిన 1073 విమానంలో సహ పైలట్ దాడికి గురైన భారతీయ పైలట్ స్మిత్ మచ్చర్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుపడుతున్నప్పటికీ, పూర్తిస్థాయిలో చూపు ఇంకా తిరిగి రాలేదని, దాడిలో తగిలిన గాయాలతో బాధపడుతున్నారని కుటుంబ వర్గాలు తెలిపాయి. దాడిలో ఉపయోగించిన క్రాష్ యాక్స్ దెబ్బల కారణంగా మచ్చర్ తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. పుర్రెపై లోతైన గాయం కావడంతో పాటు ఆయన చూపు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. అయినప్పటికీ, విమానం ఒక్కసారిగా తీవ్రంగా కిందికి దిగడం ప్రారంభించడంతో ఆయన తన గాయాలను లెక్కచేయకుండా లేచి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఇప్పుడు ఆయన లక్ష్యం ఒక్కటే మళ్లీ కాక్‌పిట్‌లోకి వెళ్లి విమానం నడపడం. సెప్టెంబర్ 30న 182 మందితో దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో ఉన్న ఒమన్‌కు చెందిన సహ పైలట్ అకస్మాత్తుగా క్రాష్ యాక్స్‌తో కెప్టెన్ మచ్చర్‌పై దాడి చేశాడు. దాడిలో కెప్టెన్ తీవ్రంగా గాయపడటంతో విమానం వేగంగా ఎత్తు కోల్పోవడం ప్రారంభించింది. ఈ సమయంలో మచ్చర్ తీవ్ర గాయాలతోనే కాక్‌పిట్ తలుపును తెరవగలిగారు. దీంతో విమాన సిబ్బంది, ప్రయాణికులు లోపలికి చేరుకుని దాడికి పాల్పడిన సహ పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించగా, అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. చూపు పూర్తిగా మసకబారింది ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో జరిగిన సంభాషణలో మచ్చర్ ఈ ఘటనను వివరించారు. తలపై వరుసగా దెబ్బలు తగలడంతో తన చూపు పూర్తిగా మసకబారిపోయిందని తెలిపారు. విమానం తీవ్రంగా కిందికి దిగుతోందని గుర్తించిన మచ్చర్, తాను తీవ్రంగా గాయపడినప్పటికీ ఏదో ఒకటి చేయాల్సిందేనని నిర్ణయించుకున్నారు. చివరకు తనలో ఉన్న శక్తినంతా కూడగట్టుకుని కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించారు. దీనిని ఆయన తన చివరి పోరాటం గా అభివర్ణించారు. పెద్ద విమాన ప్రమాదాన్ని నివారించడంలో కీలక పాత్ర పోషించిన కెప్టెన్ మచ్చర్‌ను అంతర్జాతీయంగా పలువురు ప్రశంసించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకూడా ఆసుపత్రి నుంచి ఆయనతో మాట్లాడారు. తనకు 17 ఏళ్ల విమానయాన అనుభవం ఉండటం వల్లే, చూపు సరిగా కనిపించని పరిస్థితిలోనూ విమానంలో ఏం జరుగుతోందో అర్థం చేసుకోగలిగానని మచ్చర్ ప్రధాని మోడీతో చెప్పినట్లు సమాచారం.

# గాజాపై ఇజ్రాయెల్ దాడికి ప్రతీకారంగానే..

## ఫ్లైదుబాయ్ కో-పైలట్ అల్ హమ్మామి వెల్లడి



**టెల్అవీవ్, అక్టోబరు 6:** ఇజ్రాయెల్ వెళ్లాల్సిన ఫ్లైదుబాయ్ విమానాన్ని కో పైలట్ అల్ హమ్మామి కూల్చాలనుకున్న సంగతి తెలిసిందే. అయితే, అతడు ఈ విమానాన్ని కూల్చాలని నిర్ణయించుకోవడానికి గల కారణాల్ని విచారణలో వెల్లడించినట్లు తెలుస్తోంది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడికి ప్రతీకారంగానే తాను ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చాలని నిర్ణయించుకున్నట్లు అల్ హమ్మామి చెప్పాడు. ఈ విషయాన్ని యుఎఇ అధికారులు జరుపుతున్న విచారణలో అతడు వెల్లడించాడు. అంతేకాదు.. అతడు ఇలా విమానాన్ని కూల్చి, తాను కూడా మరణించి అమరుడు అవ్వాలని భావించినట్లు చెప్పాడు. గత వారం దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ (టెల్అవీవ్) బయల్దేరిన విమానాన్ని కూల్చేందుకు కో పైలట్ అల్ హమ్మామి ప్రయత్నించాడు. ఈ ప్రయత్నాన్ని పైలట్, ఇండియన్ స్మిత్ మచ్చర్ అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడున్న ఇతర పైలట్లు విమానాన్ని సురక్షితంగా సౌదీలో ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో కుట్రకు పాల్పడిన కో పైలట్ అలహ హమ్మామి ప్రస్తుతం యుఎఇ అధికారులు స్వాధీనంలో ఉన్నాడు. ఇజ్రాయెల్‌కు చెందిన విచారణ అధికారులు కూడా ఈ విచారణలో పాల్గొంటున్నారు. యుఎఇఅధికారులతోకలిసి ఇజ్రాయెల్ అధికారులువిచారణజరుపతున్నారు.



# గాఢనిద్రపోతే రూ.12 లక్షలు బహుమతి

## జపాన్‌లో ఆకట్టుకున్న నిద్ర పోటీ

**టోక్యో, అక్టోబరు 6:** ఎప్పుడూపనుల్లో మునిగిపోయి తీవ్రమైన అలసటతో ఉండే జపాన్‌లో ఓ వినూత్న పోటీ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వేగంగా, గాఢంగా నిద్రపోవడమే ఈ పోటీలోని టాస్క్. గెలిచిన వారికి ఏకంగా 2 మిలియన్ యెన్లకు పైగా (భారత కరెన్సీలో సుమారు రూ.12 లక్షలు) బహుమతిగా అందిస్తారు. టోక్యోలో మ్యాట్ రేస్ పేరుతో ఓ పరుపుల తయారీ కంపెనీ ఈ విచిత్రమైన పోటీని నిర్వహించింది. ఈ పోటీలో తమను తాము కాంపిటేటివ్ స్లీపర్స్ అని పిలుచుకునే డజన్ల కొద్దీ పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఓ గదిలో తక్కువ కాంతిలో, సౌకర్యవంతమైన పరుపులపై వీరంతా 90 నిమిషాల పాటు నిద్రపోయారు. ప్రతి ఒక్కరి తలకు స్లీప్ ట్రాకింగ్ పరికరాలను అమర్చారు. ఎవరు ఎంత వేగంగా నిద్రలోకి జారుకున్నారు, ఎంత గాఢంగా నిద్రపోయారు అనే అంశాల ఆధారంగా విజేతను ఎంపిక చేశారు. కొందరు తమ పక్కన ఇష్టమైన టెడ్డీబేర్లను పెట్టుకుని నిద్రపోవడం కనిపించింది. పాన్ ప్రజలు తీవ్రమైన నిద్రలేమితో బాధపడుతున్నారని, వారిలో నిద్రపై అవగాహన పెంచేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహక సంస్థ కోలా స్లీప్ జపాన్ క్రియేటివ్ డైరెక్టర్ రిచిరో నకమా తెలిపారు. జపాన్ ప్రజలు చాలా కష్టపడి పనిచేస్తారు. నిద్రను ఇలా ఒక పోటీగా మార్చడం ద్వారా, అందరూ కలిసి నిద్రపోవడం, దానిపై ఆసక్తి పెంచుకోవడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఓఈసీడీ 2021 డేటా ప్రకారం జపనీయులు రోజుకు సగటున 7 గంటల 24 నిమిషాలు మాత్రమే నిద్రపోతున్నారని, ఇది ఓఈసీడీ దేశాల్లో అత్యంత తక్కువని తేలింది. ఎక్కువ పని గంటలు, సుదూర ప్రయాణాలు దీనికి కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

# హర్ముజ్ జలసంధిలో పెరిగిన దాడులు

## తాజాగా భారతీయ నావికులున్న నౌకపై దాడి

## 12 మందినావికులకు గాయాలు..11 మంది భారతీయులే



**మస్కట్, అక్టోబరు 6:** హర్ముజ్ జలసంధిలో మరోసారి భారతీయ నావికులు ఉన్న నౌకపై దాడి జరిగింది. పనామా జెండా కలిగిన ఎంటీ ఆన్ పీస్ నౌకపై మంగళవారం ఒక ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. ఈ దాడిలో గాయపడిన 12 మంది సిబ్బందిలో 11 మంది భారతీయులే ఉన్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఒమన్ తీరానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన నావికుల్ని ఒమన్ అధికారుల సహాయంతో నౌక నుంచి తరలించి ఖసబ్ ప్రాంతంలోని ఆస్పత్రికి తరలించారు. నౌకలో 17 మంది భారతీయులతో సహా మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారు. వాణిజ్య నౌకపై జరిగిన దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. భారతీయ నావికుల్ని తరలించడానికి సహకరించిన ఒమన్ అధికారులకు విదేశాంగ మంత్రిత్వ శాఖ థాంక్స్ తెలిపింది. హార్ముజ్ ప్రాంతంలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలపై కొనసాగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని భారత్ పేర్కొంది. అంతర్జాతీయ జలాల్లో నౌక ప్రయాణాలు, వాణిజ్య కార్యకలాపాలను పునరుద్ధరించేందుకు ఈ దాడుల్ని తక్షణమే నిలిపేయాలని పిలుపునిచ్చింది. హర్ముజ్ జలసంధి చుట్టుపక్కల ప్రాంతాల్లో వాణిజ్య నౌకలపై ఇటీవల కాలంలో దాడులు పెరిగాయి. ఈనెల మొదటి వారంలోనే 7 ట్యాంకర్లు దాడులకు గురయ్యాయి.

ఇరాన్‌అమెరికా శాంతి చర్చలు విఫలమైన తర్వాత, అమెరికా జలసంధిని దిగ్బంధించిన నేపథ్యంలో నౌకలపై దాడులు పెరిగాయి. జూలైలో ఒమన్ ప్రాదేశిక జలాల్లో యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఈ ఘటనలో నలుగురు భారతీయ సిబ్బంది మరణించగా, 10 మంది గాయపడ్డారు. ఈనెల 23న మరో దాడిలో మరో భారతీయ నావికుడు మరణించారు.



# అఫ్జల్‌గురు ఇంటిని బుల్‌డోజర్లతో కూల్చివేసిన జమ్ముకాశ్మీర్ సర్కార్

**శ్రీనగర్, అక్టోబరు 6:** పార్లమెంట్‌పై దాడికి పాల్పడిన ఉగ్రవాది మహ్మద్ అఫ్జల్ గురు ఫ్యామిలీకి చెందిన ఇంటిని జమ్మూ కాశ్మీర్ అధికారులు మంగళవారం బుల్డోజర్లతో కూల్చేశారు. బారాముల్లా జిల్లాలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా షెడ్డును కూల్చేసినట్లు అధికారులు తెలిపారు. సోపోర్ ప్రాంతంలో వరద ప్రభావిత భూమిలో ఈ షెడ్డు నిర్మించారు అఫ్జల్ గురు ఫ్యామిలీకి చెందిన సభ్యులు ఈ నిర్మాణాన్ని నిర్మించి అందులో నివాసం ఉంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ భూమిలో నిబంధనల్ని ఉల్లంఘించినట్లు పేర్కొంటూ రెవెన్యూ అధికారులు ఈ నిర్మాణాన్ని కూల్చేశారు.

# ప్రధానిమోడీ 25 యేళ్లపాలనాప్రస్థానం!

## సేవా సంకల్ప యాత్రకు రేపు ఘన ముగింపు

## వాద్‌నగర్, వారణాసిలో ఏకకాలంలో ముగింపు కార్యక్రమాలు

**వారణాసి, అక్టోబరు 7:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా జీవితంలో 25 ఏళ్ల సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించినసేవా సంకల్ప యాత్రకు అక్టోబర్ 7న ఘనంగా ముగింపు పలకనున్నారు. వాద్‌గర్, వారణాసిలో ఏకకాలంలో రెండు భారీ ముగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. గతనెల 17న ప్రారంభమైన ఈ యాత్ర దేశంలోని వివిధ ప్రాంతాల మీదుగా సాగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సేవా ప్రస్థానం, ప్రజా జీవితంలో ఆయన అందించిన సేవల స్ఫూర్తితో సేవ, సంకల్పం, సామాజిక బాధ్యత సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ముగింపు కార్యక్రమాల్లో వేలాది మంది సేవా యాత్రికులు, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కార్యకర్తలు, యువత పాల్గొననున్నారు. వారణాసిలో సేవా యాత్రికులు తమ యాత్రను కాశీ విశ్వనాథ్ ధామ్‌లో జలాభిషేకంతో ముగించనున్నారు. బాబా విశ్వనాథుడి ఆశీస్సులు కోరుతూ నిర్వహించే ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో యువత, సేవా యాత్రికులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు హేమాంగ్ జోషి ప్రసంగించనున్నారు. ప్రజా జీవితంలో సేవ ప్రాధాన్యత, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానంపై వారు మాట్లాడనున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వాద్‌నగర్‌లోని చారిత్రక హాట్కేశ్వర్ మహాదేవ్ ఆలయంలో సేవా సంకల్ప యాత్ర ముగియనుంది. సేవా యాత్రికులు ఆలయంలో జలాభిషేకం నిర్వహించి, ప్రార్థనలు చేయడంతో పాటు సేవా స్ఫూర్తిని కొనసాగించేందుకు సంకల్పం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, గుజరాత్ ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘవి, బీజేపీ ఆల్ సెల్స్ కోఆర్డినేటర్ వీడీ శర్మ పాల్గొని ప్రసంగించనున్నారు. వేలాది మంది సేవా యాత్రికులు, కార్యకర్తలు ఈ ముగింపు కార్యక్రమానికి హాజరుకానున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా సేవలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ యాత్రను సామాజిక సేవా కార్యక్రమాలతో అనుసంధానించారు. యువతను సామాజిక సేవలో భాగస్వామ్యం చేసేందుకు పరిశుభ్రత కార్యక్రమాలు, మొక్కల నాటడం, నీటి సంరక్షణ, గోసేవ, వృద్ధాశ్రమాల్లో సేవ, లబ్ధిదారులతో సమావేశాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వాద్‌నగర్ నుంచి ప్రారంభమైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా ప్రస్థానం, ఆయనకు పార్లమెంటరీ మరియు ఆధ్యాత్మిక అనుబంధానికి కేంద్రంగా మారిన వారణాసి వరకు సాగిన ఈ యాత్రకు రెండు ప్రాంతాల్లో జరిగే ముగింపు కార్యక్రమాలు ప్రతీకాత్మకంగా నిలవనున్నాయి. బుధవారం జరిగే ముగింపు కార్యక్రమం కేవలం సేవా సంకల్ప యాత్ర ముగింపుగా కాకుండా, సమాజ సేవ దేశ నిర్మాణంలో కార్యకర్తలు సంకల్పం తీసుకునే సందర్భం.

# హౌతీ దాడులతో సౌదీలో ఉద్రిక్తత

## బలగాలు పంపేందుకు పాక్, తుర్కియే కీలక నిర్ణయం

## మక్కా రక్షణ ఒప్పందం అమలులోకి.. కీలక పరిణామం

**రియాద్, అక్టోబరు 6:** మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హౌతీ దాడుల నేపథ్యంలో సౌదీ అరేబియాకు సైనిక బలగాలను మోహరించేందుకు పాకిస్థాన్, టర్కీ అంగీకరించినట్లు ఓ మీడియా నివేదిక వెల్లడించింది. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ దేశాల మధ్య ఏర్పడిన మక్కా డిఫెన్స్ అలయన్స్ ఇప్పుడు సైనికపరంగా అమలులోకి వచ్చే దిశగా అడుగులు వేస్తోంది. సౌదీ అరేబియాలోని రియాద్‌లో సోమవారం వ్యూహాత్మక రాజకీయ, రక్షణ కమిటీ (ఎస్‌పిడిసి) అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో మూడు దేశాల భద్రతకు ఎదురవుతున్న ముప్పులు, ప్రాంతీయ పరిణామాలపై చర్చించారు. పాకిస్థాన్ విదేశాంగ శాఖను ఉటంకిస్తూ డాన్ పత్రిక ఈ వివరాలను వెల్లడించింది. సౌదీ అరేబియా, పాకిస్థాన్, టర్కీ దేశాలు గత ఆగస్టులో త్రైపాక్షిక రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఈ ఒప్పందం ప్రకారం మూడు దేశాల్లో ఏదైనా ఒక దేశంపై సాయుధ దాడి జరిగితే, దానిని మూడు దేశాలపై జరిగిన దాడిగా పరిగణించి సమష్టిగా స్పందించే విధానం ఏర్పాటైంది.

# 13కోట్ల ఓటర్ల లెక్కలు ఇవిగో.. ఇవికూడా తప్పేనంటారా?

## రాహుల్, సిజెపి విమర్శలపై బిజెపి సుధాంశుత్రివేది

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం అవకతవకలకు పాల్పడిందని, సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి. 13 కోట్ల మంది ఓటర్లను ఎన్నికల సంఘం తొలగించిందని ఆరోపిస్తున్నాయి. ఈ ఓటర్లను మళ్లీ జాబితాలో చేర్చాలని 2025కు ముందున్న ఓటర్ జాబితానే కొనసాగించాలని కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ 13 కోట్ల ఓటర్ల వివరాలను బీజేపీ క్లియర్‌గా వివరించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది మాట్లాడుతూ ఈ 13 కోట్ల మందిలో మరణించిన వారు, నివాసం మారిన వారు, ఆచూకీ లభించని వారు ఉన్నారని చెప్పారు. ఎన్నికల సంఘం గణాంకాలను ఉటంకిస్తూ 2.8 కోట్ల మంది మరణించారని, 6.3 కోట్ల మంది నివాసం మారారని, 1 కోటి మంది డూప్లికేట్ ఓటర్లు అని, 3 కోట్ల మంది ఆచూకీ లభించలేదని చెప్పారు. నకిలీ ఓటర్లను కాపాడాలని కాంగ్రెస్ అనుకుంటోందా అని త్రివేది ప్రశ్నించారు. ఇలా చేయడం ద్వారా కాంగ్రెస్ ఎవరికి మేలు చేయాలని అనుకుంటోంది అని అడిగారు. గత 10 నెలల్లో ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు ఎన్నికల కమిషన్ నిర్ణయాలను 14 సార్లు వ్యతిరేకించారని ఆంగ్లపత్రిక కథనంలో వెల్లడించింది.

# సంక్షిప్త వార్తలు

## రెజినగర్ ఉప ఎన్నికల వేళ హుమాయూన్ కబీర్ అదుపులోకి



**ముర్షిదాబాద్, అక్టోబరు 6:** రెజినగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్న వేళ ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ అధినేత, ఎమ్మెల్యే హుమాయూన్ కబీర్‌ను చట్టాన్ని ఉల్లంఘించిన కారణంగా అదుపులోకి తీసుకున్నట్లు బెల్డంగా ఎస్‌డీపీఓ ఆనంద్‌జిత్ హోర్ తెలిపారు. ముర్షిదాబాద్‌లోని తన పార్టీ కార్యాలయం నుంచి రెజినగర్ పోలీసులు హుమాయూన్ కబీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. చట్టాన్ని ఉల్లంఘించినందుకే హుమాయూన్ కబీర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌డీపీఓ ఆనంద్‌జిత్ హోర్ తెలిపారు.

## హెలికాప్టర్ దిగుతూ తూలిపడబోయిన ఉషావాన్స్



**సెయింట్‌ఆండ్రూస్ ఎయిర్‌బేస్, అక్టోబరు 6:** అమెరికా సెకండ్ లేడీ, అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ భార్య ఉషావాన్స్ ఎంతో సెక్యూరిటీ మధ్య ఉంటున్నా ఆమెకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. నవజాత శిశువు అలెక్‌ను బేబీ క్యారియర్‌లో ఎత్తుకుని హెలికాప్టర్ మెట్లు దిగుతుండగా ఒక్కసారిగా కాలుజారి పడబోయారు. అయితే వెంటనే తేరుకుని రైలింగ్‌ను పట్టుకుని బ్యాలెన్స్ చేసుకున్నారు. అనంతరం శిశువు వీపుపై చేయి వేసి ధైర్యపరిచి చిరునవ్వుతో ముందుకు సాగిపోయారు.

## వైమానికదళ విమానానికి ప్రమాదం - 32 మంది మృతి



**అబూజా, అక్టోబరు 6:** నైజీరియా వైమానిక దళానికి చెందిన ఎటీఆర్42 విమానం అనూహ్య రీతిలో ప్రమాదానికి గురైంది. ఒండో రాష్ట్రంలోని ఇగ్బోకోడా సమీపంలో ఉన్న నావల్ బేస్ వద్ద ఈ విమానం ఒక్కసారిగా కూలిపోయింది. బెనిన్ నగరం నుంచి లాగోస్ వైపు సాధారణ పర్యటనలో భాగంగా వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ విస్ఫోటనంలో విమానంలో ప్రయాణిస్తున్న 25 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది కలిపి మొత్తం 32 మంది అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర ప్రమాదంలో నైజీరియా ఎయిర్ మార్షల్, చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ సండే కెల్విన్ అనేకే కూడా కన్నుమూశారు.

## మోడీపై ట్రంప్‌కు మంచి అభిప్రాయం: ఆసీస్ ప్రధాని కెవిన్‌రడ్

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత ప్రధాని నరేంద్ర మోడీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చాలా మంచి అభిప్రాయం ఉందని ఆస్ట్రేలియా మాజీ ప్రధాని కెవిన్ రడ్ పేర్కొన్నారు. వాణిజ్యం, రక్షణ, ఇంధనం వంటి కీలక సాంకేతిక రంగాల్లో భారత్‌అమెరికా ముందుకు సాగుతున్న సమయంలో కెవిన్ రడ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి సుంకాలు, మార్కెట్ ప్రవేశంపై చర్చలు కఠినంగా ఉన్నప్పటికీ, అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య చర్చలలో భారతదేశం సాపేక్షంగా బలమైన స్థితిలో ఉందని రడ్ అన్నారు.

## చెన్నై పోర్టులో రూ.12 కోట్ల చైనా పైరోటెక్నిక్ క్రాకర్స్ స్వాధీనం



చెన్నై, అక్టోబరు 6: చెన్నై పోర్టులో అక్రమంగా భారీగా దిగుమతి చేసిన చైనా బాణసంచాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ డీఆర్ఐ జోనల్ యూనిట్ నుంచి అందిన సమాచారంతో అధికారులు చెన్నై పోర్టులోని పలు కంటైనర్లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.12 కోట్ల విలువైన చైనా పైరోటెక్నిక్ బాణసంచా బయటపడింది. స్టేషనరీ, మెడికల్ గ్లౌజులు, ప్లాస్టిక్ క్లిప్స్, హెయిర్ బ్యాండ్స్, స్టోరేజ్ వార్డ్‌రోబ్స్, షూ ర్యాక్స్ వంటి వస్తువుల పేరుతో సరుకును దిగుమతి చేసినట్లు గుర్తించారు.

# విజయవాడ ఉత్సవ్‌కు రండి..!!

- బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారికి ఆహ్వానం పలికిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.




**విజయవాడ, అక్టోబరు 6, ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వర కు ఘనంగా నిర్వహించనున్న విజయవాడ ఉత్స వ్-2.0కు హాజరు కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నా యుడు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని ఆహ్వానించారు. కలకత్తా లోని సచివాలయ భవనం నబన్నా సభాఘర్ లో సువేందు అధికారిని కలిసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. విజయవాడలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్స వాలు, విజయవాడ ఉత్సవ్-2.0కు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. అక్టోబర్ 11 నుంచి 20 వరకు పది రోజుల పాటు జరిగే విజయవాడ ఉత్స వ్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా, వినోద కార్యక్రమాలతో పాటు ప్రత్యేక ఆకర్షణగా మెగా కార్నివాల్, వివిధ రాష్ట్రాల సాంస్కృతిక ప్రద`ర్శనలు, కళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామ్మోహన్ నాయుడు వివరించారు. విజయ వాడ నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా "వన్ సిటీ - వన్ సెలబ్రేషన్" భావనతో ఉత్స వ్-2.0ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విజయవాడ ఉత్స వ్-2.0లో సువేందు అధికారి పాల్గొని, విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని వీక్షించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి సువేందు అధికారి.. తప్పక హాజరవుతానని స్పష్టం చేశారు.

## శ్రీశైలంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు

# సిఎం చంద్రబాబుకు ఆహ్వానం..



సీఎం చంద్రబాబుకు మంత్రి నారా లోకేష్‌కు ఆహ్వానిస్తున్న దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు

**అమరావతి, అక్టోబరు 6 ప్రభాతవార్తప్రతి నిధి:** శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లిఖా ర్జున స్వామి దేవాలయంలో జరుగ నున్న దేవీ శరన్నవరాత్రి మహోత్స వాలకు హాజరు కావాలని ముఖ్య మంత్రి చంద్రబాబును దేవస్థాన ధర్మ కర్తల మండలి సభ్యులు, అధికారులు ఆహ్వానం పలికారు. ఈ నెల 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్స వాలను నిర్వహించ నున్నట్టు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ మేరకు ఆలయ బోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయు డు, ఈవో యం.శ్రీ నివాసరావు, శ్రీశైలం ఎమ్మె ల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందించారు. శ్రీశైల దేవస్థానం ఆలయ పండితులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వే దాశీర్వచనం పలికారు. సీఎంకు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాలను దేవాలయ అధికారులు అందించారు. బ్రహ్మోత్స వాలకు సంబంధించి దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

**మంత్రి లోకేష్‌కు ఆహ్వానం**

దేవీ శరన్న వరాత్రి మహోత్స వాలకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు శ్రీశైలం దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు మంగళవారం ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

# బస్సులో పరిచయం.. ప్రేమ పేరుతో మోసం..

- రూ.20 లక్షల వరకు నగదు, బంగారం తీసుకున్నాడని ఆరోపణ
- కండక్టర్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి ఆర్ఎంకు మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశం
- ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం



**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** బస్సులో పరిచయమైన ఆర్టీసీ కండక్టర్ ప్రేమ పేరుతో విసిరిన వలలో పడి ఇబ్బందులు పాలైన ఒక యువతి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆశ్రయించింది.చంద్రగిరి మండలం కొంగరవారిపల్లెకు చెందిన ఎం. బేబీ శాలిని తనకు ఎదురైన సమస్యను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తనకు జరిగిన పరిణామాలను వివరించి, న్యాయం చేయాలని కోరారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమె తాను చంద్రగిరి నుంచి తిరుపతికి ప్రతిరోజూ బస్సులో ప్రయాణించే క్రమంలో ఆర్టీసీ కండక్టర్ వి. సుబ్రహ్మణ్యంతో పరిచయం ఏర్పడిందని తెలిపారు. ఆ పరిచయాన్ని క్రమంగా పెంచుకున్న సుబ్రహ్మణ్యం తనను ప్రేమిస్తున్నానని నమ్మించి, తనను మోసం చేశాడని ఆరోపించారు. ప్రేమ పేరుతో తనపై నమ్మకం కలిగించిన అనంతరం వివిధ దశల్లో తన నుంచి సుమారు రూ.20 లక్షల వరకు నగదును తీసుకున్నాడని ఆరోపించారు. ఫోన్‌పే ద్వారా పలుమార్లు నగదు బదిలీ చేయించుకున్నాడని, తనతో బంగారం కూడా కొనిపించుకున్నాడని తెలిపారు. తన వద్ద నుంచి తీసుకున్న నగదు, బంగారం తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశాడని వాపోయారు. అదేవిధంగా, తనను ప్రేమిస్తున్నానని చెబుతూ తన వెంటపడి, తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు. ఈ పరిణామాలతో తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, తనకు న్యాయం చేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కోరారు. తన వద్ద ఉన్న ఫోన్‌పే లావాదేవీల వివరాలు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, బంగారం కొనుగోలుకు సంబంధించిన బిల్లులు, ఇతర ఆధారాలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**తిరుపతి ఆర్ఎంకు మంత్రి వీడియో కాల్..**

బాధితురాలు తన సమస్యను వివరించిన వెంటనే మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం (రీజినల్ మేనేజర్)కు వీడియో కాల్ చేసి సమస్యను వివరించారు. బాధితురాలు చేసిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపించాలని, సంబంధిత కండక్టర్‌పై కఠినమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు సేవ చేయాల్సిన ఆర్టీసీ సిబ్బంది తమ విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రయాణికులతో ముఖ్యంగా మహిళలతో మర్యాదగా, బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు ఎదురైనప్పుడు విషయాన్ని తేలికగా తీసుకోకుండా నిజానిజాలను పూర్తిస్థాయిలో విచారించి, తప్పు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, సిబ్బంది ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బాధితురాలికి చట్టపరంగా న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు ఆదేశించారు. మహిళల భద్రత, గౌరవానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, బాధితులకు అండగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు.



**డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు మంత్రి లోకేష్ స్వాగతం**

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్ర తినిధి:** సీఎం చంద్రబాబుతో సమావేశం అయ్యేందుకు ఉండవల్లి నివాసానికి వచ్చిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. కారు వద్దకు వచ్చిన లోకేష్ పవన్ కళ్యాణ్‌ను ఆత్మీయంగా హత్తుకుని, కరచాలనం చేసి, ఇంట్లోకి తీసుకెళ్లారు.

## రిఫార్మ్ ఉత్సవ్ వాయిదా.. నిర్వహణ తేదీ మళ్లీ ప్రకటిస్తాం

**మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

**అమరావతి,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ మైనారిటీస్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ఖ (ఎన్.ఎం.డి.ఎఫ్.సి) ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన విజయవా డ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షే మ పథకాలు, రాయితీ రుణాలపై విస్తృత అవ గాహన కల్పించే ఉద్దేశ్యంతో తలపెట్టిన "రిఫార్మ్ ఉత్స వ్" కార్యక్రమం అనివార్య కారణాల వల్ల తాత్కాలికంగా వాయిదా పడినట్లు మైనా రిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన రాష్ట్రవ్యాప్త మైనారిటీ నోడల్ అధికా రులు, నియోజకవర్గ యువతీ యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, లబ్ధిదారులం దరూ ఈ మార్పును గమనించి, సానుకూలంగా పరిగణన లోకి తీసుకోవాలని మంత్రి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.

## సిఎంకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ లేఖ

**విజయవాడ, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ లేఖ రాసారు. ఈ లేఖలో ఎమ్మెల్యే విరూపాక్షని, మరో 44 మందిని 65 రోజులపాటు జైల్లో నిర్బంధించటం తగదని వ్యాఖ్యానించారు..స్థానిక ప్రజా సమస్యలపై ప్రెస్ మీట్ పెట్టిన ఎమ్మెల్యే విరూపాక్షని డిఎస్పి బెదిరించటం దుర్మార్గమన్నారు.ఎమ్మెల్యే విరూపాక్షపై అక్రమ కేసులు ఎత్తివేసి, తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.కర్నూలుల్లో కొన్ని మాధ్యమాల విలేకరులపై ఇసుక మాఫియా దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతియ కార్యదర్శి కె రామకృష్ణ వ్యాఖ్యానించారు.

# క్లీన్ ఎనర్జీ దిశగా ఆంధ్రప్రదేశ్

- రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్




**తిరుపతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మంగళవారం మంత్రి రవికుమార్ సంస్థ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ దిశగా పయనిస్తుండడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు వంద గిగావాట్ల ఇంధన ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టుల నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయని, ఈ పనులు జరుగుతున్నాయని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో జల విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవడంతో థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిపైనే ఆధారపడడంతో విద్యుత్ కొరతతో కొంతమేరకు ఇబ్బందికర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నప్పటికీ విద్యుత్ రంగ అధికారులు, సిబ్బంది కృషితో సమస్యల్ని అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు వీలుగా రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో అధికారులు, సిబ్బంది కొరతను అధిగమించేందుకు 629 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల నియామకాలను చేపట్టడం జరుగుతోందని తెలిపారు.

**విద్యుత్ రంగంపై నిరంతర సమీక్ష:** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందిండంతోపాటు పిఎం సూర్యఘర్ పథకం కింద రాష్ట్రంలోని ఆరు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను అమర్చే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం సమీక్షి స్తున్నారని మంత్రి తెలిపారు. రూఫ్ టాప్ సోలార్ పనులను సకాలంలో పూర్తి చేయాలని, పనుల్లో నిరక్ష ్యం వహించే కాంట్రా క్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.రూఫ్ టాప్ సోలార్ అంశంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం నాల్గవ స్థానంలో నిలవడం గొప్ప విషయమన్నారు. జాతీయస్థాయిలో విద్యు త్ రంగాన్ని అగ్రగామిగా నిలపడమే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు.

**-ఆర్డిఎస్ఎస్ పనులు వేగవంతం:** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో పునరుత్పాదక విద్యుత్ పంపిణీ పథకం (ఆర్డిఎస్ఎస్) కింద విద్యుత్ వ్యవస్థ బలోపేతం పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనుల్లో కాంట్రాక్టర్లు నిరక్ష ్యం వహించినట్లయితే సంబంధిత కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో వేగాన్ని పెంచాలని, నాణ్యతలో ఎటువంటి రాజీ వుండబోదని తెలియజేశారు. పిఎంకుసుమ్ పథకం కింద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ పనుల్ని వేగవంతం చేయాలని అధికారులను అదేశించారు.

# సైబర్ సెల్ ప్రతిభ, 200 ఫోన్లు రికవరీ





**ఏలూరు, అక్టోబరు 6 ప్రభాతవార్త:** ఏలూరు జిల్లాలో వివిధ కారణాలతో పోగొట్టుకున్న మొబ ైల్ ఫోన్లను గుర్తించడంలో జిల్లా సైబర్ సెల్ పోలీసులు ప్రతిభ కనబరిచారు. జిల్లా ఎస్పీ కె. ప్రతా ప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసు, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సెప్టెంబరు నెలలోనే 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.50.00 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం నుంచి సంబంధిత బాధితులకు పోలీసులు అందజేస్తున్నారు. ఇప్పటివరకు ఏలూరు జిల్లా పోలీసులు మొత్తం 4,563 మొబైల్ ఫోన్లను రికవరీ చేయగా, వాటి విలువ సుమారు రూ.11.40 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను పోలీసులు ప్రదర్శించారు.

**పోగొట్టుకున్న ఫోన్లపై వెంటనే ఫిర్యాదు:** మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీసులు సూచించారు. వెంటనే కేంద్ర పరికరాల గుర్తింపు నమోదు పోర్టల్ ద్వారా లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని కోరారు. ప్రజలు అందించే ఫిర్యాదుల ఆధారంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించేందుకు పోలీస్ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు.

## శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు 11న అంకురార్పణ



- 12న పెద్దశేషవాహనం

**తిరుమల, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** అధికమాసం కావడంతో ఈ ఏడాది ఏడు కొండల వేంకటేశ్వరస్వామికి రెండుసార్లు నిర్వహిస్తున్న బ్రహ్మోత్స వాల్లో ఈనెల 12 నుండి 20వరకు నవరాత్రి ఉత్స వాలకు తి రుమల ముస్తాబైంది. నవరాత్రి బ్రహ్మోత్స వాలకు ధ్వజారోహణం, ధ్వజవరోహణం, రథోత్స వం ఉండదు. రెండవ విడత మొదలుకానున్న నవరాత్రి బ్రహ్మోత్స వాలకు తిరుమలలో అదనపు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బ్రహ్మోత్స వాలకు తొలి ఘ ట్టంగా ఆదివారం రాత్రి అంకురార్పణతో శ్రీకారం చుడతారు. 12వతేదీ సోమవారం రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహన సే వతో మొదలై చివరగా 20వతేదీ ఉద యం చక్రస్నానంతో ఉత్స వాలు ముగుస్తాయి.

**-వాహనసేవలు ఇలా:** జగరనున్న బ్రహ్మోత్స వాల్లో ప్రతిరోజూ ఉదయం వాహ నసేవ 8 నుండి 10 గంటల వరకు, రాత్రి వాహనసేవ 7 నుండి 9 గంటల వరకు జరుగుతుంది. గరుడవాహనసేవ 16వతేదీ శుక్రవారం రాత్రి 6.30 నుండి 11.30 గంటల వరకు జరుగుతుంది. ఈ బ్రహ్మోత్స వాలలో 12న ఉదయం 9 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్స వం, రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనం, 13న ఉదయం 8 గంటలకు చిన్నశేష వాహనం,రాత్రి 7 గంటలకు హంస వాహనం, 14 న ఉదయం 8 గంటలకు సింహ వాహనం,రాత్రి రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనం , 15 న ఉదయం 8 గంటలకు కల్పవృక్ష వాహనం,రాత్రి 7 గంటలకు సర్వభూపాల వాహనం , 16న ఉద యం 8 గంటలకు మోహినీ అవతారం, సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహనం ,17న ఉదయం 8 గంటలకు హనుమంత వాహనం,సాయంత్రం 4 గంటలకు పుష్పక విమానం,రాత్రి 7 గంటలకు గజ వాహనం ,18న అక్టోబరు 18 ఉదయం 8 గంటలకు సూర్యప్రభ వాహనం,రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనం ,19న ఉదయం 7 గంటలకు స్వర్ణరథం,రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం, అక్టోబర్ 20వతేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు చక్రస్నా నంతో ముగుస్తాయి.

**-పటిష్ట ఏర్పాట్లు:** భక్తుల రద్దీని ముందుగానే అంచనావేసిన టిటిడి పెద్దలు, అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తు న్నారు. ఆదివారం సాయంత్రం జరిగే అం కురార్పణతో మొదలవుతున్నాయి. సా యంత్రం శ్రీవారి సేనాధిపతి విశ్వ క్సే నులు ఆలయానికి నైరుతుమూలలో వున్న వసంతమండపానికి ఛత్రఛామర మంగళవాయిద్యాలతో వెళతారు. అక్కడ పుణ్యా హావచనం, భూమిపూజ తదితరాలు నిర్వ హించి పుట్టమన్నున్న సేకరించి మృత్సం గ్రహణంచేస్తారు. ప్రదక్షిణగా ఆలయం లోనికి చేరుకుంటారు. నవధాన్యాలతో అంకురార్పణం జరుగుతుంది.

# బ్రహ్మోత్సవాల్లో సామాన్యభక్తులకు శ్రీవారి దర్శనం

- ఆరురోజులకు 60వేల ఎస్ఇడి టిక్కెట్లు నేడు ఆన్‌లైన్‌లో విడుదల



**తిరుమల, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పెరటాసి మాసం... ఆపై దసరా సెలవులు నేపథ్యంలో తిరుమలలో వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్స వాలు జరగనున్నాయి. ఈనెల 12నుండి మొదలయ్యే బ్రహ్మోత్స వాలు తొమ్మిదిరోజులు జరగుతాయి. ఈ నేపథ్యంలో అన్ని ఆర్జిత సేవలు,ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలు టిటిడి రద్దుచేసింది. ఈనెల 11 నుండి 20వ తేది వరకు విఐపి బ్రేక్ ప్రివిలేజ్ దర్శనాలు రద్దుచేసింది. ఈ నేపథ్యంలో నవరాత్రి బ్రహ్మోత్స వాలకు సంబంధించి అక్టోబర్ 12, 13, 14, 18, 19, 20వ తేదీలకు భక్తులు మూలవిరాట్టును దర్శనం చేసుకునేందుకు వీలుగా 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఆరురోజులకు 60వేల టిక్కెట్లు విడుదల చేయాలని నిర్ణయించింది. ఇందుకు రోజుకు 10వేల మంది భక్తులకు అదనంగా దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది. ఈ ఆన్‌లైన్ ఎస్ఇడి టిక్కెట్లను నేడు ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్ లైన్ లో విడుదల చేస్తుంది. భక్తులు ఈ టికెట్లను "టిటిదేవస్థానమ్స్.ఎపి,జివోవి.ఇన్"ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని విజ్ఞప్తిచేసింది. ఈనెల 12 నుండి 20వ తేది వరకు తిరుమలలో శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్స వాలు నిర్వహించనుండటంతో బాటు పెరటాసి మాసం చివరి వారం కావడంతో భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ పది రోజుల పాటు ప్రోటోకాల్ ప్రముఖులకు మినహావిఐపి బ్రేక్, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, డిఫెన్స్ దర్శనాలను టిటిడి రద్దు చేసింది. విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి అక్టోబర్ 10వ తేది నుండి 19వ తేది వరకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులు తమ తిరుమల యాత్రను రూపొందిచుకోవాల్సిందిగా టిటిడి విజ్ఞప్తి చేసింది.

# రెండోఘాట్‌లో 'బస్‌బే' ఏర్పాటు ఏదీ!?

- టోల్‌గేట్‌లోనే భారీగా నిరీక్షణ



**తిరుమల, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** గోవిందా గోవింద నామ స్మరణతో భక్తితో తిరుమలకు వస్తున్న భక్తుల్లో అధిక శాతమంది ఆర్టీసి బస్సులద్వారానే ప్రయాణిస్తున్నారు. ఇలా తిరుపతి నుం డి తిరుమలకు చేరుకునే భక్తులను అలిపిరి సప్తగిరి తనిఖీ కేం ద్రం వద్ద తనిఖీ చేయడం జరుగుతుంది. లక్షలాది మంది యా త్రికులు తమ వాహనాలను,లగేజీలను అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తనిఖీ చేసుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో సామా న్యభక్తులు కూడా పలు రకాలుగా తిరుపతికి చేరుకుని తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఇలా ప్రయాణించే వారిని సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద దిగి తనిఖీ చేసుకోవాల్సిన అవసరం ఉండటంతో రద్దీవేళ అర్ధగంట సమయం వేచివుండక తప్పడంలేదు. దీంతో ఈ నిరీక్షణకు చెక్ పెట్టి ఆర్టీసి బస్సులన్నీ టోల్‌గేట్ దాటిన తరువాత వచ్చే వరసిద్ధివినాయకస్వామి ఆల యం సమీపంలో తనిఖీ చేసుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా బస్‌బే ఏర్పాటుకు గతంలోనే టిటిడి బోర్డు ఆమోదించింది. ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు ఈ చర్యలు తీసుకోకపోవడంతో టోల్‌గేట్‌లోనే బస్సులు తనిఖీ చేసుకోవడం తప్పడంలేదు. ప్రతిరోజూ 450 వరకు ఆర్టీసి బ స్సులు తిరుమల-తిరుపతి,తిరుపతి-తిరుమల మధ్య నడు స్తున్నాయి. 40వేలమంది వరకు యాత్రికులు ప్రయాణిస్తు న్నారు. అలిపిరి తనిఖీకేంద్రంలో వాహనాలతో రద్దీగా ఉంటుం ది. ఇక్కడ బస్సులు దిగిన ప్రయాణీకులు/భక్తులు తిరిగి అదే బస్సులను ఎక్కడంలో అవస్థలు పడుతున్నారు. కొన్ని సమ యాల్లో బస్సులు తప్పిపోతున్నారు. దీంతో ఈ తనిఖీలను మరింత సాఫీగా సులభంగా వినాయకస్వామి గుడివద్ద చేపట్టేం దుకు బుధవారం టిటిడి బోర్డు కూడా అమోదించింది. అలిపిరి టోల్‌గేట్‌లో వేకువజామున 3గంటల నుండి అర్ధరాత్రి 12గంటల వరకు వాహనాలను అనుమతిస్తున్నారు. దేశం నలు మూలల నుండి వస్తున్న యాత్రికులతోబాటు 10వేలకుపైగా వాహనాలు, 450వరకు ఆర్టీసి బస్సులు, రెండువేల వరకు స్థానిక వాహనాలు,ట్యాక్సీలు, మరో వెయ్యివరకు ద్విచక్రవాహానాలు ఇలా పెద్దసంఖ్యలో అలిపిరి టోల్‌గేట్ దాటుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల్లో ప్రయాణించే యాత్రికులను తనిఖీ కేంద్రం దాటిన తరువాత వచ్చే వినాయకగుడి వద్ద బస్‌బేలో తనిఖీలు చేయాలని నిర్ణయించడం విశేషం. 12లేన్లను 15లేన్లుగా విస్తరించడానికి చర్యలు చేపడుతున్నారు.

## తిరుపతిలో యాత్రికుల్లా రవాణాశాఖ అధికారులు

- ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా తనిఖీలు

**తిరుపతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం,పుణ్యక్షేత్రం తిరుపతికి వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ట్యాక్సీ వాహనాల డ్రైవర్లు దోపిడీనుండి రక్షించడానికి తిరుపతి జిల్లా రవాణాశాఖ అధికారులు వినూత్నంగా తనిఖీలు చేశారు. యాత్రికుల తరహాలో రవాణాశాఖ అధికారులు మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ ప్రాంతంలో పలువురు ట్యాక్సీ డ్రైవర్లను పలకరించి తిరుమలకు, శ్రీకాళహస్తికి, స్థానిక ఆలయాలకు ఛార్జీలపై ఆరా తీశారు. రాబోయే శ్రీవారి బ్రహ్మోత్స వాల నేపథ్యంలో ప్రయాణికుల భద్రత, సౌకర్యం సురక్షి త ప్రజా రవాణాను నిర్ధారించే లక్ష ్యంతో పోలీస్, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ఉదయం తిరు పతి రైల్వే స్టేషన్ ,ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఆటోరిక్షాలు, సుమోలు, జీపులను తనిఖీలు చేశారు. ప్రయాణికుల నుండి అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న వాహనాలను గుర్తించేందుకు పోలీసు సిబ్బంది ప్రయాణికుల మాదిరిగా మారువేషాల్లో వాహనాలను అద్దెకు మాట్లాడి, నిర్దేశిత గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఎంత ఛార్జీ వసూలు చేస్తున్నారో పరిశీలించారు. అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు గుర్తించిన వాహనాలపై కేసులు నమోదు చేశారు.3 సుమోలు, 2 జీపులు, 13 ఆటోలు మొత్తం 18 వాహనాలను స్వాధీనం చేసుకుని, సుమారు ఒకలక్ష రూపాయల వరకు జరిమానా విధించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో అధిక ఛార్జీల వసూలు, పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పర్మిట్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లం ఘనలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. తిరుపతికి వచ్చే ప్రయా ణికులను, ముఖ్యంగా శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులను గౌరవంగా చూడాలని, వారితో దురుసుగా ప్రవర్తించకూడదని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ డ్రైవర్లను హెచ్చరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, ట్రాఫిక్ సిఐలు భాస్కర్ నాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కరుణించి వర్షం కురిపించు తల్లీ!

**తిరుపతిలో గంగమ్మ ఆలయంలో వరుణహోమం**

**తిరుపతి, అక్టోబరు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక ప్రజలు,రైతులు ఇబ్బంది పడుతుండటంతో మంచి వర్షాల కోసం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం వరుణహోమం నిర్వహించారు. ఈ హోమం ఉదయం శాస్త్రోక్తంగా వేదమంత్రాల నడుమ ప్రారంభించారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో జరిపించిన వరుణ హోమం, వరుణ జపంలో ఆలయ అర్చకులతోబాటు 14 మంది వేదపండడితులతో శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. రాష్ట్రంలో ,దేశంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలకు, రైతులకు మేలు కలగాలని ఆకాంక్షి స్తూ వరుణ హోమం, వరుణ జపం చేశారు. వేదపండడితులతో వరుణ హోమం, వరుణ జపం నిర్వహించిన అనంతరం 108 కలశములతో అమ్మవారికి జలాభిషేకమును శాస్త్రోక్తంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు ,టిడిపి పరిశీలకుడు నూకసాని బాలాజీ, టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాసులు,బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు,ఎస్వీబిసి ఛైర్మన్ బి. శ్రీధర్ వర్మ, రాష్ట్ర యాదవఅభివృద్ధి కమిటీ ఛైర్మన్ జి,నరసింహాయాదవ్, ఆలయ కమిటీ ఛైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, ఆలయ ఇఒ ఎ.జయకుమార్ ,కూటమి నాయకులు పుష్పావతియాదవ్, కృష్ణయాదవ్, దంపూరి భాస్కర్, గుండాల గోపీనాథరెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విగ్రహాల కళ్యాణి, విజయభాస్కర్ రెడ్డి, జయంత్ కుమార్ శంకర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

7-10Pg8exHMNWJQE.qxd:7-10Pg8exHMNWJQE.qxd 1/1/02 6:34 AM Page 1



# వీఆర్‌సి గ్రౌండ్‌కు కొత్త కళ

**● ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ ● ప్రభుత్వ పాఠశాలల్లోనూ క్రీడా సదుపాయాల కల్పన ● మంత్రి నారాయణ**



**నెల్లూరు, అక్టోబరు 6, ప్రభాతవార్త-వైద్యం :** నెల్లూరు నగర నడిబొడ్డున ఉన్న వీఆర్‌సీ గ్రౌం డ్‌కు కొత్త హంగులు అద్దేందుకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శ్రీకారం చుట్టింది. విద్యార్థులు, వాక ర్స్, క్రీడాకారులకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్ల నిర్మాణ పనులకు తన కుమార్తె షరణితో కలిసి శంకుస్థాపన చేశారు. బాస్కెట్‌బాల్ కోర్టును కూడా ఆధునీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువులతో పాటు విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వీఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఇండోర్, అవుట్‌డోర్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, షెల్టర్, టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్థలం అందుబాటులో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలోనూ స్విమ్మింగ్ పూల్స్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**- 18 పాఠశాలలకు ఆధునిక హంగులు**

నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 18 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని మంత్రి తెలిపారు. వీఆర్ హైస్కూల్‌ను రాష్ట్రంలోని పలు ప్రాంతాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని, ఈ పాఠశాలకు స్వచ్ఛ అవార్డు కూడా లభించిందని చెప్పారు. అదే స్ఫూర్తితో డీఎస్సార్, ఆర్ఎస్ఆర్ పాఠశాలలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి ప్రారంభించామని తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి తన స్నేహితులు, పూర్వ విద్యార్థులు, ఉన్నత స్థాయిలో ఉన్న తన పరిచయస్తుల సహకారాన్ని తీసుకుంటానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల అభివృద్ధిని అభినందిస్తుంటే వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వారి అవాకులు, చవాకులను నేను పట్టించుకోనన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్య, క్రీడా సదుపాయాలు అందించడమే మా లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం 14వ డివిజన్‌లోని ఎంఎస్ఎం హైస్కూల్, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలను మంత్రి పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, క్రీడా సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

**- డాక్టర్ పోకల రవికి ప్రశంసాపత్రం**

వీఆర్‌సీ గ్రౌండ్‌లో జెండా పోల్ ఏర్పాటుకు రూ. 20 వేల విరాళం అందించిన డాక్టర్ పోకల రవిని మంత్రి నారాయణ అభినందించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పంపిన ప్రశంసాపత్రాన్ని ఆయనకు అందజేశారు. వీఆర్‌సీ గ్రౌండ్‌లో మెరుగైన సదుపాయాల కోసం తమ కోరికను నెరవేరుస్తున్న మంత్రి నారాయణకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. కేక్ కట్ చేయించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హిమబిందు, ఎస్ఈ జానీ, డీఈవో బాలాజీరావు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు యశ్వంత్‌రెడ్డి, డాక్టర్ పోకల రవి, సుజన్, పిట్టి సత్యనాగేశ్వరరావు, ఏడుకొండలు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సుబ్బారెడ్డి, బాబు, నన్నే సాహెబ్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా దసరా నిర్వహణకు సన్నద్ధం

**● మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సత్యకుమార్ యాదవ్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత**



**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 6, ప్రభాతవార్త :** దుర్గమ్మవారి ఆలయంలో జరగబోతున్న దసరా ఉత్సవాలకోసం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లపై విజయవాడలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, హోం మంత్రి అనిత,ఘనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ వెస్ట్ ఎమ్ ఎల్ ఏ సుజనా చౌదరి,దేవాదాయ శాఖ కార్యదర్శి కే. కన్నబాబు,జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, దేవాదాయ శాఖ కమిషనర్ కే.రామచంద్ర మోహన్, పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం **రామనారాయణరెడ్డి మాట్లాడుతూ:** ఉత్సవాల్లో సామాన్య భక్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తిగా దర్శనం చేసుకుని, సంతోషంగా ఇంటికి తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలి అని అధికారులకు స్పష్టం చేశారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని సూచించారు. క్యూ లైన్లలో భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని, రద్దీకి అనుగుణంగా క్యూ లైన్లను క్రమబద్ధీకరించాలని , భక్తులకు అందించే ఆహారం, ప్రసాదం, తాగునీటి విషయంలో నాణ్యతతో పాటు సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వైద్య సిబ్బంది, అంబులెన్సులు, అత్యవసర సేవలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. దసరా ఉత్సవాలు కేవలం దేవాదాయ శాఖకు సంబంధించిన కార్యక్రమం కాదని, లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. పోలీసు, దేవా దాయ, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, విద్యుత్, అగ్నిమాపక, పౌర సరఫరాలు తదితర శాఖల మధ్య నిరంతర సమన్వయం ఉండాలని సూచించారు. గత దసరా ఉత్సవాల్లో ఎదురైన సమస్యలను సమీక్షించి, అవి ఈ ఏడాది పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏదైనా సమస్య తలెత్తిన తర్వాత స్పందించడం కంటే సమస్యలు తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించి పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని సూచించారు. మూల నక్షత్రం రోజున సీఎం కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారని మంత్రి తెలిపారు.

# గుడివాడ-హనుమాన్‌జంక్షన్ రహదారి విస్తరణ : ఎంపి బాలశౌరి



**హనుమాన్‌జంక్షన్(కృష్ణా), అక్టోబర్ 6, ప్రభాతవార్త :** జాతీయ రహదారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నామని, ఇందులో భాగంగా గుడివాడ - హనుమాన్‌జంక్షన్‌ల మధ్య ప్రస్తుతం ఉ న్న రహదారిని నాలుగులేన్‌లుగా విస్తరించేందుకు డిపిఆర్ రూ పొందిస్తున్నట్లు మచిలీపట్నం యంపి వల్లభనేని బాలశౌరి తెలి పారు. మంగళవారం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు, బొమ్ములూరు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, కెడి సిసి చైర్మన్ నెట్టెం రఘురామ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా వేలేరు గ్రామంలోని పిఏసిఎస్‌లో కొత్తగా బంగారు రుణాల మంజూరును, డివెండెండ్‌లు అతిథులు పంపిణీ చేసారు. హెచ్ఏఎల్ సంస్థ సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమిపూజ చేసారు. ఈసందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ ఈరహదారి విస్తరణకు రూ.1200కోట్లు ఖర్చుకానుందన్నారు. ఈదారిలో బుడమేరుపై వంతెన నిర్మాణానికి భూసేకరణతో కలిపి రూ.104కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. విప్ యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులతోపాటు వివిద సంస్థల సిఎస్ఆర్ నిధులు సద్వినియోగం చేసుకుంటున్నట్లు తెలిపారు. కూటమి నాయకులు సమన్వ యంతో పనిచేసి స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపు నిచ్చా రు. కెడిసిసి చైర్మన్ నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ పిఏసి ఎస్‌లను పూర్తిస్థాయి బ్యాంకింగ్ సేవల కేంద్రంగా తీర్చిది ద్దేందు కు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సహకారసం ఘాల్లో కంప్యూటరీకరణ చేపట్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందు బాటులోకి తెచ్చినట్లు వివరించారు. సహకారసంఘాల్లో ఆన్‌లైన్ సేవలు విస్తృతం చేస్తున్నట్లు రఘురామ్ పేర్కొన్నారు. అనంత రం బొమ్ములూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈకార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బొబ్బిలి గ్రోత్ సెంటర్ బెర్రీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

**● ఆస్తి నష్టం 4 కోట్ల రూపాయలు అంచనా**



**బొబ్బిలివిజయనగరం, అక్టోబర్ 6 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా బొబ్బిలి గ్రోత్ సెంటర్ బెర్రీ కంపెనీలో మంగళవారం సాయంకాలం 6:30 కి బాయిలర్ పేలడంతో భారీ అగ్నికీలలు ఎగిసాయి. ఈ ప్రమాదంలో నాలుగు కోట్ల రూపాయల వరకు ఆస్తి నష్టం జరగవచ్చని హెచఆర్ రాజు అన్నారు. ఈ ప్రమాదంలో కార్మికులు సిబ్బందికి ఏ విధమైన హాని జరగలేదని తెలియజేశారు. ప్రమాదం జరిగినప్పుడు స్లాగ్ తెచ్చే లారీ కార్మికుడు మంటలు ఎగిసిపడటంతో అగ్నికీలలు తన మీద పడిపోతాయని భయంతో లారీ కింద దాక్కున్నాడు. ఇంతలో లారీ డ్రైవర్ దాన్ని గమనించలేదు ఆయన ప్రేమతో లారీని బయటికి తీసుకెళ్ళే క్రమంలో లారీ కింద ఉన్న గంట్రేటి సూర్యనారాయణ ఎడమ కాలు పూర్తిగా నలిగిపోయింది. హుటాహుటిన ఫ్యాక్టరీ హెచ్ ఆర్ తదితర సిబ్బంది స్థానిక ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి విజయనగరం సాయి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నారాయణరావు తెలియజేశారు.

# ఫ్యాన్‌కు ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

**విజయవాడ,అక్టోబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రమైన తోట్లవల్లూరులో జరిగింది. గ్రామంలోని పీహెచ్‌సీకి సమీపంలో నివసించే పోతుగంటి సత్యన్నారాయణ చిన్న కుమార్తె లక్ష్మీప్రియాంక(27)కు గొల్లపూడికి చెందిన వేల్పూరి అశోక్‌కుమార్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. దంపతుల మధ్య గొడవలు జరగటంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి లక్ష్మీప్రియాంక పుట్టింట్లోనే ఉంటోంది. గత శనివారం భర్త అశోక్‌కుమార్ కోర్టు నోటీస్‌ను లక్ష్మీప్రియాంకకు పంపించాడు. దీంతో ఆమె అదే రోజు గొల్లపూడిలోని భర్త ఇంటికి వెళ్లి వచ్చింది. సోమవారం తల్లిదండ్రులు సత్యన్నారాయణ, ధనలక్ష్మి వి విజయవాడలోని ఆస్పత్రికి వైద్యచికిత్స కోసం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాత్రి వారు ఇంటికి తిరిగి వచ్చిన వారికి ఇంట్లో ఉరేసుకుని విగతజీవిగా ఉన్న కుమార్తె మృతదేహాన్ని గమనించారు, కుమార్తె ఆత్మహత్యకు పాల్పడటంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తన ఆత్మహత్యకు భర్త, అత్త, చిన్నత్త, ఆడపడుచులే కారణమని మృతురాలు లక్ష్మీప్రియాంక రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభ్యమైంది. ఘటనా ప్రాంతాన్ని తహాసీల్దార్ కుసుమకుమారి, పమిడిముక్కల సీఐ చిట్టిబాబు సందర్శించి పరిశీలించారు. సత్యన్నారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఆమె శవాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్గమ్‌కు పంపించారు. మృతురాలు భర్త, అత్త, చిన్నత్త, ఆడపడుచులను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నారు.

# రుద్రకోటలో మహిళ దారుణ హత్య

**కావలి (నెల్లూరు), అక్టోబర్ 6, ప్రభాతవార్త :** కావలి మండలం రుద్రకోటలో గిరిజన మహిళ మానికల సుబ్బులు(45) దారుణ హత్యకు గురి కావడం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రుద్రకోట గిరిజన కాలనీకి చెందిన కొండలరావు రైల్వేకోడూరులో ఇటుక బట్టీలు వద్ద పనిచేస్తూ ఉంటాడని తెలియజేశారు. అక్కడ సుబ్బులుతో పరిచయం ఏర్పడి పరిచయం కాస్త ప్రేమగా మారడంతో ఏడాదికితం వివాహం చేసుకున్నట్లు తెలియజేశారు. గత కొంతకాలంగా కొండలరావు అనుమానం పెంచుకోవడం జరిగిందన్నారు. సుబ్బులు చిన్నమ్మ మృతి చెందితే నాలుగు రోజుల క్రితం ఇద్దరూ నెల్లూరుకు రావడం జరిగిందని తెలియజేశారు. కొండలరావు రుద్రకోటకు వెళ్లి తన తల్లిని చూసి వద్దామని చెప్పడంతో మంగళవారం ఇద్దరు రుద్రకోటకు వెళ్లడం జరిగిందని తెలియజేశారు. రుద్రకోటలో కట్టెలు తీసుకుని వద్దామని పక్కనున్న పొలాల్లోకి కొండలరావు సుబ్బులను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అక్కడకికత్తితో సుబ్బులను హత్య చేసి పరారు కావడం జరిగిందన్నారు. కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేశ్వరరావు, ఎస్సైలు బాజీ బాబు, ఇంద్రసేనారెడ్డిలు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు కావలి ఏరియా వైద్యశాలకు తరలించడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిడిపి వృద్ధి అంచనా 7.1 శాతం

**● మొదటి త్రైమాసికంలో అంచనాలకు మించి వృద్ధి నమోదు**

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రపంచ బ్యాంక్ సానుకూల అంచనాను వెల్లడించింది. 2026 -27 ఆర్థిక సంవత్సరంలో భారత్ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి రేటు 7.1 శాతంగా ఉండవచ్చని అంచనా వేసింది. గత ఏప్రిల్‌లో ప్రకటించిన 6.6 శాతం అంచనాను తాజాగా 0.5 శాతం పెంచింది. మొదటి త్రైమాసికంలో అంచనాలకు మించి వృద్ధి నమోదు కావడం, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగడం వంటి అంశాలు వృద్ధి అంచనాను పెంచడానికి ప్రధాన కారణాలని ప్రపంచ బ్యాంక్ తన తాజా ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్‌లో పేర్కొంది. వాణిజ్య, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉన్నప్పటికీ ఆర్థిక వృద్ధి అంచనాల కంటే మెరుగ్గా కొనసాగుతోంది. అందుకే వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 7.1 శాతానికి పెంచామని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. భారత్ ఆర్థిక వృద్ధి 2025లో నమోదైన 7.2 శాతం నుంచి 2026లో 7.8 శాతానికి పెరిగింది. బలమైన పెట్టుబడులు, స్థిరమైన ప్రైవేట్ వినియోగం ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయి. అనుకూల విధానాలు, మెరుగైన రుణ లభ్యత వాణిజ్యపరమైన ఉద్రిక్తతల ప్రభావాన్ని అధిగమించేందుకు ఆర్థిక వ్యవస్థకు తోడ్పడ్డాయని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల్లో మెరుగుదల భవిష్యత్తులో భారత ఆర్థిక వృద్ధికి కీలకంగా మారనున్నాయని నివేదిక తెలిపింది. తాజా అంచనాల నేపథ్యంలో ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ తన బలమైన స్థానాన్ని కొనసాగించనుంది. అయితే భారత్ ఆర్థిక వ్యవస్థకు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు భారీగా పెరగడం, ఎల్‌నినో ప్రభావం, స్టాక్ మార్కెట్లలో పతనం వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిణామాలు విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ మూలధన ప్రవాహాల్లో హెచ్చుతగ్గులకు దారి తీయవచ్చని పేర్కొంది. వృద్ధి అంచనాలు మెరుగుపడినప్పటికీ, అంతర్జాతీయ పరిస్థితులను నిశితంగా పరిశీలించడం అవసరమని సూచించింది. జూలై నుంచి సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవడంతో రుతుపవనాల లోటు కొంత తగ్గిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. అయితే మొత్తం నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం లోటు వ్యవసాయ రంగం అంచనాలను బలహీనపరిచిందని పేర్కొంది. కృత్రిమ మేధస్సు భారత్‌కు భవిష్యత్తులో కొత్త వృద్ధి ఇంజిన్‌గా మారే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఏఐను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్న ప్రపంచంలోని టాప్10 అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత్ ఒకటిగా ఉందని నివేదిక పేర్కొంది. భారత్‌లో ప్రైవేట్ రంగ ఏఐ పెట్టుబడులు వేగంగా పెరుగుతున్నాయి. 2024లో 1.2 బిలియన్ డాలర్లుగా ఉన్న ఈ పెట్టుబడులు 2025లో 4.1 బిలియన్ డాలర్లకు చేరాయి. అంటే ఒక్క ఏడాదిలో మూడు రెట్లకు పైగా పెరిగాయి. అదే సమయంలో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లలో పనిచేస్తున్న నిపుణుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2024లో 19 లక్షలుగా ఉన్న వారి సంఖ్య 2025లో 23.6 లక్షలకు చేరినట్లు ప్రపంచ బ్యాంక్ తెలిపింది.




# కేబినేట్ సమావేశంలో మా డిమాండ్స్‌పై చర్చించాలి:

**● బి.సి, కాపు, ఇడబ్ల్యుఎస్ ఐక్యవేదిక**

**విజయవాడ, అక్టోబరు 6, ప్రభాతవార్త :**మా ప్రధాన డిమాండ్స్ బి.సి., కాపు, ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి సత్వరమే శాసనసభ, శాసన మండలి ప్రత్యేక సమావేశము ఏర్పాటుచేసి మహారాష్ట్రలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తరహాగా చిత్తశుద్ధితో కూడిన చట్టాలుచేసి పకడ్బందీగా అమలు చేయాలని, బి.సి., కాపు, ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి ఆయా రాజకీయపార్టీల యొక్క ప్రస్తుత వైఖరి"ని వ్రాత పూర్వకంగా తెలియజేయాలని బి.సి, కాపు, ఇడబ్ల్యుఎస్ ఐక్యవేదిక బహిరంగ లేఖ ద్వారా డిమాండ్ చేసింది. టిబికె జెఎసి సౌత్ ఇండియా కన్వీనర్ దాసరి రాము, యర్రాకుల తులసీరామ్ యాదవ్ తదితరులు ఈ లేఖద్వారా సత్వరమే అఖిలపక్షసమావేశం ఏర్పాటు చేయాలని, సమగ్ర జనగణన, సమగ్ర కులగణన ద్వారా ఎవరెంతో వారికంత" అనే సూత్రం ప్రకారం విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించాలి. సకల జనులకు, సార్వజనీన కులాల వారికి సమధర్మం, సమన్యాయం, సామాజికన్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక సంస్థలలో, విద్య, ఉద్యోగాలలో కూడా 34 రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికగా అమలు చేయాలి. స్థానిక సంస్థల బి.సి. రిజర్వేషన్లలో ఎ,బి,సి వర్గీకరణ ప్రవేశపెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం వారికి బి.సి.లపట్ల, కాపులపట్ల, పేద ఓ.సి.లపట్ల నిజంగా చిత్తశుద్ధి వుంటే సత్వరమే గౌరవ శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారమార్గాలు చూపించి శాశ్వతంగా తెరదించాలన్నారు.

# డ్రగ్స్‌రహిత సమాజం కోసం వచ్చే నెల పాదయాత్ర

**కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, అక్టోబరు 6 ప్రభాతవార్త:** నేడు రాష్ట్రంలో యువత, పిల్లలు గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారని, డ్రగ్స్ రహిత సమాజం కోసం మహిళలు ముందుకు రావాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళ వారం అంబర్‌పేటలో జరిగిన మహిళా చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. పంజాబ్ రాష్ట్రం లాంటి పరిస్థితి తెలంగాణకు రాకుండా ప్రతి మహిళా అప్రమత్తంగా ఉంటూ ఇంట్లోని పిల్లలపై నిఘా పెట్టాలని పిలుపు నిచ్చారు. 2029 నాటికి భారతదేశాన్ని డ్రగ్స్ రహిత దేశంగా (నషా ముక్త భారత్) మార్చాలని ప్రధాని మోదీ సంకల్పిం చారని, ఇందులో భాగంగా నవంబర్‌లో రాజకీ యాలకు అతీతంగా హైదరాబాద్‌లో ప్రమాదకర డ్రగ్స్‌పై అవగాహన కల్పించేందుకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో తెలంగాణ ఆడబిడ్డలందరూ భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో మహిళలు అన్ని రంగాల్లోనూ అద్భుతమైన రాణిస్తున్నారని కిషన్ రెడ్డి తెలిపారు.గిరిజన మహిళ ద్రౌపది ముర్ము దేశ రాష్ట్రపతిగా, తెలంగాణ కోడలు నిర్మలా సీతా రామన్ కేంద్ర ఆర్థిక మంత్రిగా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. విమానాలు, యుద్ధ విమానాలు నడపడంతోపాటు సైనిక రంగం లోనూ, పెద్ద కంపెనీలకు నేతృత్వం వహించడం లోనూ మన మహిళలే ముందంజలో ఉన్నార న్నారు. ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పత కాల్లో అత్యధికంగా మహి ళలే సాధించి దేశ పతాకాన్ని రెపరెపలాడిం చారని అభినందించారు.

**బ్యాంకుల ద్వారా రూ.20 లక్షల వరకు రుణాలు**

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా మహిళా పొదుపు సంఘా లకు రూ.20 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తూ తగిన ప్రోత్సా హం అందిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.కొన్ని బ్యాం కులు మహిళా పొదుపు సంఘాలకు తక్కువ మొత్తంలో రుణాలు ఇస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, త్వరలో బ్యాంకు ఉన్నతాధికా రులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలి పారు.



మహిళా చైతన్య సదస్సులో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో బిజెపి నేతలు డా.గౌతంరావు, కృష్ణాయాదవ్, లంకల దీపక్‌రెడ్డి, డా.ఓ.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**17న అంబర్‌పేటలో బతుకమ్మ పండుగ**

ఈ యేడాది కూడా అంబర్‌పేట మున్సిపల్ మైదా నంలో ఈనెల 17న సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ వేడుకలను నిర్వహించ నున్నట్లు తెలిపారు.ఈ వేడుకల్లో గవర్నర్ దంపతులను ఆహ్వానిస్తామని చెప్పారు. బతుకమ్మ వేడుకల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా రచనలు, పాట,ఆటలు వినిపించాలని కోరారు.అంబర్ పేట ప్రాంత ప్రజలంతా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# 9న మొగలిచెర్ల దత్తమందిరంలో బృందావనార్చనసేవ

**● 10న పల్లకీసేవ**



**తిరుపతిక్రందుకూరు,అక్టోబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** లింగసముద్రం మండలం మొగలిచెర్ల దత్తాత్రేయమందిరంలో ఈనెల 9వతేదీ శుక్రవారం ఉదయం ,10న శనివారం విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ తెలిపారు. 9నఉదయం 9.30 గంటల నుండి బృందావనార్చన సేవ,10న శనివారం సాయంత్రం 6:30 గంటల నుండి విశేష పల్లకీసేవ జరుగుతుందన్నారు.11న ఆదివారం ఉదయం 5.15 గంటలకు విశేష ప్రభాత సేవ నిర్వహిస్తున్నారు.11వతేదీ ఉదయం 8.30 గంటల నుండి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమవుతాయి.భవాని దీక్ష మాలాధారణ ఉంటుంది. ప్రత్యక్షంగా రాలేని భక్తులు కుటుంబంతో కలిసి దేవీ అర్చన ,దేవి ప్రసాద వితరణతో పరోక్షంగా దేవి నవరాత్రులలో భాగస్వాములు కావాలనుకుంటే వివరాలకు పవనివిష్ణు కౌశిక,దత్తాత్రేయ స్వామి మందిరం,మొగిలిచెర్ల గ్రామం 9182882632 నంబర్‌కు సంప్రదించాలి.



స్వశక్తితో ఎదగడానికి మహిళా లోకం అడుగులు వేస్తున్న తరుణంలో నగరానికి కాస్త దూరంగా పల్లెటూరిలో ఓ గృహిణి తన భర్త స్థాపించిన పరిశ్రమలో తానూ ఎదగాలని సంకల్పించింది. మారుతున్న పరిస్థితుల్లో మహిళలు సైతం ఇప్పుడు అన్నిటా తామేనంటున్నారు. అదే ఉత్సాహంతో అద్భుతాలు సాధిస్తున్నారు.

# ఇథనాల్‌తో 'ఇంతి'ంతై..

ప్రతీదీ నిశితంగా పరిశీలించడం, తెలుసుకోవడం, అమలులో పెట్టడం అనుభవపూర్వకంగా సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగడమనే లక్షణం వారికి వెన్నతో పెట్టిందే అందుకే అన్ని రంగాల్లోనూ మహిళలు పురోగతి సాధిస్తున్నారు. ఒక పరిశ్రమ నడపాలంటే, సక్సెస్ సాధించలంటే అందులో మెళకువలు తెలుసుకోవాలి. అహరహం శ్రమించే సంకల్పముంటే అతివలు సాధించలేనిదంటూ ఉండదు. తాండూరు నియోజకవర్గంలోని యాలాల మండలం జక్కేపల్లి గ్రామంలో నెలకొల్పిన ర్యాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్ సరళారెడ్డి మేనేజింగ్ డైరక్టర్ ఈ కోవకు చెందిన వారే. తొలిరోజుల్లో ఎక్స్ట్రా న్యూట్రల్ ఆల్కహాల్ (ఈఎన్ఏ) ఉత్పత్తులు చేపట్టేవారు. ఈ ముడిసరకును ఆల్కహాల్ తయారీకి, హోమియో మందుల తయారీకి ఉపయోగిస్తుంటారు. మొక్కజొన్న, బియ్యపు నూకల ద్వారా ఈఎన్ఏ ఉత్పత్తి చేస్తారు. సరళారెడ్డి వినూత్న ఆలోచనలతో ఇప్పుడు ఇథనాల్ తయారీలో ముందడుగు వేసారు. ఒకపుడు 90 కిలోలీటర్ల ఈఎన్ఏ ఉత్పత్తులకే పరిమితమైన ఆర్బీవోఎల్ ప్రస్తుతం 200 కిలోలీటర్ల ఉత్పత్తులు చేపడుతుండటం గమనార్హం. మేనేజింగ్ డైరెక్టర్‌గా సరళారెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో ఇథనాల్ ఉత్పత్తుల వైపు ఆలోచనల అడుగులు పడ్డాయి. ఈ సంస్థలో తయారు చేసే ముడిసరకు నుండి ఇథనాల్ ఉత్పత్తులు కూడా చేపట్టవచ్చు. 2024 నుంచి ఇథనాల్ ఉత్పత్తులు కూడా మొదలైనాయి. దక్షిణ భారతదేశంలోని ఆయిల్ తయారీ కంపెనీలు ఇథనాల్ కొనుగోలు చేస్తున్నాయి. ఈఎన్ఏను ఆల్కహాల్ కంపెనీలకు వెళ్తాయి ఎంతో చాతుర్యం ఉంటే తప్ప ఇలాంటి సంస్థలు విజయ పథంలో సాగవు. కొత్త కొత్త ఆవిష్కరణల కోసం భర్త, కుమారుడు సహాయం తీసుకుంటున్నారు సామాజిక బాధ్యతగా పాతిక మంది మహిళలకు జీవనోపాధి కల్పిస్తున్నారు. ఇలాంటి మహిళా పారిశ్రామికవేత్తల స్ఫూర్తితో మరికొన్నిటిని ఆహ్వానిద్దాం.

**- శెట్టి రవిశంకర్**

# కిచెన్‌లో మ్యాజిక్ క్లాత్ !



కిచెన్ అనగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది జిడ్డు పట్టిన స్టవ్, మరకలైన కౌంటర్టాప్, నీటి చుక్కలతో మెరిసే గిన్నెలు. వీటిని శుభ్రం చేయడానికి ఎన్నో రకాల క్లాత్‌లు వాడుతుంటాయి వాటిల్లో మైక్రోఫైబర్ క్లాత్ ఉందా? ఎందుకంటే ఇది మీ వంటింటి పనులను సులువుగా పూర్తి చేస్తుంది. అదెలాగంటారా? మైక్రోఫైబర్ క్లాత్... సాధారణ కాటన్ వస్త్రం కాదు. పాలిస్టర్, నైలాన్ దారాలతో అత్యంత సూక్ష్మంగా తయారవుతుంది. దీని ప్రత్యేకత నిల్వ, ఉంచని ప్రతి నార ఒక చిన్న కొక్కెంలా పనిచేసి దుమ్ము, జిడ్డు, సూక్ష్మ క్రిములను గట్టిగా పట్టుకుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఏకకాలంలో డస్ట్ క్లీనర్, అబ్సార్బెంట్స్, స్క్రబ్బర్లా పనిచేస్తుంది. వంట అయిపోయిన వెంటనే స్టవ్, చిమ్నీ.. వంటి వాటిని తుడవడానికి దీన్ని వాడొచ్చు. కొద్దిగా గోరువెచ్చని నీళ్ల లేదా డిష్వాష్ లిక్విడ్ స్ప్రే చేసే మైక్రోఫైబర్ క్లాత్తో తుడిస్తే జిడ్డు వదిలి కొత్తవాటిలా మెరిసిపోతాయి. అంతేనా, గ్రానైట్, మార్బుల్, సింక్ వంటివాటిపై నీటి మరకలు లేకుండా చేయొచ్చు. గాజు గ్లాసులు డిన్నర్ సెట్, స్టీల్ బాక్సులు కడిగిన కడిగిన తర్వాత సాధారణ క్లాత్‌లతో తుడిస్తే నూలు పోగులు అతుక్కుంటాయి. కానీ మైక్రోఫైబర్ క్లాత్తో తుడిస్తే ఆ సమస్య ఉండదు. అలానే, మైక్రోవేవ్ అవెన్, ఫ్రిజ్, మిక్సీ జార్లపై ఉండే దుమ్ము, వేలిముద్రలను తొలగించడానికి ఇది అద్భుతంగా పనిచేస్తుంది. ఇవి వాటి బరువు కంటే రెట్టింపు నీటిని ఇట్టే పీల్చుకుంటాయి. తడిపినా, పిండినా ఇట్టే ఆరిపోతాయి. కేవలం నీటితోనే 99 శాతం చూపును తొలగించగలవు. ప్రత్యేకంగా ఖరీదైన కెమికల్ క్లీనర్లు వాడాల్సిన అసరం ఉండదు. పైగా ఒక్కసారి కొనుగోలు చేస్తే ఇవి చాలా కాలం మన్నుతాయి. వందలాది సార్లు ఉతికినా వీటి నాణ్యత తగ్గదు. అయితే, మైక్రోఫైబర్ క్లాత్‌లను వాడిన తర్వాత వేడి నీటిలో కొద్దిగా డిటర్జెంట్ వేసి ఉతకాలి. అలాగే వీటిని ఉతికేటప్పుడు సాఫ్టనర్లు లేదా బ్లీచ్ అస్సలు వాడకూడదు. ▫

# మేకప్ లుక్ ..



**బయటికి వెళ్లిన ప్రతిసారీ మేకప్ వేసుకోవడం కుదరకపోవచ్చు.. అలాగే తరచూ మేకప్ వేసుకోవడం కొందరికి నచ్చక పోవచ్చు. అయినా మేకప్ వేసుకున్న లుక్స్ సొంతం చేసుకోవా లంటే..? ఈ చిట్కాలు పాటించాలని నిపుణులు.**

సన్ స్క్రీన్ రాయండి.. మేకప్ డీటాక్స్ లో భాగంగా ప్రాథమిక చర్మ సంరక్షణను పాటించాల్సి ఉంటుంది. ఈ కోసం బయటికి వెళ్లడానికి 15 నిమిషాల ముందు సన్ స్క్రీన్ లోషన్ ను రాసుకోవాలి. ఇది ఎండ నుంచి చర్మానికి రక్షణ కల్పించడమే కాదు.. చర్మానికి ఒక రకమైన మెరుపును తీసుకొస్తుంది.

**మాయిశ్చరైజర్ ఇలా!** డల్గా ఉన్న ముఖాన్ని ప్రకాశవంతంగా మార్చాలంటే టింటెడ్ మాయిశ్చ రైజర్‌ను వాడాలి. ఇక ప్రత్యేక సందర్భాల్లో మాత్రం హై కవరేజ్ ఫౌండేషన్‌ను వాడితే ఫలితం ఉంటుంది. అయితే ఏది ఎంచుకున్నా చర్మతత్వాన్ని బట్టి ప్రాధాన్యత ముఖ్యం.

**ఎక్స్ ఫోలియేషన్ చేస్తున్నారా?** చర్మంపై మృత కణాలు ఏర్పడడం, పొలుసులుగా ఊడిపోవడం వల్ల ముఖం డల్గా కనిపిస్తుంది. దీనికి ఎక్స్ లియేషన్ పద్ధతి మంచి పరిష్కారం అంటున్నారు నిపుణులు. ఈ మీ చర్మతత్వాన్ని బట్టి స్క్రబ్‌ను ఎంచుకొని లేదంటే ఇంట్లోనే సహజ స్క్రాబ్‌లను తయారుచేసుకొని స్క్రబింగ్ చేసుకోవాలి. దీనివల్ల చర్మం లోలోపలి నుంచి శుభ్రపడి సహజసిద్ధమైన మెరుపు వస్తుంది.

**టోనర్‌తో మేలు!** మేకప్ వేసుకోకపోయినా ఆ మెరుపును పొందాలంటే ముఖం శుభ్రం చేసుకున్నాక టోనర్ వాడాలి. దీనివల్ల ముఖంపై స్థాయులు బ్యాలన్స్ అయి చర్మం తాజాగా కనిస్తుంది.

**పెదాలకు లిప్‌బామ్!** పెదాలు మృదువుగా ఉన్నప్పుడే వాటి అందం ఇనుమడిస్తుంది. ఇందుకోసం రోజూ లిప్‌బామ్ రాసుకోవడం అప్పనిసరి. అలాగే ఆలివ్ ఆయిల్ వంటి నూనెలతో పెదాలపై మర్దన చేసుకోవడం వల్ల వాటికి సహజ మెరుపు వస్తుంది. ఫలితంగా లిప్‌స్టిక్ రాసుకునే అవసరమే ఉండదంటున్నారు. ▫

# ఈ క్లచర్ వాడొద్దు!



వినగానే 'కష్టం' అన్నమాట మన నోటి నుంచి వచ్చేస్తుంది కదూ! అది మనకి కేవలం క్లిప్పే కాదు మరి. కాస్త స్టైలిష్ గా కనిపించాలంటే ఫ్యాషన్ యాక్సెసరీలా మారుతుంది. అత్యవసర హెయిర్ యాక్సెసరీ. చిరగ్గా ఉన్నప్పుడు జుట్టు ముడిపెడితే కానీ సగం భారం తీరినట్లు అనిపించదు. అప్పుడు కావాల్సింది ఈ క్లాచర్ లేదంటే క్లా క్లిప్పే! అసలు అది లేకుండా చాలామంది ఆడవాళ్లకి రోజు గడవడం అంటే అతిశయోక్తి కాదు. అందుకేగా హ్యాండ్‌బ్యాగు, ఆఫీసు డెస్కు, డ్రెస్సింగ్ టేబుల్... ఎక్కడ చూడండీ దీని ఉనికి కనిపించడం ఖాయం. అలాంటిదాన్ని వాడొద్దంటే ఎంత కష్టం? అయినా వైద్యులు వీటితో ప్రమాదమనే అంటున్నారు. అమ్మాయిలు తరచూ దీన్ని వాడతారన్నది వాస్తవం. ప్రయాణాలకు మినహాయింపు కాదు. అయితే దుర్ఘటనలు ఎదురైనప్పుడు ఈ క్లచర్లే అమ్మాయిలకు ప్రమాదంగా మారుతున్నాయట. కారు, బస్సుల్లో వెళ్తున్నప్పుడు సడన్ బ్రేక్ వేసినా, యాక్సిడెంట్ జరిగినా లేదంటే బండ్లమీద నుంచే కాదు పొరపాటున వెనక్కి పడినా ఇవి తలకు తీవ్రగాయం చేస్తున్నాయట. విరిగి, తలలోకి వెళ్లిన సంఘటనలూ ఉన్నాయాట. ప్రతిపాదన చర్చ నెట్టింట నడిచింది. వైద్యులు తమ అభిప్రాయాలను పంచుకోవడమే కాదు... ఎంతోమంది దాని కారణంగా గాయపడిన సంఘటనలూ పంచుకున్నారు. కాబట్టే, దీని విషయంలో జాగ్రత్త అంటూ చెబుతున్నారంతా. అయినా అది లేకుండా కష్టమేనంటారా? అయితే ప్రయాణాల్లో పక్కన పెట్టండి. క్లచ్‌లకు బదులు బ్యాండ్ల సాయం తీసుకోండి, ఇంకా కాదంటే.. గాయాలు చేయని, విరగని సిలికాన్ క్లచర్‌నిస్తున్నాయి. వాటికి మారిన మేలే, ▫

# కాలిఫ్లవర్ కాడల పచ్చడి



కాలిఫ్లవర్ కాడలు : పెద కప్పు మిరపకాయలు అయిదారు మినుపపప్పు: టేబుల్ స్పూను శనగ పప్పు: టేబుల్ స్పూను మెంతులు: పావు టేబుల్ స్పూనుఆవాలు: అర టేబుల్ స్పూను చింతపండు రసం: రేగుపండు అంతకొత్తిమీర: నాలుగు రెబ్బలుఇంగువ: కొద్దిగాపోపుగింజలు: స్పూను నూనె: రెండు స్పూన్లు ఉప్పు: రుచికి సరిపడా

**తయారీ విధానం :** ముందుగా కాలిఫ్లవర్ కాడలను తీసుకుని బాగా కడగాలి. తర్వాత సన్నగా తరిగి బాణట్లో వేసి కాస్త వేగనిచ్చి పక్కకు పెట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి మీద బాణలి పెట్టి కొద్దిగా నూనె వేసి మినుపపప్పు, శనగపప్పు, మెంతులు, ఆవాలు వేసి వేగనివ్వాలి. తర్వాత సగానికి కోసిన పచ్చి మిరపకాయల్ని కూడా జోడించి నాలుగు నిమిషాలు ఉంచి దించేయాలి. కాస్త చల్లారనిచ్చి మిక్సీలో వేసి మెత్తగా అయ్యేలా పట్టాలి. ఇప్పుడు చల్లారిన కాలిఫ్లవర్ కాడలను మిక్సీలో వేసి ఓ రెండు తిప్పులు తిప్పాలి. అంటే మరీ ముద్ద కాకుండా కచ్చాపచ్చాగా కొబ్బరి పచ్చడిలా ఉండాలన్న మాట. తర్వాత బాణట్లో కాస్త నూనె వేసి పోపుగింజల్ని చిటపటలాడనిచ్చి, తర్వాత కొంచెం ఇంగువ చల్లి ఈ పచ్చడి ముద్దను అందులో వేయాలి. చివర్లో సన్నగా తరిగిన కొత్తిమీర రెమ్మల్ని కూడా కలుపుకొంటే.. కాలిఫ్లవర్ కాడల పచ్చడి రుచిచూడొచ్చు! ▫

# సేవతోనే అనుగ్రహం

జీవితంలో ఎవరైనా సరే తమ కోరికలను నెరవేర్చుకునే శక్తి తమకి లేనప్పుడు, వాటిని తీర్చవలసిన భారం భగవంతుడిపైనే వేస్తుంటారు. ఇక ఆపదల నుంచి బయటపడటమనేది భగవంతుడి చేతిలోనే ఉంటుంది గనుక ఆయననే ఆశ్రయిస్తుంటారు. భగవంతుడి మనసు గెలుచుకుంటే, ఆయన అనుగ్రహం త్వరగా లభిస్తుంది.అందుకోసం నిస్సహాయులకు సహకారాన్ని అందించాలి. మూగ జీవాలకు ఆహారాన్ని అందించాలి. అలాగే ఆలయంలో భగవంతుడికి సంబంధించిన సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి. భగవంతుడికి సంబంధించిన వస్తు సామగ్రిని శుభ్రం చేయడం .. ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయడం .. వాకిలి తుడిచి ముగ్గులు పెట్టడం .. ఆలయ ద్వారానికి తోరణాలు కట్టడం .. పూల దండాలు సమర్పించడం .. వాహన సేవల్లో సహకారిగా ఉంటూ భగవంతుడి సేవకుడిగా శ్రమిస్తూ ..ఆ శ్రమలో సంతోషాన్ని .. సంతృప్తిని పొందాలి. అలాంటి వారి కోరికలను ఆ భగవంతుడు తప్పక నెరవేరుస్తాడు.

# తెర

## 'రణబాలి' 8న ట్రైలర్ రిలీజ్



ఈ నెల 16న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతున్న "రణబాలి" సినిమావిజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "రణబాలి" సినిమా ట్రైలర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 8వ తేదీన ఈ చిత్ర ట్రైలర్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. 'రణబాలి' ట్రైలర్ పై మూవీ లవర్స్ లో హై ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నాయి. ఇప్పటికే టీజర్, సాంగ్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ రాగా...విజయ్, రశ్మిక చేస్తున్న ప్రమోషనల్ ఇంటర్వ్యూస్ వైరల్ గా మారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. ట్రైలర్ తో 'రణబాలి' సినిమాపై మరింత క్రేజ్ ఏర్పడనుంది.19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది.

## 'కామ్రేడ్ కళ్యాణ్' అందరికీ కనెక్ట్ అవుతుంది: మహిమా నంబియార్



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీ విష్ణు పీరియడ్ ఎలిమెంట్స్, హ్యూమర్, రొమాన్స్, ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌గా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. మహిమా నంబియార్ హీరోయిన్. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, టీజర్ పాటలతో సినిమాపై అంచనాలు పెరిగాయి.'కామ్రేడ్ కళ్యాణ్ అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

**ఇది మీ తొలి తెలుగు సినిమా కదా.. తెలుగులో నటించడం ఎలా అనిపించింది?** తెలుగులో నటించడం సరికొత్త అనుభవం. నేను ఏదైనా భాషని త్వరగా నేర్చుకోగలను. తెలుగు నాకు అర్థమవుతుంది. అలాగే ప్రతి లైన్‌కి దర్శకుడిని అడిగి అర్థం తెలుసుకుంటాను. అది నాకు మరింత హెల్ప్ అవుతుంది.

**శ్రీ విష్ణు తో నటించడం ఎలా అనిపించింది?** శ్రీవిష్ణు గారు చాలా స్పాంటేనిటీ ఉన్న యాక్టర్. షూటింగ్ స్పాట్‌లో చాలా ఇంప్రొవైజ్ చేస్తుంటారు. అది నాకు మరింత ఛాలెంజింగ్‌గా ఉంటుంది. శ్రీవిష్ణు గారి తెలుగుని అర్థం చేసుకోవ డం నాకు కష్టం (నవ్వుతూ). ఆయనకి ఒక సిగ్నేచర్ స్టైల్ ఉంది.

**ఈ అవకాశం ఎలా వచ్చింది?** డైరెక్టర్ నేను చేసిన తమిళ్, మలయాళ సినిమా చూసి కాల్ చేసి కథ చెప్పారు. చాలా నచ్చింది. శ్రీవిష్ణు గారి సిగ్నేచర్ స్టైల్‌లో ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఇంతకుముందు శ్రీవిష్ణు గారితో నేను'సామజవరగమన' సినిమా చేయాల్సింది. ఆ సినిమా కోసం ఫొటోషూట్ కూడా జరిగింది. కొన్ని కారణాల వల్ల అది కుదరలేదు.

**మీ పాత్ర గురించి?** ఇందులో నాది చాలా ఫన్ క్యారెక్టర్. నా పాత్ర పేరు సితార దేవి. పక్కింటి అమ్మాయిలాంటి పాత్ర. చాలా ఇన్నో సెంట్. ఒరిస్సా నుంచి వచ్చిన అమ్మాయిగా కనిపిస్తా. ఆ భాష కారణంగా హీరో, హీరోయిన్ మధ్య వచ్చే ఫన్ చాలా గమ్మత్తుగా ఉంటుంది.

**ఈ కథని ఎంచుకోవడానికి కారణం?** ఈ కథ చాలా ఫన్‌గా ఉంటుంది. అలాగే 90ల బ్యాక్‌డ్రాప్ కూడా చాలా ఫ్రెష్‌గా అనిపించింది.

**నిర్మాత గురించి?** చాలా ప్యాషన్ ఉన్న ప్రొడ్యూసర్. వెరీ నైస్ పర్సన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాని నిర్మించారు.

**తెలుగు ఆడియన్స్ గురించి?** తెలుగు ఆడియన్స్ సినిమాని గొప్పగా సెలబ్రేట్ చేసుకుంటారు. మందాడి సినిమా ప్రమోషన్స్‌కి వచ్చినప్పుడు చాలా గొప్ప రెసెప్షన్ ఇచ్చారు. మంచి కంటెంట్ ఉంటే భాషలకు అతీతంగా ఆదరిస్తారు.

**కొత్త ప్రాజెక్ట్స్ గురించి?** మలయాళం, తమిళ్‌లో చెరో సినిమా చేస్తున్నాను. తెలుగు కథలు వింటున్నాను.

## 'గరివిడి లక్ష్మి' ట్రైలర్ లాంచ్



ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో అడివి శేష్ మాట్లాడుతూ .. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుకలో చేసిన కళా ప్రదర్శన నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక్కడ ఆ పాటలు వింటుంటే నాకు నా బాల్యం గుర్తుకొచ్చింది. నేను వైజాగ్‌లోనే పెరిగాను. గరివిడి లక్ష్మి కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న కృతి ప్రసాద్‌కి, విశ్వకి ధన్యవాదాలు. డైరెక్టర్ చాలా నిజాయితీగా ఈ కథను చెప్పారుడైరెక్టర్ బాబీ మాట్లాడుతూ.. కృతి ప్రసాద్ ఈ సినిమాను చాలా ప్యాషన్‌తో తీశారు. ఇంత మంచి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న తనకు అభినందనలు. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. ఆనందిని 'బస్ స్టాప్' సినిమాకు హీరోయిన్‌గా పరిచయం చేశాను. దాని తర్వాత తమిళ్‌లో దాదాపు 40 సినిమాలు చేసింది. హరీష్ శంకర్ మాట్లాడుతూ.. ఈ సినిమాను విశ్వచాలా ప్యాషనేట్‌గా చేశారు. ఆయన స్టార్ హీరోలతో సినిమాలు తీస్తూ కూడా ఇలాంటి ఒక మంచి కథను ప్రపంచానికి చెప్పాలనుకోవడం నిజంగా హ్యాట్సాఫ్. నిర్మాత కృతి ప్రసాద్ మాట్లా డుతూ..'గరివిడి లక్ష్మి' మాకు చాలా స్పెషల్ ఫిల్మ్. ఇది మన రూట్ కల్చర్‌లో ఉన్న కథ. ఈ జర్నీని మనందరం కలిసి సెలబ్రేట్ చేసుకోవాలి. ఈ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉంది. హీరోయిన్ ఆనంది మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తు న్నాను. ఇది నాకు చాలా స్పెషల్ ఫిల్మ్. గరివిడి లక్ష్మి నాకు దేవుడిచ్చిన వరం. మా డైరెక్టర్ గౌరీకి థాంక్యూ. ఈ సినిమాకు ఏం కావాలో అన్నీ చాలా నిజాయితీగా తీసుకున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ.. మా అమ్మాయి అమెరికాలో పుట్టింది. అక్కడే పెరిగింది. 'పాడుతా తీయగా' అమెరికాలో చేసినప్పుడు లైన్ ప్రొడ్యూసర్‌గా చేసింది. తర్వాత యూకేలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదివింది. నాకు మా అమ్మాయి మెంటర్. మేము వరుసగా సినిమాలు చేస్తున్నాం. తను కూడా మాతో జాయిన్ అవుతుంది అనుకున్నాము. కాకపోతే తను మాత్రం తానే స్వయంగా సినిమాలు చేస్తానని చెప్పింది. యాక్టర్స్‌ను కూడా నేనే తెచ్చుకుంటాను అనిచెప్పింది. ఒక మూడు కథలను ఎంపిక చేసుకుంది. అందులో 'గరివిడి లక్ష్మి' ఒకటి.

## 'చీన్ టపాక్ డమ్ డమ్' ఫస్ట్ క్రాకర్ ఆవిష్కరించిన అడివి శేష్..



అల్లరి, సరదా, నవ్వులతో ప్రేక్షకులను అలరించేందుకు 'చీన్ టపాక్ డమ్ డమ్' సిద్ధమవు తోంది. త్వరలో ప్రేక్షకుల ముందు కు రానున్న ఈ ఎంటర్‌టైనర్‌కు సంబంధి చిన ఫస్ట్ క్రాకర్‌ను హిట్ మెషీన్ అడివి శేష్ ఆవిష్కరించారు. ఈ ఫస్ట్ క్రాకర్ సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచింది. గవిరెడ్డి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న ఈ చిత్రానికి వై.ఎన్.లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హిలేరియస్ సన్నివేశాలు, ఆసక్తికరమైన పల్లెటూరి నేపథ్యంతో ఈ సినిమా ఆద్యంతం వినోదాన్ని పంచే ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కు తోంది. ఆసక్తికరంగా రూపొందించిన మోషన్ పోస్టర్ జొన్నాడ గ్రామంలోని వింత ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది. ఇందులో గేదె, గ్రామ దేవత, బంగారం వంటి ఆసక్తికరమైన అంశాలతో పాటు మరెన్నో ఆసక్తిని రేకెత్తించే విషయాలు కనిపిస్తున్నాయి. వినూత్నమైన నేపథ్యం, ఆసక్తికరమైన విజువల్స్‌తో రూపొందిన ఈ మోషన్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఆద్యంతం వినోదాన్ని పంచుతూ, కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలతో ప్రేక్షకులను అలరించే సినిమా రానున్నట్లు మోషన్ పోస్టర్ చూస్తుంటే తెలుస్తోంది. గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా నటిస్తోన్న ఈ చిత్రంలో బ్రిగిడా సాగా కథానాయికగా నటిస్తున్నారు. షఫీ, దువ్వాడ మాధురి, గోపరాజు రమణ, సురభి ప్రభావతి, గోపరాజు విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఏ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేస్తున్నారు. పి.ఆర్. సంగీతం అందిస్తుండగా, సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'ఫస్ట్ క్రాకర్' జొన్నాడ గ్రామంలో సాగే అల్లరి, సరదాలతో నిండిన ప్రపంచాన్ని పరిచయం చేస్తూ, సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది.

## 'అనకాపల్లి' దసరా ధమాకాగా నిలుస్తుంది : లగడపాటి శ్రీధర్..



ఈ రోజు కూడా అన్ని చోట్లా హౌస్ ఫుల్స్ పడుతున్నాయి థాంక్యూ మీట్‌లో నటుడు, నిర్మాత, దర్శ కుడు త్రినాథ రావు నక్కిన.. ..'అనకాపల్లి' లాంటి మంచి చిత్రానికి సరైన సంఖ్యలో థియేటర్లు ఇవ్వక'పోవడం బాధగా ఉంది థాంక్యూ మీట్‌లో నటి ఇంద్రజ....లగడపాటి శ్రీధర్ మాట్లా డుతూ.. ..అనకాపల్లి సక్సెస్‌లో పాల్గొనడం ఆనం దంగా ఉంది. విక్రమ్ నా కొడుకు అవ్వడం, అతని మీద ఒక సినిమా తీయడానికి త్రినాథ్ రావు గారు, నాయుడు ముందుకు రావడం గొప్ప విషయం. ఇలాంటి చిన్న చిత్రాలకు మీడియానే ముందుండి సపోర్ట్ చేస్తుంది.'ఎవడిగోలవాడిద్దే సినిమాని ఫస్ట్ వీక్‌కే తీసేస్తామని అన్నారు. కానీ అదే థియేటర్లో చివరకు సిల్వర్ జూబ్లీ జరిగింది. అలానే 'అనకాపల్లి' కూడా గొప్ప విజయాన్ని సాధిస్తుంది. దసరా ధమాకాగా 'అనకాపల్లి' నిలుస్తుంది. ..కాంద్రేగుల నాయుడు మాట్లాడుతూ.. .త్రినాథరావు నక్కినమీదున్న నమ్మకంతోనే'అనకాపల్లి చేశాను. రెండు వందల థియేటర్లలో మా మూవీని రిలీజ్ చేశాం. మేం ఎంతో కష్టపడి ఈ సినిమాని చేశాం. ఇంత మంచి ఆదరణ లభిస్తున్న ఈ సినిమాకి కాకుండా ఇతర భాషల చిత్రాలకు థియేటర్లను ఇస్తున్నారు. ..విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ.. .. 'అనకాపల్లి' సినిమాకి మంచి రెస్పాన్స్ వస్తోంది. రివ్యూలన్నీ చదివాను. మా ప్లస్, మైనస్ పాయింట్స్ చెప్పిన అందరికీ థాంక్స్.

## 'డ్యూ డేట్' రెగ్యులర్ షూటింగ్ మొదలైంది!



లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్'వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలుగా ఆనంద్.కె. దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవల ఘనంగా పూజా కార్యక్రమాలు జరుపుకున్న సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హీరో, హీరోయిన్ ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తు న్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టు పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ, కథనాలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ రోజు నుంచి 15 రోజుల పాటు ఏకధాటిగా జరిగే షెడ్యూల్‌తో తొలి షెడ్యూల్ పూర్తవుతుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది అన్నారు.లోమేష్ పుడిపెద్ది, జయశ్రీ, ప్రణీత పట్నాయక్, విజ్ఞాని, కృష్ణ భగవాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: జవ్వాడి నాయుడు, మాటలు: హరీష్ మీనన్, ఎడిటర్: సత్య గిడుటూరి, డీఓపీ: చెంచు జింక, నిర్మాతలు పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను, దర్శకత్వం: ఆనంద్.కె.

7-10pg10.qxd:7-10pg10.qxd 1/1/02 6:11 AM Page 1



### రెండో యూత్ టెస్టు..

# ఆస్ట్రేలియాపై భారత్ పైచేయి

**అహ్మదాబాద్:** రెండవ యూత్ టెస్టు తొలి రోజున, ఎడమచేతి వాటం స్పిన్నర్ తన్మయ్ బలోడా ఆరు వికెట్లు పడగొట్టడంతో ఆస్ట్రేలియాపై భారత్ పైచేయి సాధించింది. బలోడా అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో భారత్, ఆస్ట్రేలియాను వారి తొలి ఇన్నింగ్స్‌లో 174 పరుగులకే ఆలౌట్ చేసింది. అయితే, ఆట చివర్లో ఆస్ట్రేలియా తిరిగి పుంజుకుని భారత ఓపెనర్లు ఇద్దరినీ అవుట్ చేసింది. దీంతో ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 38/2 స్కోరుతో, ఇంకా 136 పరుగుల వెనుకబడి ఉంది.



కుశాగ్ర ఓఝా 13 పరుగులతో, కెప్టెన్ యశ్‌బర్ధన్ చౌహాన్ ఏడు పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. టాస్ గెలిచిన భారత్ రెండో ఓవర్‌లో ప్రియాన్షు సింగ్ ఆస్ట్రేలియా కెప్టెన్ మాథ్యూ లఫ్‌ను డకౌట్ చేయగా, ఐదో ఓవర్‌లో మోహిత్ ఉల్వా బౌలింగ్‌లో హేడెన్ బార్చులోవిచ్ క్యాచ్ అవుట్ కావడంతో ఆస్ట్రేలియా 9/2కు పడిపోయింది. నీల్ పటేల్, ఎలీ బ్రెయిన్ ఇన్నింగ్స్‌ను పునరుద్ధరించే యత్నం చేసినా బలోడా రాకతో ఆట గమనం మారిపోయింది. అతను బ్రెయిన్‌ను లెగ్ బిఫోర్ వికెట్‌గా అవుట్ చేసి ఆ భాగస్వామ్యాన్ని విడగొట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లోనే పటేల్‌ను స్టంప్ అవుట్ చేశాడు. అయాన్ అక్రమ్ బ్లేక్ క్యాటిల్ బ్యాట్ అంచుకు తగిలేలా చేసి ఆస్ట్రేలియా కష్టాలను మరింత పెంచగా, ఆ తర్వాత బలోడా జెడ్ హోలిక్‌ను ఔట్ చేయడంతో, 21 ఓవర్లలోపే అతిథి జట్టు 6 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత చార్లీ హెండర్సన్, జాకబ్ పీట్జ్ పుంజుకుని, ఏడవ వికెట్‌కు 70 పరుగులు జోడించి ఆస్ట్రేలియా స్కోరును 150 దాటించారు. పీట్జ్‌ను 26 పరుగుల వద్ద బౌల్డ్ చేసి బలోడా ఈ భాగస్వామ్యాన్ని ముగించగా, కొద్దిసేపటికే అక్రమ్ హెండర్సన్‌ను 37 పరుగుల వద్ద ఔట్ చేశాడు. ఆ తర్వాత బలోడా ఆస్ట్రేలియా చివరి వికెట్లను పడగొట్టాడు. భారత్ లక్ష్య రైచందాని, 22 బంతుల్లో కేవలం ఒక పరుగు మాత్రమే చేసి థామస్ వాసియో బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. ఆ తర్వాత లెగ్ స్పిన్నర్ స్పెన్సర్ గ్రీన్, సాగర్ విర్క్‌ను 16 పరుగుల వద్ద ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చడంతో, భారత్ 38/2 స్కోరుకు చేరుకుంది. ఓఝా మరియు చౌహాన్ మిగిలిన ఓవర్లను ఎటువంటి నష్టం లేకుండా ఎదుర్కొన్నారు.

# చైనా స్మాష్‌లో సైమన్‌ని ఓడించిన మానవ్

### వరల్డ్ ర్యాంకర్‌పై మనిక సంచలన విజయం

**బీజింగ్:** చైనా స్మాష్ 2026లో సైమన్ గౌజీని భారత్‌కు ప్యాడ్లర్ మానవ్ థక్కర్ ఓడించగా, ప్రపంచ 27వ ర్యాంకర్‌పై మణిక సంచలన విజయం సాధించింది. బీజింగ్‌లో జరుగుతున్న చైనా స్మాష్ టోర్నమెంట్‌లో భారత మానవ్ థక్కర్ రెండు గేమ్‌ల నుంచి వెనుకబడినప్పటికీ పుంజుకుని, ఫ్రెంచ్ వెటరన్ సైమన్ గౌజీని 3-2 తేడాతో ఓడించి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 50వ స్థానంలో ఉన్న మానవ్, మొదటి రెండు గేమ్‌లను 9-11, 9-11 తేడాతో కోల్పోయాడు. కానీ, ప్రపంచ 28వ ర్యాంకర్‌పై అద్భుతంగా పుంజుకుని, తర్వాతి మూడు గేమ్‌లను 11-7, 11-5, 12-10 తేడాతో కైవసం చేసుకున్నాడు. అలాగు మహిళల సింగిల్స్ పోటీలో, ఇటీవల ముగిసిన ఆసియా గేమ్స్ 2026కు అర్హత సాధించడంలో విఫలమైన మనికా బాత్రా, బ్రెజిల్‌కు చెందిన ప్రపంచ 27వ ర్యాంకర్ బ్రూనా తకాహాషిపై 3-2 (8-11, 11-8, 11-9, 5-11, 12-10) తేడాతో సంచలన విజయం సాధించింది. వైల్డ్‌కార్డ్‌గా మెయిన్ డ్రాలోకి ప్రవేశించిన ప్రపంచ 50వ ర్యాంకర్ అయిన ఈ భారత క్రీడాకారిణి, తదుపరి రౌండ్‌లో చైనా టాప్ సీడ్, ప్రపంచ 2వ ర్యాంకర్ వాంగ్ మాన్యుతో తలపడనుంది.





# టీమిండియా కెప్టెన్సీకి హర్మన్ గుడ్‌బై

**న్యూఢిల్లీ:** భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సంచలన నిర్ణయం తీసుకుంది. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయం భారత క్రికెట్‌లో ఒక సువర్ణాధ్యాయానికి తెరదించినట్లయింది. ఆమె నాయకత్వంలో భారత్ వన్డే ప్రపంచకప్, ఆసియా గేమ్స్ స్వర్ణం వంటి చారిత్రాత్మక విజయాలను సాధించింది. ఈ మార్పుతో జట్టుకు చాలా కాలంగా వైస్ కెప్టెన్‌గా ఉన్న స్మృతి మంధాన కొత్త సారథిగా బాధ్యతలు చేపట్టే అవకాశం కనిపిస్తోంది. గువాహటిలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగిన ముఖ్యమైన రివ్యూ మీటింగ్ తర్వాత ఈ నిర్ణయం వెలువడింది. ఈ భేటీలో హర్మన్‌ప్రీత్‌తో పాటు స్మృతి మంధాన, ప్రధాన కోచ్ అమూల్ మజుందార్ పాల్గొన్నారు. గత కొన్ని నెలలుగా జట్టు ప్రదర్శన, రాబోయే ప్రపంచ టోర్నీల వ్యూహాలపై సుదీర్ఘంగా ఈ సమావేశంలో చర్చించారు. ఈ భేటీలోనే కెప్టెన్సీ మార్పుపై స్పష్టత వచ్చినట్లు సమాచారం అందుతోంది. ఈ నిర్ణయంపై హర్మన్‌ప్రీత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరిత పోస్ట్ షేర్ చేశారు. "భారత మహిళా క్రికెట్ జట్టు కోసం నా రక్తం, చెమట, సమయం ధారపోశాను. అనేక సందర్భాల్లో జట్టు ప్రయోజనాల కోసం నా సొంత ఆటను, వ్యక్తిగత ఆశయాలను కూడా పక్కనపెట్టాను" అంటూ ఎమోషనల్ అయ్యారు. అయితే కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పటికీ ప్లేయర్‌గా జట్టుకు సేవలు అందిస్తూ ఉంటానని స్పష్టంచేసింది. కాగా గత కొంతకాలంగా ఆమె కెప్టెన్సీ విధానాలు, బ్యాటింగ్ ఫామ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందిస్తూ జట్టు మేలు కోసమే ప్రతీ నిర్ణయం తీసుకున్నానని, ఎలాంటి విమర్శలు వచ్చినా తనపై ఉంచిన బాధ్యతను గర్వంగా మోశానని తెలిపింది.

### వైస్ కెప్టెన్ స్మృతికి ఛాన్స్





## ఐసిసి ర్యాంకింగ్స్‌లో స్మృతి నం. 1

**న్యూఢిల్లీ:** ఐసిసి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత క్రీడాకారిణి స్మృతి మంధాన అగ్రస్థానంలో కొనసాగుతోంది. 790 పాయింట్లతో ఈ జాబితాలో అగ్రస్థా నంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ (782), ఆస్ట్రేలియా క్రీడాకారిణి బెత్ మూనీ (744) ఉన్నారు. అలాగే జింబాబ్వేతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్, తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ స్థానాన్ని సాధించింది. 28 ఏళ్ల ఈ క్రీడాకారిణి తన కెరీర్‌లో అత్యుత్తమమైన 731 రేటింగ్ పాయింట్లతో వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరుకుంది. తాజా ర్యాంకింగ్‌లలో ఇతర వెస్టిండీస్ క్రీడాకారిణులు కూడా గణనీయమైన పురోగతి సాధించారు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్‌లలో షెమైన్ క్యాంప్‌బెల్ 15 స్థానాలు ఎగబాకి 74వ స్థానానికి చేరుకోగా, బౌలర్లలో అఫీ ఫ్లెచర్ రెండు స్థానాలు పైకి ఎగబాకి 17వ స్థానానికి చేరుకుంది. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్‌లలో ఆలియా అల్లెన్ ఎనిమిది స్థానాలు ఎగబాకి 49వ స్థానానికి చేరుకోగా, అష్మిని మునిసర్ 11 స్థానాలు ఎగబాకి 70వ స్థానానికి చేరుకుంది.

## ఎఎఫ్‌సి క్వాలిఫయర్స్‌లో రికార్డు సృష్టించిన భారత్ మహిళల జట్టు

### 14-0తో చిత్తుగా ఓడిన ఇరాక్

**సెలయాంగ్:** భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు ఇరాక్‌ను 14-0 తేడాతో చిత్తుగా ఓడించి, తమ ఏఎఫ్‌సీ అండర్17 మహిళల ఆసియా కప్ 2027 క్వాలిఫైయింగ్ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. భారత్ ఆరంభం నుంచే నిరంతర పరుగు, కట్టుదిట్టమైన మార్కింగ్, చురుకైన వన్‌టచ్ ఫుట్‌బాల్‌తో ఆధిపత్యం చెలాయించింది. రెడిమా దేవి, చింగ్‌ఖమాయుమ్, బాస్కే, సిల్కీ, ఆల్వా ఫార్వర్డ్‌లకు త్రూ బాల్స్ అందిస్తూ అవకాశాలను సృష్టించారు. అనుష్క, నీరా ఈ అవకాశాలను అద్భుతమైన ఫినిషింగ్‌తో సద్వినియోగం చేసుకున్నారు. అనుష్క తన 4వ గోల్ చేయగా, ప్రీతిక స్కోరును 9-0కి చేర్చింది. ప్రతికూల వాతావరణం కారణంగా 64 నిమిషాల తర్వాత ఆటకు అంతరాయం కలగగా, 30 నిమిషాల విరామం తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది. రితు బడైక్ కార్నర్ నుండి బస్నెట్ హెడర్ ద్వారా గోల్ చేయగా, అనుష్క తన 5 గోల్స్ ప్రదర్శనను పూర్తి చేసింది. ఆ తర్వాత ప్రీతిక బస్నెట్ హెడర్ ద్వారా తన రెండవ గోల్ చేసి కొత్త రికార్డును నెలకొల్పింది. ఆట చివరిలో అల్వా హెడర్ ద్వారా చేసిన గోల్‌తో స్కోరు 14-0కి చేరింది.

ఆట



### ఆర్బీఐ పాలసీపై ఆశలు..

# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు



**ముంబయి, అక్టోబరు 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీ లాభాలతో ముగిశాయి. ఫార్మా, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో కొనుగోళ్లతో బెంచ్‌మార్క్ సూచీలు బలపడ్డాయి. మరోవైపు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన సమీక్ష నిర్ణయం కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూశారు. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 685.34 పాయింట్లు లాభపడి 73,067.81 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 220.35 పాయింట్లు పెరిగి 22,776.10 వద్ద ముగిసింది. నిఫ్టీ సాంకేతిక పరిస్థితిపై మార్కెట్ నిపుణులు మాట్లాడుతూ 22,800 స్థాయిని స్థిరంగా అధిగమిస్తే 23,000 మార్క్ వైపు సూచీ పయనించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దిగువ స్థాయిలో నిఫ్టీకి 22,600 వద్ద తక్షణ మద్దతు ఉండగా, ఆ తర్వాత 22,500 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని నిపుణులు తెలిపారు. మంగళవారం మొత్తం మార్కెట్ సెంటిమెంట్ సానుకూలంగానే కొనసాగింది. హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో ప్రధాన సూచీలు తమ లాభాలను మరింత విస్తరించాయి. ఇన్వెస్టర్లు ప్రధానంగా ఆర్బీఐ ద్రవ్య విధాన ప్రకటనపై దృష్టి సారించారు. వడ్డీ రేట్లు, మార్కెట్‌లో లిక్విడిటీ పరిస్థితులు, దేశ ఆర్థిక వ్యవస్థపై కేంద్ర బ్యాంక్ అంచనాలు వంటి అంశాలపై ఆర్బీఐ నిర్ణయం కోసం మార్కెట్ వర్గాలు ఎదురుచూస్తున్నాయి. నిఫ్టీ సూచీలో ట్రెంట్, బీఎస్ఈ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఈ స్టాక్స్‌లో కొనుగోళ్లు మార్కెట్ మొత్తం లాభాలకు గణనీయంగా దోహదపడ్డాయి. స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీల్లోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.08 శాతం పెరగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 1.56 శాతం లాభపడి మెరుగైన పనితీరు కనబరిచింది. సెక్టార్ల వారీగా చూస్తే ఫార్మా, కెమికల్ షేర్లు మార్కెట్ ర్యాలీ తీసాయి. నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన సెక్టోరల్ ఇండెక్స్‌గా నిలిచింది. ఆ తర్వాత నిఫ్టీ కెమికల్ ఇండెక్స్ ఉంది. ఐటీ షేర్లలో కొంత లాభాల స్వీకరణ కనిపించింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ 0.70 శాతం తగ్గి 5.276 శాతానికి చేరుకుంది. కమోడిటీస్ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధరలు తగ్గాయి. 2026 డిసెంబర్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 1.78 డాలర్లు తగ్గి 98.54 డాలర్లకు చేరింది. భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ సెక్యూరిటీ రాబడి 0.17 శాతం తగ్గి 7.201 శాతానికి చేరుకుంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 7.213 శాతంగా ఉంది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి స్వల్పంగా బలహీనపడింది. పాక్షికంగా కన్వర్టిబుల్ రూపాయి 96.4400 వద్ద కొనసాగింది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇది 96.3550 వద్ద ముగిసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో 2026 డిసెంబర్ 4 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 0.26 శాతం పెరిగి రూ.1,49,711కు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా, వివిధ కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ విలువను కొలిచే డాలర్ ఇండెక్స్ తగ్గి 102 స్థాయికి చేరింది.



వాణిజ్యం

# స్వర బేబీ ప్రొడక్ట్స్‌కు రూ.1,000కోట్ల ఐపిఒకు సెబీ అనుమతి

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత్‌లో డిస్పోజబుల్ హైజీన్ ఉత్పత్తుల తయారీలో ప్రముఖ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరర్‌గా ఉన్నస్వరా బేబీ ప్రొడక్ట్సు కు భారీ ఐపీఓకు మార్గం సుగమమైంది. కంపెనీ రూ.1,000 కోట్ల ఐపిఒకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి పొందింది. ఈ పబ్లిక్ ఇష్యూలో రూ.500 కోట్ల వరకు విలువైన తాజా షేర్ల జారీ, మరో రూ.500 కోట్ల వరకు విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ఒఎఫ్ఎస్‌లో భాగంగా ఫస్ట్‌క్రై మాతృ సంస్థ బ్రెయిన్‌బీస్ సొల్యూషన్స్ రూ.300 కోట్ల వరకు విలువైన షేర్లను విక్రయించనుంది. అనద్య బోన్ మెర్చాంి ఎల్ఎల్‌పీ రూ.200 కోట్ల వరకు విలువైన షేర్లను ఆఫర్ చేయనుంది. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కంపెనీ ప్రధానంగా వ్యాపార విస్తరణ, రుణాల తగ్గింపు, అలాగే సాధ్యమైన కొనుగోళ్ల కోసం వినియోగించనుంది. తాజా షేర్ల జారీ ద్వారా వచ్చే నిధుల్లో సుమారు రూ.198.2 కోట్లు మధ్యప్రదేశ్‌లో కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి కేటాయించనున్నారు. కంపెనీ తీసుకున్న కొన్ని రుణాలను తిరిగి చెల్లించడానికి లేదా ముందస్తుగా చెల్లించడానికి రూ.100 కోట్ల వరకు వినియోగించనుంది. సహాయక సంస్థలైన సోలిస్ హైజీన్, స్వారా హైజీన్, కేఏఈహెచ్‌పీఎల్‌లో మొత్తం రూ.27.5 కోట్ల పెట్టుబడి పెట్టాలని కంపెనీ ప్రతిపాదించింది. ఈ నిధులను ఆయా సంస్థల బకాయి రుణాలను తగ్గించేందుకు ఉపయోగించనున్నారు. అదనంగా, భవిష్యత్తులో గుర్తించని కొనుగోళ్లకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు కూడా ఐపీఓ నిధులను వినియోగించే అవకాశం ఉంది. ప్రీఐపీఓ ప్లేస్‌మెంట్ ద్వారా రూ.100 కోట్ల వరకు సమీకరించే అవకాశాన్ని కూడా స్వరా బేబీ పరిశీలిస్తోంది.

# టెలికాం రంగంలో దూసుకెళ్తున్న భారత్

### 1.09 బిలియన్ల్ల దాటిన ఇంటర్నెట్ వినియోగదారులు..

### 25 శాతం పెరిగిన వైర్‌లెస్ డేటా వినియోగం



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత్‌లో టెలికాం రంగం 2025 -26 ఆర్థిక సంవత్సరంలో భారీ వృద్ధిని నమోదు చేసింది. ఇం టర్నెట్ చందాదారుల సంఖ్య 1.09 బిలియన్లను దాటగా, వైర్ లెస్ డేటా వినియోగం దాదాపు 25 శాతం పెరిగింది. అదే సమయంలో వినియోగదారుడి నుంచి టెలికాం సంస్థలకు వచ్చే సగటు ఆదాయం కూడా పెరిగింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన వార్షిక పనితీరు నివేదిక ప్రకారం 1.09 బిలియన్లకు ఇంటర్నెట్ చందాదారులు చేరారు. 2026 మార్చి 31నాటికి దేశంలో మొత్తం ఇంటర్నెట్ చందాదారుల సంఖ్య 1.09 బిలియన్లకు చేరు కుంది. 2025 మార్చి నాటికి ఉన్న 969.1 మిలియ న్లతో పోలిస్తే ఇది 12.76 శాతం వార్షిక వృద్ధి. ఇందులో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులే అధికంగా ఉన్నారు. వారి సంఖ్య 1.066 బిలియన్లకు చేరుకుంది. ఏడాది కాలం లో బ్రాడ్‌బ్యాండ్ చందాలు 12.9శాతం పెరిగాయి. న్యారో బ్యాండ్ చందాదారుల సంఖ్య కూడా 26.91 మిలియన్లకు పెరిగింది. టెలికాం సేవలపై వినియో గదారుల వ్య యం కూడా పెరిగింది. వైర్‌లెస్ సేవల సగటు ఆదాయం ప్రతి వినియోగదారుడికి నెల కు రూ.180.73కుచేరింది. వైర్‌లెస్ డేటా చందా దారుల సంఖ్య 1.027బిలియన్లకు చేరింది. వైర్‌లెస్ డేటాసేవల ద్వారా టెలికాం సంస్థలు ఆర్జించిన ఆదా యం 11.53 శాతం పెరిగి రూ.2.39 లక్షల కోట్లకు చేరుకుంది.

# భారత్ రియాల్టీలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడుల జోరు



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** భారత రియల్ ఎస్టేట్ రంగంలో ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు భారీగా పుంజుకున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్యకాలంలో తొలి అర్ధభాగంలో, పీఈ పెట్టుబడులు ఏడాది ప్రాతిపదికన 23 శాతం పెరిగి 2.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2023 తొలి అర్ధభాగం తర్వాత ఇదే అత్యధిక స్థాయి అని ఒక నివేదిక వెల్లడించింది. అనరాక్ క్యాపిటల్ డేటా ప్రకారం ఈ ఏడాది తొలి అర్ధభాగంలో నమోదైన 2.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 2026 లో మొత్తం ఏడాది వచ్చిన 4.3 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్లో సుమారు 63 శాతానికి సమానం. ఇదే సమయంలో డీల్స్ సంఖ్య కూడా పెరిగింది. మొత్తం 30 లావాదేవీలు జరగగా, గత ఏడాది ఇదే కాలంలో 22 డీల్స్ నమోదయ్యాయి. సగటు డీల్ పరిమాణం 18 శాతం పెరిగి 91 మిలియన్ డాలర్లకు చేరుకుంది. ద్వితీయార్థంలో గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన స్థాయిలోనే పెట్టుబడులు కొనసాగితే, మొత్తం లో పీఈ పెట్టుబడులు దాదాపు 4.8 బిలియన్ డాల ర్లకు చేరుకునే అవకాశం ఉంది. అన రాక్ క్యాపిటల్ సీఈఓ శోభిత్ అగర్వాల్ మాట్లాడుతూ ద్వితీయా ర్థంలోనూ పెట్టుబడుల జోరు కొనసాగుతుందని అంచనా వేశారు. దేశీయ పెట్టుబడిదారులు తొలి అర్ధభాగంలో 24 డీల్స్ ద్వారా సుమారు 1.3 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టారు. గత ఏడాది ఇదే కాలంలో పెట్టుబడి పెట్టిన 220 మిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది దాదాపు ఆరు రెట్లు అధికం. మొత్తం పీఈ పెట్టుబడుల్లో దేశీయ పెట్టుబడిదారుల వాటా 48 శాతంగా ఉంది. ఇక విదేశీ పెట్టుబడిదారులు ఆరు డీల్స్ ద్వారా సుమారు 1.4 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టారు.

# ఐపిఒ ధర కంటే దిగువకు ఎన్‌ఎస్ఇ షేరు..

### గరిష్ట స్థాయి నుంచి పతనం

### రూ.41,000 కోట్ల మార్కెట్ విలువ ఆవిరి

**ముంబై, అక్టోబరు 6 :** స్టాక్ మార్కెట్‌లో లిస్టయిన రెండు వారాలు కూడా పూర్తికాకముందే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ షేరు ఒత్తిడికి లోనైంది. షేరు ధర ఐపీఓ ధర కంటే దిగువకు పడిపోవడంతో లిస్టింగ్ రోజు వచ్చిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. దీంతో ఎన్ఎస్ఇ మార్కెట్ విలువ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు రూ.41 వేల కోట్లు తగ్గింది. సెప్టెంబర్ 24న ఎన్ఎస్ఇ షేర్లు బీఎస్ఈలో ఒక్కో షేరుకు రూ.1,800 ధర వద్ద లిస్టయ్యాయి. ఇది ఐపీఓ ధర రూ.1,785తో పోలిస్తే 1 శాతానికంటే తక్కువ ప్రీమియం. లిస్టింగ్ అనంతరం తొలుత షేరులో కొనుగోళ్ల జోరు కనిపించింది. ట్రేడింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే షేరు 5 శాతానికి పైగా పెరిగి ఇంట్రాడే గరిష్ఠం రూ.1,878ను తాకింది. ఈ స్థాయిలో ఎన్ఎస్ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్



సుమారు రూ.4.64 లక్షల కోట్లకు చేరింది. ఈ జోరు ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆ తర్వాత షేరు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. సోమవారం ఎన్ఎస్ఇ షేరు రూ.1,712కు పడిపోయింది. లిస్టింగ్ తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. లిస్టింగ్ రోజు నమోదైన గరిష్ఠ ధరతో పోలిస్తే షేరు దాదాపు 9 శాతం, ఐపీఓ ధరతో పోలిస్తే సుమారు 4 శాతం దిగువన ఉంది. షేరు ధరలో వచ్చిన ఈ దిద్దుబాటు ప్రభావం ఎన్ఎస్ఇ ర్యాంకుపైనా పడింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ సుమారు రూ.4.27 లక్షల కోట్లకు తగ్గడంతో దేశంలో అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల టాప్10 జాబితా నుంచి ఎన్ఎస్ఇ బయటకు వచ్చింది. ప్రస్తుతం 12వ స్థానంలో ఉంది. ఎన్ఎస్ఇ కంటే ముందు రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ టూబ్రో, ఎల్ఐసీ, హిందుస్తాన్ యూనిలీవర్, సన్ ఫార్మా ఉన్నాయి. మంగళవారం ఎన్ఎస్ఇ షేరు కొంత కోలుకుంది. షేరు ధర 1.53 శాతం లేదా రూ.26.35 పెరిగి రూ.1,749.85 వద్ద ఇంట్రాడే సెషన్‌ను ముగించింది.

# ఆటో రిటైల్ విక్రయాలు ఆల్‌టైమ్ స్పీడ్‌గేర్..

**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశీయ ఆటోమొబైల్ రిటైల్ విక్రయాలు సెప్టెంబర్‌లో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. పండుగల సీజన్‌లో పెరిగిన డిమాండ్‌తో పాటు గత ఏడాది తక్కువ బేస్ కారణంగా సెప్టెంబర్‌లో వాహనాల రిటైల్ విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 31.82 శాతం పెరిగి 25,36,920 యూనిట్లకు చేరుకున్నాయి. పరిశ్రమ సంస్థ ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ ఫాడా మంగళవారం విడుదల చేసిన డేటాలో ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబర్‌లో వాహనాల రిటైల్ విక్రయాలు 4.69 శాతం పెరిగాయి. దీంతో సెప్టెంబర్ ఆటో పరిశ్రమలో ఇప్పటివరకు నమోదైన అత్యుత్తమ నెలగా నిలిచింది. వార్షిక వృద్ధి గణాంకాలను జాగ్రత్తగా పరిశీలించాలని ఫాడా సూచించింది. 2025 సెప్టెంబర్‌లో జీఎస్టీ 2.0 అమలుకు ముందు కొనుగోళ్లను వాయిదా వేయడం వల్ల విక్రయాలు ప్రభావితమయ్యాయని తెలిపింది. 2027 తొలి అర్ధభాగంలో రిటైల్ విక్రయాలు 20.77 శాతం పెరిగి 1,55,12,319 యూనిట్లకు చేరుకుని రికార్డు సృష్టించాయి. ద్విచక్ర వాహనాలు 33.08 శాతం పెరిగి 17,90,188 యూనిట్లు ప్యాసింజర్ వాహనాలు 32.10 శాతం పెరిగి 4,27,213 యూనిట్లు, కమర్షియల్ వాహనాలు37.62 శాతం పెరిగి 1,03,557 యూనిట్లు సేల్స్ జరిగాయి. మూడు చక్రాల వాహనాలు 22.25 శాతం పెరిగి 1,32,570 యూనిటు అమ్మకాలు జరిగాయి. ట్రాక్టర్లు: 13.75 శాతం పెరిగి 76,906 యూనిట్లు, వీల్డ్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్: 38 శాతం పెరిగి 6,486 యూనిట్లు విక్రయాలుజరిగాయి. సెప్టెంబర్‌లో ప్యాసింజర్ వాహనాల రిటైల్ విక్రయాల్లో ఆల్టర్నేటివ్‌ఫ్యూయల్ వాహనాల వాటా 41 శాతానికి చేరుకుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.